అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 7-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 96
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు వెల : 6.50

ఏసుక్రీస్తు త్యాగాలు గొప్పవి : సీఎం కేసీఆర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏసుక్రీస్తుకు శిలువ వేయబడిన రోజు (ఏప్రిల్7) 'గుడ్‌ఫ్రైడే' సందర్భంగా ప్రజల కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాలను ఈసందర్భంగా సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. శిలువ మీద తన దేహానికి శీలలు కొడుతున్న వారిని సైతం క్షమించమంటూ ప్రార్థించారని గుర్తు చేశారు. మహోన్నత క్షమాగుణ సంపన్నులు ఏసుక్రీస్తు అని సీఎం కేసీఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'గుడ్‌ఫ్రైడే' క్రైస్తవులకు పరమ పవిత్రమైన రోజని తెలిపారు. సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల జాలి, అవధులు లేని త్యాగం, సడలని ఓర్పు, శత్రువుల పట్ల క్షమాగుణం అనే గొప్ప లక్షణాలను కలిగివుండడం కరుణామయుడైన ఏసుక్రీస్తుకే సాధ్యమైందని గుర్తుచేశారు. ఈ లక్షణాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాల్సిన అవసరమున్నదని పిలుపునిచ్చారు. మానవజాతికి శాంతి, సహనం, అహింస సౌభ్రాతృత్వాలను తన ఆచరణ ద్వారా క్రీస్తు సమస్త మానవాళికి సందేశమిచ్చారని తెలిపారు. విభేదాలు, తారతమ్యాలు లేకుండా మనుషులంతా ఒక్కటిగా కలిసి...5లో



ఢిల్లీలో...

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

పార్లమెంట్ నుంచి విజయ్ చౌక్ వరకు ప్రతిపక్షాల తిరంగా మార్చ్

- అడ్డుకున్న పోలీసులు
- అదానీపై జేపీసీ వేయడానికి మోడీ సర్కార్‌కు భయం : ప్రతిపక్షాలు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తిరంగా మార్చ్ నిర్వహించాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగింపు రోజు గురువారం ప్రతిపక్ష నేతలంతా జాతీయ జెండాలు పట్టుకుని పార్లమెంటు నుంచి విజయ్ చౌక్ వరకు తిరంగా మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌ను పార్లమెంట్ గేట్ నంబర్ 1 వద్ద జాతీయ జెండా పట్టుకొని యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ఎంపీలు పెద్ద పెట్టున నినాదాల హోరెత్తించారు. విజయ్ చౌక్‌కు చేరుకున్న తిరంగా మార్చ్‌ను అక్కడ పోలీసులు అడ్డుకున్నారు. అప్పటికే భారీగా ఏర్పాటు చేసిన బారికేడ్లతో ప్రతిపక్ష నేతలు అడ్డుకున్నారు. అదానీపై సమగ్ర విచారణకు జేపీసీ వేయాలని, రాహుల్ గాంధీపై వేసిన అనర్హత వేటును వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతిపక్షాలకు చెందిన ప్రముఖులు, నాయకులపై ఐటీ, ఈడీ, సీబీఐలను ప్రయోగించి వేధింపులకు గురి చేయడాన్ని వెంటనే ఆపేయాలని డిమాండ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సీపీఐ(ఎం), సీపీఐ, ఆర్జేడీ, ఎస్పీ, ఆప్, బీఆర్ఎస్, జేడీయూ, ఎన్సీపీ, ఐయూఎంఎల్, ఆర్ఎస్పీ, శివసేన (ఠాక్రే), వీసీకే, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్ఎల్డీ, జేఎంఎం, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే తదితర పార్టీలు ఆందోళనలో భాగస్వామ్యం అయ్యాయి.

మోడీ సర్కార్‌కు ఎందుకంత భయం..

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ప్రతిపక్ష పార్టీల నేతలు ఎండగట్టారు. కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రధాని మోడీ పేరుకే ప్రజాస్వామ్యమని అంటుంటారనీ, ఆచరణలో ఉండదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. అదానీ-హిండెన్‌బర్గ్ సమస్యపై జేపీసీ ఎందుకు వేయరనీ, ప్రభుత్వం...5లో



ముగిసిన పార్లమెంట్

ఆరు బిల్లులు ఆమోదం

- సమావేశాలు జరిగిన తీరు లోక్‌సభలో 34శాతం,రాజ్యసభ 24శాతం

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. అధికార, ప్రతిపక్షాల ఆందోళనలతో అధిక భాగం వాయిదాల పర్వమే కొనసాగింది. దీంతో ఉభయ సభలు షెడ్యూల్ కంటే చాలా తక్కువ సమయమే పనిచేశాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మొత్తం ఎనిమిది...5లో



" ప్రతి ఇంటికీ అవసరమైన పాలు, పాల ఉత్పత్తులపై జీఎస్టీ అమలు చేయొద్దని ఎన్ని విన్నపాలు చేసినా కేంద్రం వినిపించుకోలేదు. అంతిమంగా తాను అనుకున్నదే చేసింది. పాలను జీఎస్టీ పరిధిలోకి తేవడం వల్ల పేదలపై ఎలాంటి భారం పడదని నమ్మబలికింది. కానీ కేంద్రానిది ఎంతటి వంచనో ఇప్పుడు అనుభవంలో తెలుస్తున్నది "

పాలకేడ్చే కాలమొచ్చే

ద్రవ్యోల్బణం ఎఫెక్ట్

- కోవిడ్ అనంతరం మారిన పరిస్థితి


న్యూఢిల్లీ : మోడీ పాలనలో దేశంలో పాలు, పాల ఉత్పత్తుల ధరలకు రెక్కలొచ్చి ఆకాశానికి ఎగురుతున్నాయి. జీఎస్టీ దెబ్బకు పేదింటి బిడ్డల ఆకలి తీర్చలేనంటున్నాయి. ఇటీవలి ద్రవ్యోల్బణం కారణంగా గడిచిన 20 నెలల కాలంలో వీటి ధరల్లో మరింత పెరుగుదల కనిపిస్తున్నది. మరీ ముఖ్యంగా గత ఐదు నెలల్లో దేశంలో పెరిగిన ఇతర నిత్యావసరాల ధరల స్థాయి కంటే వీటి ధరలు అధికంగా పెరిగాయి. సరఫరా, డిమాండ్ స్థాయిల ఆధారంగా పాలు, పాల ఉత్పత్తుల ధరలు అధికంగా ఉంటున్నాయని పాల పరిశ్రమకు చెందిన నిపుణులు అన్నారు.


2021 జులై నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ ప్రతి నెలలోనూ వినియోగ ధరల సూచీకి సంబంధించి పాలు, పాల ఉత్పత్తుల విభాగంలో ద్రవ్యోల్బణ రేటు గణనీయంగా పెరిగింది. 2022 అక్టోబర్ నుంచి దేశంలో ఇతర ఉత్పత్తుల ధరల పెరుగుదలతో పోలిస్తే పాల ధరలో పెరుగుదల అధికంగా ఉన్నది. గతేడాది ఏప్రిల్ 4న లీటరు పాల ధర రూ. 51.40 ఉండగా ఈ సంవత్సరం అదే తేదీన రూ 56.80 ఉన్నది.

వినియోగ వ్యవహారాల విభాగం అందించిన గణాంకాల ప్రకారం ఈ సంవత్సర కాలంలో ధరలో 10.5 శాతం పెరుగుదల కనిపించింది. ఇప్పటికే కేంద్రం విధించిన జీఎస్టీ కారణంగా పాలు సైతం భగ్గున మండుతుండగా, ఇప్పుడు ఉత్పాదక వ్యయం కూడా పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని జాతీయ డెయిరీ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త బి.ఎస్. చందల్ తెలిపారు. పశు గ్రాసం, దాణాలో ఉపయోగించే మూలకాల ధరలు బాగా పెరిగాయని ఆయన చెప్పారు. కోవిడ్, దాని తదనంతర కాలంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా పాల ఉత్పత్తి పడిపోయిందని వివరించారు. దాణా డిమాండ్‌లో కేవలం 60 శాతం మాత్రమే మన దేశంలో సరఫరా అవుతున్నదనీ, దీనితో ఉత్పాదక వ్యయం పెరిగి పాల ధర అధికంగా ఉన్నదని అన్నారు.

పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణమేనని జాతీయ డెయిరీ సంస్థ అధ్యక్షుడు ఆర్.ఎస్. సోఢీ తెలిపారు. లాక్‌డౌన్ సమయంలో పాలకు డిమాండ్ పడిపోవడంతో డెయిరీ పరిశ్రమపై ప్రతికూల ప్రభావం పడిందని ఆయన చెప్పారు. డిమాండ్ తగ్గినంత మాత్రాన ఉత్పత్తి పడిపోలేదని, దీనివల్ల ఆ కాలంలో పాలు, పాల ఉత్పత్తుల ధరల్లో కొంత తగ్గుదల కన్పించిందని అన్నారు. దీంతో ఆ తర్వాతి కాలంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు రైతులు ఆసక్తి చూపలేదని చెప్పారు. దేశంలో పాల ఉత్పత్తి ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉందని,...5లో








సింగరేణిని ప్రయివేటీకరించే కుట్ర

ఈ చర్యలను నిరసిస్తూ జంగ్ సైరన్ మోగిద్దాం

బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి కేటీఆర్ పిలుపు

- 8న మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం, కొత్తగూడెంలో మహాధర్నాలు
- ప్రయివేటీకరణపై ప్రధాని ఏం సమాధానం చెబుతారని ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం సింగరేణిని పూర్తిగా ప్రయివేటీకరించి చేతులు దులుపుకోవాలన్న కుట్రలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా సింగరేణిలో మరోసారి బొగ్గు గనుల వేలానికి కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆ చర్యలను నిరసిస్తూ భారీ స్థాయిలో మహా ధర్నా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు. ఈ నెల 8న మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఈ ధర్నాలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ మేరకు సింగరేణి ప్రాంతంలోని జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో గురువారం కేటీఆర్ మాట్లాడారు. ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం సింగరేణి ప్రయివేటీకరణ ప్రయత్నాలను ఆపాలని అనేకమార్లు విజ్ఞప్తి చేస్తున్నా... కేంద్రం మాత్రం కుట్రపూరితంగా గనుల వేలం ప్రక్రియను మరోసారి తెరపైకి తీసుకొచ్చిందని అన్నారు. ఇప్పటికే పలుమార్లు గనులవేలానికి ప్రయత్నించినా ప్రయివేటు కంపెనీల నుంచి ఎలాంటి స్పందన రాలేదనీ, మరోవైపు ఇవే గనులని నేరుగా సింగరేణికి కేటాయించాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నా..... కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటు ఆ సంస్థ కార్మికులు, ఇటు రాష్ట్ర ప్రజలు ఏకకంఠంతో సింగరేణి కోసం ప్రత్యేకంగా గనులు కేటాయించాలని కోరినా, పట్టించుకోకుండా సత్తుపల్లి బ్లాక్ 3, శ్రావణ పల్లి, పెనగడప గనుల వేలం కోసం మరోసారి నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. మార్చి 29 నుంచి మే 30 వరకు ఈ గనులకు వేలం ప్రక్రియను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలనీ, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా సింగరేణికి నేరుగా బొగ్గు గనులను కేటాయించాలని...5లో

గురుకులాల్లోని 9,231 నోటిఫికేషన్ల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

వివరాలు 2లో..

పది పరీక్షల లీక్ కేసులో.. బండి సంజయ్‌కి బెయిల్

వివరాలు 2లో..



మాట్లాడుతున్న విజయ రాఘవన్

ఇక ఐక్య పోరాటాలే..

వ్యవసాయ కార్మిక, గ్రామీణ పేదల వ్యతిరేక విధానాలపై ఉద్యమం

- ఏప్రిల్ 20 నుంచి పదివేల గ్రామాల్లో ఆందోళన సభలు :ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ సర్కార్ వ్యవసాయ కార్మిక, గ్రామీణ పేదల వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఏప్రిల్ 20 నుంచి పది వేల గ్రామాల్లో ఆందోళనా సభలు నిర్వహిస్తామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి. వెంకట్ తెలిపారు. రెండు రోజుల పాటు తెలంగాణ,ఏపీ భవన్‌లో జరిగిన ఏఐఏడబ్ల్యూయూ వర్కింగ్ కమిటీ సమావేశం గురువారం ముగిసింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు విక్రమ్ సింగ్, వి.శివదాసన్...2లో

కురిసింది వాన...

హైదరాబాద్‌లో ఈదురు గాలులతో భారీ వర్షం

- పలుచోట్ల వడగండ్లు
- రోడ్లు జలమయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉపరితల ద్రోణి ప్రభావంతో హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్, నల్లకుంట, అంబర్‌పేటతోపాటు సికింద్రాబాద్...2లో



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సామాజిక న్యాయం కోసం జనజాతరలు

15 నుంచి 30వరకు సాంస్కృతికోత్సవాలు

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక న్యాయం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జన జాతరలు నిర్వహించనున్నట్టు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వృత్తిదారుల సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, తెలంగాణ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, మత్స్యకారులు, మత్స్య...2లో

తాజ్‌మహల్, కుతుబ్‌మినార్‌లను కూల్చేయండి..

అక్కడ దేవాలయాలు కట్టండి




- ఏడాది జీతం విరాళంగా ఇస్తా : అసోం బీజేపీ ఎమ్మెల్యే కుర్మి

వివరాలు 5లో..

వడ్డీ రేట్లు యథాతథం

రెపో రేటు 6.5 శాతంగా కొనసాగింపు

- జీడీపీ కూడా అంతే..
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సవాళ్లు
- ఆర్బీఐ గవర్నర్ వెల్లడి



వివరాలు 5లో..

తొలగించిన పాఠ్యాంశాలను పునరుద్ధరించండి : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : ఎన్‌సీఈఆర్‌టీయ పుస్తకాల ద్వారా చరిత్ర సిలబస్‌ను మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సీపీఐ(ఎం)పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేసింది. సిలబస్‌ను క్రమబద్ధీకరించేందుకు, విద్యార్థులపై భారాన్ని తగ్గించేందుకే ఇలా చేశామని ఎన్‌సీఈఆర్‌టీ చీఫ్ చేస్తున్న విచిత్రమైన వాదన పూర్తిగా తప్పుదారి పట్టించేదిగా పేర్కొంది. చరిత్రను మతోన్మాద ధోరణులతో తిరగరాయడానికి చేస్తున్న ప్రాజెక్టులో ఇది ఒక భాగమని పొలిట్‌బ్యూరో...5లో

గాంధీ పేరంటేనే సంఘ్‌కు కంటగింపు

దుష్ప్రచారం కొనసాగవచ్చు



- చరిత్రను తుడిచేయడమే వారి లక్ష్యం
- తుషార్ మండిపాటు

వివరాలు 5లో..

తెలంగాణకు కేంద్రం మోసం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రం విడిపోయేటప్పుడు విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయకుండా తెలంగాణకి మోడీ ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య విమర్శించారు. గురువారం నాడిక్కడ తెలంగాణ, ఏపీ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్ తో కలిసి విలేకరుల సమా వేశంలో జి. నాగయ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాజీపేట కోచ్ సెంటర్ ఏర్పాటు, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు గిరిజన యూని వర్సిటీ ఏర్పాటు 8 ఏండ్లు గడిచినా అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోడీ నిలువునా మోసం చేశారని విమర్శించారు. కాజీపేటకు రావలసిన కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తరలించాలని, బయ్యారం ఉక్కు గనుల ఫ్యాక్టరీ మోడీ అనుచరుడైన అదానీ కనుసైగలతో గుజరాత్‌కు తరలించారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ పాలకులు తెలంగాణలో అధికారం లోకి వస్తామని కలలగంటున్నారని, ఇది వారికి కలగానే మిగులుతుందని హెచ్చరించారు.

గొర్రెల పంపిణీకి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. గురువారం ఈమేరకు జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గొర్రెల యూనిట్ల సేకరణ, రవాణా, లబ్ధిదారుల నుంచి డిపాజిట్లు సేకరణ తదితర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రెండో విడతలో 3.38 లక్షల మందికి గొర్రెలను పంపిణీ చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలోనే గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. రవాణా సంబంధిత టెండర్లను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లాల ప్రజలు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- మిల్లర్ల దోపిడీని అరికట్టాలి: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో యాసంగి పంట చేతికొచ్చే సమయం ఆసన్నమవుతుందనీ, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. తద్వారా మిల్లర్ల దోపిడీని అరికట్టాలని కోరింది. గురువారం ఈమేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ ఒక ప్రకటన విడుదల చేశారు. మద్దతు ధరల కంటే తక్కువ ధరలకు మిల్లర్లు సిండికేటుగా ఏర్పడి రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో పండిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. వడగండ్ల వానల వల్ల చేతికొచ్చిన పంటను దెబ్బతీంటున్నాయని తెలిపారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించిన సర్వే వివరాలను ప్రకటించాలని కోరారు. 33 శాతం పంట దెబ్బతింటేనే పరిహారం అంటూ వ్యవసాయ అధికారులు మాట్లాడటం సరైందికాదని హెచ్చరించారు. ఏమేరకు పంట దెబ్బతిన్నా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

సర్వమానవాళి సంక్షేమం కోసమే

- యేసుక్రీస్తు కనబరిచిన గొప్ప ప్రేమ
- గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సర్వ మానవాళి సంక్షేమం కోసం యేసుక్రీస్తు గొప్ప ప్రేమను కనబరిచారని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు యేసుక్రీస్తు శిలువ వేయబడిన రోజును గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటున్న నేపథ్యంలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రత్యేక రోజున ఆయన త్యాగాన్ని కీర్తనలు పాడటం, ప్రార్థనలు చేయటం ద్వారా కతజ్ఞతలు తెలుపు కుంటారని గుర్తుచేశారు. ప్రభువు అన్ని వేళలా మనందరిని ప్రభువు మార్గంలో నడిచేలా మార్గనిర్దేశనం చేయాలని ఆమె ప్రార్థించారు.

గవర్నర్‌తో సాయికుమార్

ప్రముఖ సినీ నటుడు పి.సాయికుమార్ గవర్నర్ తమిళిసైతో సమావేశమయ్యారు. గురువారం రాజ్ భవన్ లో గవర్నర్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

సామాజిక న్యాయం కోసం జనజాతరలు

(మొదటిపేజీ తరువాయి)

కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబుతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెస్లీ మాట్లాడారు. సామాజిక ఉద్యమ నేతల జయంతులను పురస్కరించుకుని 15నుంచి 30వరకు 15 రోజుల పాటు పూలే, అంబేద్కర్ జయంతుల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తం గా మనువాదుల కుట్రలను ఎండగడుతూ సాంస్కృతికో త్సవాలు, జన జాతరలు నిర్వహించాలని పిలుపునిచ్చా రు. భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి, దాని స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని నెలకొల్పేందుకు బీజేపీ పాల కులు కుయుక్తులు పన్నుతున్నారని చెప్పారు. అందువల్ల రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింద న్నారు. మోడీ సర్కార్ ప్రభుత్వ రంగాన్నంతా కారు చౌక గా కార్పొరేట్లకు అప్పగించి..రిజర్వేషన్లకు సమాధి కడు తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ కుల గణన ఎందుకు చేపట్టటం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ జనాభా దామాషా ప్రకారం వారికి నిధులు కేటాయించలేదని తెలిపారు. అదే సమ యంలో కార్పొరేట్లకు రూ.10 లక్షల కోట్ల రాయితీ లు ఇవ్వడమంటే మోడీ ప్రభుత్వం ఎవరి పక్షమో అర్థమవు తుందన్నారు. పేదలపై తీవ్రమైన భారాలు మోపుతూ..ఆ వైపుగా వాళ్ళ ఆలోచించకుండా వైషమ్యాలను రగిలుస్తు న్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంవి రమణ మాట్లాడు తూ సామాజిక ఉద్యమ మహనీయులైన పూలే, అంబే ద్కర్ స్ఫూర్తితో బలహీన వర్గాల కోసం ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. బీజేపీ సర్కార్ చేస్తున్న మోసాలను జన జాతర సందర్భంగా ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ రాజ్యాం గాన్ని తుంగలో తొక్కడం, రిజర్వేషన్లు ఎత్తేయడం ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగమన్నారు. బీజేపీ దాన్ని అమలు చేసేందుకు పూనుకుంటున్నదని చెప్పారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే గిరిజనులను అడవికి దూరం చేసే చట్టాలను తీసుకొస్తున్నదనీ, ఈ నేపథ్యంలో రాంజీగోండు, కొమరంభీం పోరాట స్ఫూర్తితో సామాజి కోద్యమాలను నిర్మించాల్సిన అవసరమని తెలిపారు. లెల్లెల బాల కృష్ణ మాట్లాడుతూ సామాజికోద్యమ నాయ కులైన పూలే, అంబేద్కర్‌ల స్ఫూర్తితో బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ ఏప్రిల్ 11న పూలే, 9న రాంజీ గొండ్ వర్ధంతి, 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 30న హైదరాబాదులో పూలే అంబేద్కర్ జన జాతరకు మేధావులు కవులు కళాకారులు సామాజిక ప్రజాసంఘాల నేతలందరిని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ మాట్లాడుతూ బీజేపీ మనువాద విధానాలకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలతో మైనార్టీలు కలిసి ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

ఏకరూపం.. సరికొత్తగా..

ఎరుపు, బూడిద రంగులో డ్రెస్ కోడ్

- రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది విద్యార్థులకు ఏర్పాట్లు
- హైదరాబాద్‌లో 938 పాఠశాలలు.. 1.29 లక్షల మంది విద్యార్థులు
- మొత్తం 6.47 లక్షల మీటర్ల వస్త్రానికి.. 1.30 లక్షల మీటర్లు రాక
- టైలర్లకు అందజేసిన ప్రధానోపాధ్యాయులు
- విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు..

రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్ (ఏకరూప దుస్తులు) ఈసారి సరికొత్తగా రూపుదిద్దుకుంది. ఎరుపు, బూడిద రంగులో డ్రెస్ కోడ్ అమల్లోకి రాబోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది విద్యార్థుల యూనిఫామ్ కోసం ప్రభుత్వం రూ.140 కోట్లు కేటాయించింది. స్కూల్ యూనిఫామ్‌ను పాఠశాలలు పున:ప్రారంభమయ్యే జూన్ 1 నాటికే ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థినులు, విద్యార్థులకు అందజేయాలి. కానీ ఏటా క్లాసులు ప్రారంభమై.. నెలలు గడిచిపోతున్నా.. అందే పరిస్థితి ఉండేది కాదు. దీంతో విద్యార్థులు పాతబట్టలతోనే తరగతులకు హాజరయ్యే పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం(2023-24)లో అలాంటి పరిస్థితి ఉండకూడదని భావించిన ప్రభుత్వం.. ఈసారి ముందుగానే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు బట్ట సరఫరా చేయాలని గత నెలలోనే అధికారులను ఆదేశించింది. హైదరాబాద్ జిల్లాకు వారం రోజుల కిందట ఐదు మండలాలకు సంబంధించి 1.30లక్షల మీటర్ల వస్త్రం చేరగా.. ప్రధానోపాధ్యాయులు వాటిని టైలర్లకు అందించారు. ఈ పని అన్ని జిల్లాల్లో జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

నవతెలంగా-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 16 రెవెన్యూ మండలాలు ఉండగా.. విద్యాశాఖ వీటిని 24 మండలాలుగా విభజించుకుంది. వీటి పరిధిలో 693 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు.. 245 ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. వీటిలో దాదాపు 1.29 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కో విద్యార్థికి యేటా రెండు జతల చొప్పున మొత్తం 2.58లక్షల యూనిఫామ్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు జిల్లాకు 6,47,487,06 మీటర్ల వస్త్రం అవసరం పడుతుంది. ఇందులో ఇప్పటికే గోల్కొండ, హిమాయత్‌నగర్, అంబర్‌పేట్, నాంపల్లి, అమీర్‌పేట్ మండలాలకు 1.30లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేశారు. యూనిఫామ్ కుట్టేందుకు ఆయా పాఠశాలల పరిధిలోని టైలర్లకు సైతం అధికారులు ఇచ్చేశారు. మిగతా 19 మండలాలకు వారం రోజుల్లో వస్త్రం రానుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



క్లాసుల వారీగా డిజైన్లు ఇవే..

రాష్ట్ర విద్యాశాఖ రానున్న విద్యాసంవత్సరం (2023-24)లో విద్యార్థుల కోసం ఐదు రకాల యూనిఫామ్ డిజైన్లు ఎంపిక చేసింది. రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో) ప్రత్యేకంగా క్లాత్‌ను విద్యాశాఖకు అందించింది. 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ఎరుపు, బూడిద రంగులలో యూనిఫాం, 4-5వ తరగతి విద్యార్థినులకు స్కర్ట్, దానిపై పట్టీలతో కూడిన షర్ట్ యూనిఫాం, 1 నుంచి 3వ తరగతి విద్యార్థినుల యూనిఫాం కుడివైపు ప్యాకెట్‌తో ఫ్రాక్, సూటింగ్ క్లాత్‌తో కుట్టిన బెల్ట్ రింగులు, స్లీవ్‌లపై సూటింగ్ రంగు పట్టీలతో ముద్రించిన ఎరుపు, బూడిద రంగు గీతలతో చొక్కా ఎంపిక చేశారు. 1వ నుంచి 7వ తరగతి బాలురకు నిక్కర్, షర్టు, 8 నుంచి 12వ తరగతి బాలురకు ప్యాంట్, చొక్కా అందనున్నాయి.

సరిపోని కుట్టు కూలి..!?

ప్రభుత్వ బడుల్లో 1-7 తరగతి వరకూ విద్యార్థులకు నిక్కర్, చొక్కా, 8-10 వరకు ప్యాంటు, చొక్కా అందిస్తారు. కింది తరగతి విద్యార్థినులకు స్కర్ట్, 8-10 తరగతి వరకు పంజాబీ డ్రెస్ అందజేస్తారు. ఒక్కో జత కుట్టేందుకు దర్జీకి రూ.50 వరకు చెల్లిస్తారు. ఇలాంటి డ్రెస్‌లు కుట్టేందుకు బయట టైలర్లు రూ.300-500 వరకు వసూలు చేస్తారు. ఇందుకు నాణ్యమైన గుండీలు, దారం ఉపయోగించటం వల్ల కుట్టు మన్నికగా ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలకు అందించే దుస్తుల కుట్టు కూలి రూ.50 మాత్రమే ఉంది. దాంతో కొందరు కాంట్రాక్టర్లు నాసిరకం దారం, గుండీలు ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వమిచ్చే కుట్టు కూలి గిట్టుబాటు కాక.. చాలామంది టైలర్లు.. తరగతుల వారీగా విద్యార్థిని, విద్యార్థుల కొలతలను అంచనా వేసి దుస్తులు కుడుతున్నారు. ఫలితంగా పంపిణీ అనంతరం విద్యార్థుల్లో కొందరికి బిగుతుగా, వదులుగా ఉంటున్నాయి.

7వ తరగతి విద్యార్థులకు నిక్కర్!!

ప్రభుత్వం 1-7 తరగతి విద్యార్థులకు నిక్కర్, చొక్కా అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం అంతంతే. అలాంటిది ఏడో తరగతి విద్యార్థులను నిక్కర్ తొడుక్కొని స్కూళ్లకు రావాలంటే ఇబ్బందిగా ఫీలవుతున్నారు. కొంతమంది సొంత డబ్బుతో దుస్తులు కుట్టించుకుంటున్నారు. ఇది నిరుపేద కుటుంబాలకు భారమే. ఇదిలావుంటే, ఒక తరగతి గదిలో అందరూ ఒకే విధంగా ఉండరు. కొందరు పొడవు, పొట్టిగా వారివారి శరీర తత్వాన్ని బట్టి ఉంటారు. ఈ నేపథ్యంలో 8-10 తరగతి విద్యార్థుల మాదిరిగానే 5-7 తరగతి విద్యార్థులకు ప్యాంట్, షర్ట్ ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తోంది.

కుట్టుకూలి పెంచితే మరింత నాణ్యతగా..

విద్యాశాఖ కొనుగోలు చేసి ఇచ్చిన క్లాత్ ఒక్కో జత కుట్టడానికి రూ.50 చెల్లిస్తోంది. కుట్టు కూలి తక్కువ కావడంతో నాణ్యత ఉండటం లేదని తల్లిదండ్రులు, పలువురు ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. నగరంలో టైలర్ల మధ్య పోటీ కారణంగా తక్కువ ధరకు కుట్టడానికి కొందరు ముందుకు వస్తున్నారు. కానీ కుట్టు మన్నికగా ఉండటం లేదు. కొంత మంది ఉన్నదాంట్లోనే కొంచెం నాణ్యతతో అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఒక్కో జతకు ఇచ్చే కూలి పెంచితే యూనిఫామ్స్ మరింత నాణ్యతగా అందిస్తామని నగరానికి చెందిన ఓ టైలర్ తెలిపారు.

బడుల ప్రారంభానికి ముందే యూనిఫాం..

గత నెలలో టెస్కో సంస్థ నుంచి నేరుగా జిల్లాలోని మండలాల పాయింట్లకు క్లాత్ చేరింది. వచ్చిన క్లాత్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశాం. వారు టైలర్లకు అందించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలలు పున:ప్రారంభమయ్యే లోపే విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తాం.

కనీజ్ ఫాతిమా- సెక్టోరియల్ అధికారి- హైదరాబాద్

ఇక ఐక్య పోరాటాలే..

(మొదటిపేజీ తరువాయి)

(రాజ్యసభ ఎంపీ)తో కలిసి ఎ.విజయ రాఘవన్, బి. వెంకట్ మాట్లాడారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల పరిస్థితిపై చర్చించామని తెలిపారు. మూడు నెలల్లో 25 వేల గ్రామాల్లో ఆందోళనా సభలు నిర్వహిస్తామని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందనీ, అందులోనూ గ్రామీణ నిరుద్యోగం భారీగా పెరిగిందని తెలిపారు. 10 నుంచి 15 కోట్ల మంది గ్రామీణ పేదలకు ఉపాధి లేదని అన్నారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల కొనుగోలు శక్తి తగ్గిందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో సబ్సిడీ ఆహార పదార్థాలను తొలగిస్తోందనీ, ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. రెండేండ్లుగా పశ్చిమ బెంగాల్‌తో సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక్క రోజు కూడా ఉపాధి హామీ ద్వారా పని కల్పించలేదని పేర్కొన్నారు. ఉపాధి హామీకి నిధుల కోత విధిస్తున్నారని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వేల కోట్ల బకాయిలు కేంద్రం విడుదల చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆధార్ లింక్, ఆన్‌లైన్ హాజరు, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి వ్యవస్థలతో ఉపాధి హామీని హననం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మోడీ సర్కార్ హయాంలో లక్ష మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. దేశంలో ఆరు లక్షల హెక్టార్ల భూమి ఉన్నదనీ, దాన్ని భూమి లేని వారికి పంపిణీ చేయాలన్నారు. కానీ మోడీ సర్కార్ కార్పొరేట్లకు భూములను ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. బీజేపీ బడా వ్యాపారులు, ధనికులతో కలిసి ఎన్నికలకు వెళ్తుందని, కింది స్థాయి వారు బీజేపీకి అవసరం లేదని దుయ్యబట్టారు. ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాల మద్దతుతో దళితులపై దాడులు పెరిగాయని విమర్శించారు.

కురిసింది వాన...

(మొదటిపేజీ తరువాయి)

పరిసర ప్రాంతాల్లో వడగండ్ల వాన పడింది. పంజాగుట్ట ఏరియాలో భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయం నుంచి ఎండలు దంచికొట్టగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆకాశం మేఘావృతం అయింది. అనంతరం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా మలక్‌పేట్, వీఎస్‌టీతోపాటు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు నగరంలో హనుమాన్ శోభాయాత్రలు జరుగుతుం డగా.. కొన్ని ప్రాంతాల్లో వానతో ఆటంకం కలిగింది. కాగా పలు జిల్లాల్లోనూ వడగండ్లు పడ్డాయి.

మూడ్రోజులపాటు వర్షం

రాష్ట్రంలో మరో మూడ్రోజులపాటు ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 40 నుంచి 50 వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది.

ఎంసెట్‌కు భారీగా దరఖాస్తులు

- 2.66 లక్షల మంది దరఖాస్తు: ఉన్నత విద్యామండలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్‌కు భారీగా దరఖాస్తులొస్తున్నాయి. ఇప్పటి వరకు 2,66,680 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల పదో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. వచ్చేనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, అదేనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. ఈసెట్‌కు 15,285 దరఖాస్తులొ చ్చాయని తెలిపారు. వచ్చేనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. వచ్చేనెల రెండో తేదీన రాతపరీక్ష ఉంటుందని వివరించారు. ఐసెట్‌కు 20,150 దరఖాస్తులొచ్చాయని తెలిపారు. వచ్చేనెల ఆరో తేదీ వరకు దరఖాస్తు చేయొచ్చని సూచించారు. అదేనెల 26, 27 తేదీల్లో ఐసెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పీజీఈసెట్‌కు 3,846 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశముందని తెలిపారు. వచ్చేనెల 29 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు పీజీఈసెట్ రాతపరీక్షలుంటాయని పేర్కొన్నారు. లాసెట్‌కు 24,583 దరఖాస్తులొచ్చాయని వివరించారు. దరఖాస్తు గడువు ఈనెల 20వ తేదీ వరకు ఉందని తెలిపారు. వచ్చేనెల 25వ తేదీన లాసెట్ రాతపరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎడ్‌సెట్‌కు 8,820 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేయొచ్చని సూచించారు. వచ్చేనెల 18న రాతపరీక్ష ఉంటుందని తెలిపారు. అత్యల్పంగా పీఈసెట్‌కు 616 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. వచ్చేనెల ఆరో తేదీ వరకు దరఖాస్తు చేయొచ్చని తెలిపారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు రాతపరీక్షలుంటాయని వివరించారు.

లాసెట్ దరఖాస్తు గడువు 20 వరకు పెంపు

లాసెట్ దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు కన్వీనర్ బి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తర్వాత గడువును పెంచబోమని స్పష్టం చేశారు.


గురుకులాల్లోని 9,231 నోటిఫికేషన్ల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకులాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 9,231 పోస్టులకు గాను గురుకుల విద్యా సంస్థల నియామక బోర్డు 19 నోటిఫికేషన్లను గురువారం విడివిడిగా విడుదల చేసింది. డిగ్రీ కళాశాలల్లో 868, అధ్యాపక, ఫిజికల్ డైరెక్టర్ లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నది. జూనియర్ కళాశాలల్లో 2008 లెక్చరర్లు, పాఠశాలల్లో 1,276 పీఈటీ, 434 లైబ్రేరియన్, 275 ఫిజికల్ డైరెక్టర్, 134 ఆర్ట్స్, 92 క్రాఫ్ట్, 124 మ్యూజిక్, 4,020 టీజీటీ పోస్టులను భర్తీ చేయనున్నట్టు షార్ట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. ఈ నెల 12 నుంచి వన్ టైం రిజిస్ట్రేషన్ 17 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ మల్లయ్య భట్టు తెలిపారు. సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన వర్గాల సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీలకు వేర్వేరుగా ఉద్యోగ ఖాళీలకు సంబంధించి. వయో పరిమితి, విద్యార్హత, ఇతర వివరాలతో పూర్తి నోటిఫికేషన్ల దరఖాస్తుల ప్రారంభమైన రోజు నుంచి తమ అధికారిక వెబ్‌సైట్ అందుబాటులో ఉంటాయని మల్లయ్య భట్టు వెల్లడించారు. అయితే పేర్కొన్న పోస్టుల సంఖ్యలో హెచ్చుతగ్గులు ఉంచొచ్చని తెలిపారు. పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదలైన తర్వాత మొత్తం వివరాలపై ఓ స్పష్టత రానున్నదని పేర్కొ న్నారు. గ్రాడ్యుయేషన్ టీచర్ పోస్టులు 4,020 ఉండగా.. ఈ నెల 28 నుంచి మే 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. వేతన స్కేలు రూ.12,300 నుంచి రూ. 1,15,270వరకు ఉండనుంది. డిగ్రీ కళాశాలల్లో మొత్తం 868 పోస్టులకు గాను వేతనం రూ.54,220 నుంచి రూ. 1,33,630గా ఉంటుంది. వయో పరిమితి, పోస్టుల వారీగా వేతనం, కమ్యూనిటీ, విద్యార్హతలు, ఇతర వివరాలతో ఈ నెల 17న పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ నెల 17 నుంచి మే 17 వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అలాగే జూనియర్ కళాశాలల్లో 2008 పోస్టులకు (జూనియరల్ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్/ లైబ్రేరియన్) వేతనం రూ.54,220 నుంచి రూ.1,33,630 వరకు ఉండ నుంది. ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి మే 17 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని కన్వీనర్ ఈ సందర్భంగా పేర్కొ న్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్ ఉద్యోగాల్లో మొత్తం 1,276 పోస్టుల కు ఏప్రిల్ 24 నుంచి మే24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు.

వేతనం రూ.45,960 నుంచి రూ.1,24,150గా ఉంటుంది. మూడు గురుకుల సొసైటీల్లోని పాఠశాలల్లో 434 లైబ్రేరియన్ పోస్టులకు ఏప్రిల్ 24 నుంచి మే 24 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. వేతనం రూ. 38,890 నుంచి రూ.1,12,510గా ఉండనుంది. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 275 ఉండగా వీటికి కూడా అదే తేదీల్లో దరఖాస్తులు స్వీకరించ నున్నారు. వేతనం రూ. 42,300 నుంచి రూ.1,15,270 మధ్య ఉండనుంది. ఆర్ట్ టీచర్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు 134 ఉండగా, క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్ స్పెక్టర్ పోస్టులు 92 ఉన్నాయి. మ్యూజిక్ టీచర్ పోస్టులు 124 ఉన్నాయి.

జీబ్రానిక్స్ నుంచి ఆర్జీబీ మెకానికల్ కీబోర్డు



హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తి సంస్థ జీబ్రానిక్స్ కొత్త కీబోర్డును ఆవిష్కరించింది. జెబ్ మ్యాక్స్ నింజా 200 పేరుతో దీనిని తీసుకొచ్చింది. భారత్‌లో ఈ విధమైన మెకానికల్ కీబోర్డును తీసుకు రావడం ఇదే మొదటిసారి. ఇందులో అధునాతన ఫీచర్లు ఉన్నాయి. దీనిని సంస్థ డైరెక్టర్ యశ్ దోషి ఆవిష్కరించారు. ఈ ఆర్‌జీబీ మెకానికల్ కీబోర్డు అవసరం కేవలం గేమర్లకు మాత్రమే కాదనీ.. పీసీ లేదా ల్యాప్‌టాప్‌లపై అధిక సమయం వెచ్చించి పని చేసే ప్రొఫెషనల్స్ కోసం కూడా తీసుకొచ్చినట్టు ఉత్పత్తి ఆవిష్కరణ సందర్భంగా యశ్ దోషి అన్నారు. రూ. 4499కి ఈ కీబోర్డు అమెజాన్‌లో అందుబాటులో ఉండనున్నది.

పది పరీక్షల లీక్ కేసులో.. బండి సంజయ్‌కి బెయిల్

నవతెలంగాణ- హనుమకొండ

పదవ తరగతి పరీక్ష పేపర్ లీకేజీ కేసులో అరెస్టయిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్‌కు బెయిల్ మంజూరయింది. దీనిపై రోజంతా హైడ్రామా నడిచింది. హనుమకొండ జిల్లా కోర్టులో గురువారం మధ్యాహ్నం 2.30 గంటల నుండి రాత్రి పొద్దు పోయేవరకు దాదాపు ఎనిమిది గంటలు వాడి వేడిగా ఇరుపక్షాలు తమ వాదనలు వినిపించారు. బండి సంజయ్ తరపున అడ్వకేట్లు సి. విద్యాసాగర్ రెడ్డి, చోల్లేటి రామకృష్ణ, సంసాని సునీల్ తమ వాదనలు వినిపించారు. శుక్రవారం తన అత్తగారి దశదినకర్మ ఉందని, శనివారం ప్రధానమంత్రి మోడీ పర్యటన హైదరాబాద్‌లో ఉందని, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్ అతని పర్యటనలో ఉండాలి కాబట్టి తప్పనిసరిగా బెయిల్ ఇవ్వాలని వాదిం చారు. కస్టడీ రిపోర్టు పెండింగ్‌లో ఉండగా అది కుదరదని న్యాయమూర్తి చెప్పడంతో పోలీసులు ఎప్పుడు విచారణకు హాజరుకమ్మంటే అప్పుడు హాజరవుతారని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతి.. తమ వాదనలు వినిపిస్తూ బండి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసు కోవద్దని, ఒకవేళ అతనికి బెయిల్ ఇస్తే సాక్షాలను తారుమారు చేసే అవకాశం ఉందని, ఇప్పటికే బండి సంజయ్ ఫోన్ ఆచూకీ లేదని, ఆ ఫోన్లో విలువైన సమాచారం ఉందని, కేసు విచారణ కీలక దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వొద్దని గట్టిగా వాదించారు. హైకోర్టు కూడా ఈ కేసును సోమవారంకు వాయిదా వేసిందని, బెయిల్ పిటిషన్‌నూ సోమవారంకు వాయిదా వేయాలని కోరారు. కాగా, బెయిల్ పిటిషన్‌పై ఈ రోజే నిర్ణయం తీసుకోవాలని, లేదంటే తాము హైకోర్టుకు వెళ్లే అవకాశం కోల్పోతామని, అవసరమైతే కేసును ఉపసంహరించుకుంటామని సంజయ్ తరపున అడ్వకేట్లు వాదించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఇలాంటి కేసును ఇంతవరకు చూడలేదని, ఈ కేసును ప్రత్యేకంగా గ్రౌండ్స్ కింద విచారిస్తామని అన్నారు. చివరకు రాత్రి 10 గంటలకు న్యాయమూర్తి బండి సంజయ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.20వేల పూచీ కత్తుతో డిఫెన్స్ లాయర్ల వాదనతో ఏకీభవించి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. శుక్రవారం మధ్యాహ్నంకు బండి జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది.

ఈటల రాజేందర్‌కు నోటీసులిచ్చిన పోలీసులు

పదవ తరగతి పరీక్ష లీక్ కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు ఈటల రాజేందర్‌కు వరంగల్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వరంగల్ డీసీపీ ముందు హాజరు కావాలని నోటీసులు ఇవ్వడంతో స్పందించిన ఈటల రాజేందర్ వరంగల్ డీసీపీకి ఉత్తరం రాశారు. తనకు ముందున్న షెడ్యూల్ ప్రకారం శుక్రవారం హాజరు కాలేనని, ఈ నెల పదవ తారీఖున హాజరవుతానని తెలిపారు.

తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు మోడీకి లేదు

- 8న ప్రధాని పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసనలు : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విభజన హామీలు అమలు చేయని ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఈనెల ఎనిమిదో తేదీన ఆయన హైదరాబాద్ పర్యటనను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద నల్లబ్యాడ్జీలు, నల్ల జెండాలతో నిరసనలు చేపడతామని పేర్కొన్నారు. తొమ్మిదేండ్ల కాలంలో తెలంగాణకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన విశ్వవిద్యాలయం వంటి విభజన హామీలను అమలు చేయ లేదని తెలిపారు. సింగరేణిలోని సత్తుపల్లి, ఇల్లందులోని కోయగూడెం, మందమర్రిలో మొత్తం నాలుగు బొగ్గు గనుల ప్రయివేటీకరణ కోసం టెండర్లు పిలవడాన్ని తీవ్రంగా ఖండించారు. రామగుండం ఎరువుల కర్మాగారం ప్రారంభోత్సవానికి వచ్చినపుడు సింగరేణిని ప్రయివేటీకరణ చేయబోమంటూ ప్రధాని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ బొగ్గు గనుల కోసం మళ్లీ టెండర్లు పిలిచి ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి అబద్ధాలు ఆడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

తెలంగాణకు విద్యాసంస్థలను కేటాయించని మోడీ : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విభజన హామీల్లో ఉన్న విద్యారంగానికి సంబంధించిన వాటి అమలు ఇంకెప్పుడు అంటూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. తెలంగాణకు ఉన్నత విద్యాసంస్థలను కేటాయించని మోడీకి హైదరాబాద్ వచ్చే హక్కు లేదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలను కేటాయించకుండా తెలంగాణ పట్ల వివక్షను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాను నిలదీయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు.

పది పరీక్ష ప్రశాంతం

- 99.62 శాతం మంది విద్యార్థుల హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఇంగ్లీష్ (థర్డ్ లాంగ్వేజ్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొదటిరోజు తెలుగు, రెండోరోజు హిందీ ప్రశ్నాపత్రాలు వాట్సాప్ ద్వారా బయటకు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో మిగిలిన పరీక్షలు ఎలా జరుగుతాయోనని విద్యాశాఖ అధికారులు ఆందోళనకు గురయ్యారు. అయితే గురువారం ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్ష ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ పరీక్షకు 4,85,704 మంది దరఖాస్తు చేసుకుంటే, 4,83,856 (99.62 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 1,838 (0.38 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థుల్లో 1,003 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 441 (43.97 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 562 (56.03 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

మహిళా జర్నలిస్టులకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాచార పౌర సంబంధాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో మహిళా జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరంలో గురువారం వరకు 267 మహిళా జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళా జర్నలిస్టులకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసినట్టు సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే మాస్టర్ హెల్త్ చెకప్‌లో రక్త పరీక్ష (సీబీపీ), బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బీ12, డీ3 ,ఈసీజీ, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్‌స్మెర్ వంటి రోగనిర్ధారణ పరీక్షలు ఉన్నాయి, స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు చేస్తున్నారు. అదే రోజు పరీక్షల నివేదికలను అందచేస్తున్నారు. వైద్య అధికారులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల స్వీయ పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఈ విధానం పట్ల పరీక్షలు చేయించుకున్న మహిళా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సబియా మదాహత్ తొలగింపు ఉత్తర్వులను నిలిపేయాలి

- విద్యాశాఖ కార్యదర్శికి యూఎస్‌పీసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హన్మకొండ జిల్లా కమలాపూర్ ఉన్నత పాఠశాలలో హిందీ పరీక్ష ప్రశ్నాపత్రం బయటకు వచ్చిన సంఘటనలో ఇన్విజిలేటర్ సబియా మదాహత్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆ జిల్లా డీఈఓ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. సమగ్ర విచారణ అనంతరమే చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను గురువారం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, వై అశోక్ కుమార్, టి లింగారెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల నాలుగో తేదీన హన్మకొండ జిల్లా కమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) రూమ్ నంబర్ మూడు నుంచి పదో తరగతి హిందీ పరీక్ష ప్రశ్నాపత్రం బయటకు వచ్చిన సంఘటనలో బాధ్యురాలిని చేస్తూ ఆ రూమ్‌లో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నేరెళ్ల యూపీఎస్ ఉపాధ్యాయిని సబియా మదాహత్‌ను ఎటువంటి విచారణ లేకుండా సర్వీసు నుంచి తొలగిస్తూ అదేరోజు ఆ జిల్లా డీఈఓ ఉత్తర్వులిచ్చారని తెలిపారు. ప్రశ్నాపత్రం లీకేజీ పేరుతో ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలు చేయటానికో లేక సంచలనం సృష్టించటానికో రాజకీయ కుట్ర కోణంలో ఈ సంఘటన జరిగినట్టు పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. దర్యాప్తు సాగుతున్నదని వివరించారు. ఎవరి పాత్ర ఏమిటో విచారణలో తేలుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థుల్లో గందరగోళం సృష్టించి, ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయటానికి ప్రయత్నించిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అయితే గది నుంచి ప్రశ్నాపత్రం బయటకు పోవటంలో ఇన్విజిలేటర్ ఏమరుపాటు కారణమైతే కావచ్చు కానీ ఉద్దేశపూర్వకంగా నిందితులకు సహకరించినట్టు నిరూపణ కాలేదని పేర్కొన్నారు. మొదటి పావుగంటలో ఓఎంఆర్ షీట్లను చెక్ చేసి సంతకాలు పెడుతున్న క్రమంలో ఊహించని రీతిలో మైనర్ బాలుడు చెట్టెక్కి మొదటి అంతస్తుకు వచ్చి కిటికీ చాటునుంచి ప్రశ్నాపత్రాన్ని ఫొటో తీసిన విషయం గమనించలేదని వివరించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరపకుండా, తీవ్రమైన దండన విధించే సందర్భంలో అనుసరించాల్సిన కనీస సీపీఏ నిబంధనలు పాటించకుండానే ఉపాధ్యాయురాలిని ఏకపక్షంగా ఉద్యోగం నుంచి తొలగించటం సమంజసం కాదని తెలిపారు. హన్మకొండ డీఈఓ చర్య రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నదని విమర్శించారు. పదో తరగతి పరీక్ష విధులు నిర్వహించాలంటేనే ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యదర్శి జోక్యం చేసుకుని డీఈఓ ఉత్తర్వులను నిలిపేయాలని కోరారు. సమగ్ర విచారణ జరిపించిన అనంతరమే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మూల్యాంకన కేంద్రాల వద్ద కాంట్రాక్టు అధ్యాపకుల మౌన ఆవేదన

- 11 వరకు నిర్వహించాలని నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు కోసం వారు ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాల వద్ద గురువారం నుంచి మౌన ఆవేదన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 11వ తేదీ వరకు దీన్ని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టీఎస్‌జీసీసీఎల్‌ఏ-475) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రంలో పనిచేస్తున్న 11,103 మంది కాంట్రాక్టు లెక్చరర్స్/ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయబోతున్నట్టు ప్రభుత్వ ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ ఒకటో తేదీ దాటినా ఇంతవరకు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు రాకపోవడంతో కాంట్రాక్టు అధ్యాపకులు/ ఉద్యోగుల కుటుంబాల తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరుతూ మూల్యాంకనం కేంద్రాల వద్ద భోజన విరామ సమయంలో మౌన ఆవేదన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. సీఎం తక్షణమే జోక్యం చేసుకుని ఇచ్చిన హామీ ప్రకారం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి క్రమబద్ధీకరణ ప్రక్రియ జరిగేటట్టు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

20న సివిల్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ సివిల్ సర్వీసెస్ డే (ఏప్రిల్ 21)ని పురస్కరించుకుని సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 20వ తేదీన ఆన్‌లైన్ ద్వారా ప్రతిభా పాటవ పరీక్షను నిర్వహిస్తున్నట్టు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మెన్ పి క్రిష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ఉండి ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులను ప్రోత్సహించేందుకే ఈ పరీక్షను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో సివిల్ సర్వీసెస్ అధికారులను దేశానికి అందించాలనే లక్ష్యంతోనే జరుపుతున్నామని తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఈనెల 23న భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు చేతులమీదుగా అవార్డులను ప్రదానం జరుగుతుందని వివరించారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలి

- కొత్త బోర్డును ఏర్పాటు చేయాలి
- అభ్యర్థికి రూ.ఒక లక్ష నష్టపరిహారం ఇవ్వాలి
- ప్రశ్నాపేపర్ల లీకేజీ నియంత్రణ చట్టాన్ని తేవాలి
- 18న నిరసన దీక్ష : అఖిలపక్ష నాయకుల వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలనీ, కొత్త బోర్డును ఏర్పాటు చేయాలనీ, ఒక్కో అభ్యర్థికి రూ.ఒక లక్ష నష్టపరిహారం ఇవ్వాలనీ, ప్రశ్నాపేపర్ల లీకేజీ నియంత్రణ చట్టాన్ని తేవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, టీజేఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున కెటి రామారావు చేస్తున్న ప్రచారం సరికాదని తెలిపారు. పాలకుల అవినీతి, అసమర్థ వల్లనే పేపర్ లీకేజి జరుగుతున్నదని, అది పెద్దల అండదండలతో ఒక వ్యాపారంగా ఎదిగిందని ఆరోపించారు. విద్యార్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగుతుందనీ, ఏప్రిల్ 18న హైదరాబాద్‌లో 'నిరుద్యోగుల గోస - అఖిల పక్ష భరోసా - నిరసన దీక్ష' నిర్వహించాలని నిర్ణయించాము. లీకేజీ సమస్య పరిష్కారమయ్యేంత వరకు సంఘటితంగా పోరాటం చేస్తామని తెలిపారు.

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రపతికి, గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి లేఖలు రాయనున్నట్టు తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ విషయంలో కమిషన్ సభ్యులను పోలీసులు టచ్ చేయడం లేదని ఆరోపించారు. పదవ తరగతి పేపర్ లీక్ కంటే పెద్ద కుట్ర టీఎస్ పీఎస్సీ పేపర్ లీక్‌లో జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ నేత మల్లు రవి మాట్లాడుతూ పోలీసులు అరెస్టులు చేసినా పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

విద్యుత్ ఉద్యోగ ప్రతినిధులతో చర్చలకు సిద్ధం

లేబర్ కమిషనర్‌కు డి.ప్రభాకర్ రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమ్మె నోటీస్ ఇచ్చిన తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ (టీఎస్‌పీఈజేఏసీ) ప్రతినిధులతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సీఎండీ డి.ప్రభాకర్ రావు తెలిపారు. ఈ మేరకు గురువారం లేబర్ కమిషనర్ కు లేఖ రాశారు. అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం, 1971 ప్రకారం సమ్మె నిషేధించబడిందని గుర్తుచేశారు. ఇది వరకే ఐదు దఫాలు వారితో చర్చించామనీ, తెలంగాణ వచ్చిన తర్వాత రెండు దఫాలుగా ఇచ్చిన ఫిట్‌మెంట్ ఇతర బెనిఫిట్స్ విషయంలో వారు ప్రశంసించారని తెలిపారు. విద్యుత్ కంపెనీల ఆర్థిక పరిస్థితిని గమనంలో ఉంచుకుంటూనే వారి సమస్యల పరిష్కారం, డిమాండ్లను నెరవేర్చేందుకు సంయుక్త సమావేశంలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు.

నల్లగొండ జిల్లా రైల్వే ప్రాజెక్టులను ఆధునీకరించండి

- కేంద్ర రైల్వే మంత్రికి ఉత్తమ్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నల్గొండ జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులను ఆధునీకరించాలని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. నల్గొండ నియోజకవర్గంలో రవాణా, రైల్వే అనుసంధానాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వనీకుమార్‌కు ఆయన ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. డోర్నకల్-మిర్యాలగూడ మధ్య కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జగ్గయ్యపేట, మెళ్లచెరువు, జానపాడు, వాడపల్లి, విష్ణుపురం మధ్య 90 కిలోమీటర్ల పొడవైన రైలు మార్గం త్వరగా ప్రారంభించాలని పేర్కొన్నారు. ప్యాసింజర్ ట్రావెల్, సర్వీసులను ఇదే మార్గంలో ప్రారంభించాలనీ, సిమెంట్ ఫ్యాక్టరీలను ఈ లైన్ కలుపుతుందని వివరించారు. ఈ ప్రాంతాల్లో డబ్లింగ్ పనులను చేపట్టాలనీ, వందేభారత్ రైళ్లను నల్గొండ స్టేషన్‌లో ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఉత్తమ్ వెల్లడించారు. మిర్యాలగూడ స్టేషన్‌లో పలు రైళ్లను ఆపే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత కేసీఆర్‌కు లేదు

మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత సీఎం కేసీఆర్‌కు లేదని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ విమర్శించారు. అంబేద్కర్ జయంతి, వర్థంతులను అధికారికంగా నిర్వహించడాన్ని సీఎం ఎప్పుడో మరచిపోయారని ఎద్దేవా చేశారు.ఆయన ఏనాడూ అంబేద్కర్‌ను గౌరవించలేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీవిభాగం చైర్మెన్ ప్రీతంతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదని వాపోయారు. ఎంతో మంది దళితులపై దాడులు జరుగుతున్న పట్టించుకోవడం లేదని విమర్శించారు.

సిలబస్‌ను మార్చవచ్చు.. కానీ చరిత్రను మార్చలేరు నిరంజన్

పాఠ్యాంశాల్లో సిలబస్‌ను మార్చవచ్చు కానీ చరిత్రను మార్చలేరని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ హెచ్చరించారు. 11,12 తరగతుల్లో గాంధీజీ పాఠాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించడం సరైందికాదన్నారు. విద్యార్థులకు అన్ని విషయాలు, వాస్తవాలు ఇంటర్నెట్‌లో ఉన్నాయని చెప్పారు. సిలబస్‌లో ఆదానీ వ్యవహారంపై హిడెన్ బర్గ్ వెల్లడించిన పత్రాలు చేర్చాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో వలస కార్మికులు పడిన ఇబ్బందులను కూడా చేర్చాలన్నారు. రాజకీయ సంకుచిత్వంతో కాకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని కాంగ్రెస్ నేత కోరారు.

మాస్టర్ సంహిత్‌కు సహకరించాలి

- టూరిజంశాఖను కోరిన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్: తొమ్మిదేండ్ల వయస్సు కలిగిన రచయిత మాస్టర్ సంహిత్‌కు అవసరమైన సహకారాన్ని ఇవ్వాలని రాష్ట్ర పర్యాటకశాఖను మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కోరారు. మాస్టర్ సంహిత్ రాసిన వింగ్డ్ (ఫ్రెండ్స్)-బర్డ్స్ ఆఫ్ బొటానికల్ గార్డెన్స్, హైదరాబాద్ పుస్తకాన్ని గురువారం కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాస్టర్ సంహిత్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కేటీఆర్ ఆశీర్వదించారు. మాస్టర్ సంహిత్ మాట్లాడుతూ తెలంగాణను హరితంగా మారుస్తున్నందుకు కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.


సంపాదకీయం

మోడీ పశ్చాత్తాపం ప్రకటిస్తారా?

అమెరికా చరిత్రలో అధ్యక్షులుగా పని చేసిన వారిలో అత్యంత హీన, చెత్త నేపథ్యం గలిగిన వాడిగా డోనాల్డ్ ట్రంప్ చరిత్రకెక్కాడు. ప్రస్తుతం శిక్షార్హమైన 34 అభియోగాలను న్యూయార్క్ కోర్టులో మోపారు. వాటిని రుజువు చేస్తే ట్రంప్‌కు 136 సంవత్సరాల జైలు శిక్ష పడుతుంది. వాటిలో పన్నుల ఎగవేత, రికార్డుల తారుమారు మొదలు బూతుపురాణం, దాన్ని దాచేందుకు డబ్బు చెల్లింపు వరకు అనేక అంశాలున్నాయి. అనివార్యమైన

ప్రపంచంలో దిగజారుతున్న అమెరికా ప్రతిష్టను నిలపాలంటే పచ్చిమితవాదులకు ప్రతినిధులైన ట్రంప్ వంటి రిపబ్లికన్లు కావాలని జనం కోరుకుంటున్నట్లు పార్లమెంటు ఎన్నికల్లో దిగువసభలో ఆ పార్టీకి మెజారిటీ కట్టబెట్టటాన్ని బట్టి స్పష్టమైంది.అమెరికాకు అగ్రస్థానం అనే దురహంకారులదే సభలో పెత్తనం. ఆ దమ్ముతోనే వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో తిరిగి ట్రంప్ పోటీ చేస్తాడని, గెలుస్తాడని అనేక మంది నమ్ముతున్నారు. ఇది ఆందోళన కలిగించే అంశం.

స్థితిలో ఏప్రిల్ నాలుగవ తేదీన ట్రంప్ పోలీసులకు లొంగిపోయాడు. వెంటనే విడుదల కూడా చేశారు. తన మీద మోపిన ఆరోపణలన్నీ వాస్తవం కాదని అనేక మంది మాదిరే ట్రంప్ అంటున్నాడు. ఆగస్టు ఎనిమిదవ తేదీలోగా తాను నిరపరాధిని అని నిరూపించుకొనే అంశాలను కోర్టుకు సమర్పించాలి. డిసెంబరు నాలుగవ తేదీన కోర్టు ట్రంప్‌ను విచారిస్తుంది. ఈ పరిణామాలను చూస్తుంటే ఇదొక ప్రహసనంగా కూడా కనిపిస్తున్నది. విచారణ ముగిసేసరికి వచ్చిన వార్తల ప్రకారం మరోసారి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ప్రచారం, ఎన్నికలు ముగిసి ఫలితాలు కూడా వస్తాయి. కేసు ఉన్నప్పటికీ పోటీ చేసేందుకు అవకాశం ఉంటుంది. ట్రంప్ మీద మోపిన కేసులోని అంశాలకు శిక్షపడుతుందని చెప్పేవారితో పాటు రుజువు చేయటం అంత తేలిక కూడా కాదన్నవారూ ఉన్నారు.



కేసులు రుజువై శిక్ష పడుతుందా లేదా అన్నది పక్కన పెడితే ఎక్కువ సార్లు పార్టీలు మారినవాడిగా, రెండు సార్లు అభిశంసనకు గురైన, తొలిసారిగా అరెస్టయిన పేరుమోసిన అధ్యక్షుడిగా చరిత్రకు ఎక్కాడు. ఇటీవలి కాలంలో పదవిలో ఉంటూ రెండవసారి ఎన్నికల్లో ఓడిన చరిత్రనూ స్వంతం చేసుకున్నాడు. మన దేశంలో అనైతికం అన్నది అమెరికాలో కాదు. డేటింగ్ పేరుతో కలసి కాపురం, పెళ్లికాకుండానే పిల్లల్ని కూడా కనవచ్చు, తరువాత నచ్చకపోతే మరొకరితో అదే సాగించవచ్చు. వివాహేతరకూ పరిమితి లేదు.ఒకరితో ఉండేటప్పుడు నిజాయితీగా కట్టుబడి ఉన్నారా లేదా అన్నదే నీతికి కొలబద్దగా చూస్తారు. ట్రంప్ కంపులోకి వెళితే ఆరుపదుల వయసులో కూతురికంటే చిన్నదైన 27ఏండ్ల బూతు సినిమా అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడు. ఆమె డబ్బు కోసం ఆ వివరాలన్నీ పత్రికలకు అమ్ముతానంటే అచ్చు కాకుండా లక్షలకొద్దీ డాలర్ల డబ్బు ఇచ్చి జాగ్రత్తపడ్డాడు. ఇలాంటి బాగోతాలు చాలా నడిపాడు. పన్నులు ఎగవేసిన బాగోతాలు ఎన్నో. నిజానికి ఇవన్నీ వ్యక్తిగతమైన బలహీనతలు, అరాచకానికి సంబంధించినవి. అమెరికా అధ్యక్షులుగా ఉన్నవారు ప్రపంచమానవాళి మీద జరిపిన దాడులు, లక్షలాది హత్యలు, దేశాలను నాశనం చేసినందుకు ఏ ఒక్కరి మీదా కేసులు లేవు. ఈ విషయంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లూ ఎవరూ ఎవరికంటే తీసిపోరు.

డోనాల్డ్ ట్రంప్ అక్రమాలు, అవినీతి, అనైతిక వ్యవహారాలు ఆకస్మికంగా ఇప్పటికిప్పుడు వెల్లడైనవి కాదు. ఎన్నో సంవత్సరాలుగా నలుగుతున్నవే. 'హౌడీ మోడీ' పేరుతో అమెరికాలోని హూస్టన్ నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో డోనాల్డ్ ట్రంప్‌తో చెట్టపట్టాలు వేసుకొని కలియతిరిగిన నరేంద్రమోడీ అబ్‌కీబార్ ట్రంప్ సర్కార్ అని నినాదమిచ్చి ట్రంప్‌ను రెండోసారి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. నీవు ఎలాంటి వాడివో చెప్పాలంటే నీ స్నేహితుడిని చూస్తే చాలన్నది ఒక సామెత. ఒక దేశ ప్రధానిగా ఉన్న నరేంద్రమోడీ మరొక దేశాధినేతకు మద్దతుగా ప్రచారం చేయటం పరాయి దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటమే. డోనాల్డ్ ట్రంప్ బాగోతం నరేంద్రమోడీకి తెలీకుండానే అలా ప్రచారం చేసి ఉంటారా? అజిత్ దోవల్ వంటి జేమ్స్‌బాండ్, ఎందరో సలహాదారులు ఉండి కూడా ట్రంప్ గబ్బు చరిత్రను మోడీకి ఎందుకు చెప్పలేదు? చెప్పిన తరువాత కూడా వాటన్నింటినీ పక్కన పెట్టి ట్రంప్‌కు మోడీ భజనచేశారా? మన ప్రధాని అంత అమాయకుడు అనుకుంటే పొరపాటు. ట్రంప్ పచ్చిమితవాది, అమెరికా ఎన్నికల్లో సంఘ్ పరివార్ సంస్థలకు చెందిన వారు ట్రంప్‌కు ప్రధాన మద్దతుదారులు, మోడీ-ట్రంప్‌లు ఇద్దరూ మితవాద భావజాలాలకు చెందిన వారు కావటమే వారిని చెట్టపట్టాలు వేసుకుతిరిగేట్లు చేసింది.

చిత్రం ఏమిటంటే గత ఎన్నికల్లో పనిగట్టుకొని జనం ఇంటికి సాగనంపారు. ఇప్పుడు అరెస్టు అయిన ట్రంప్‌కు విడుదలైన 24గంటల్లోనే వచ్చే ఎన్నికల్లో గెలవాలంటూ 40లక్షల డాలర్ల మేర విరాళాలు అందించిన వార్తలు ఆశ్చర్యం కలిగించటం లేదు. ప్రపంచంలో దిగజారుతున్న అమెరికా ప్రతిష్టను నిలపాలంటే పచ్చిమితవాదులకు ప్రతినిధులైన ట్రంప్ వంటి రిపబ్లికన్లు కావాలని జనం కోరుకుంటున్నట్లు పార్లమెంటు ఎన్నికల్లో దిగువ సభలో ఆ పార్టీకి మెజారిటీ కట్టబెట్టటాన్ని బట్టి స్పష్టమైంది. అమెరికాకు అగ్రస్థానం అనే దురహంకారులదే సభలో పెత్తనం. ఆ దమ్ముతోనే వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో తిరిగి ట్రంప్ పోటీ చేస్తాడని, గెలుస్తాడని అనేక మంది నమ్ముతున్నారు. ఇది ఆందోళన కలిగించే అంశం.

వికృత మేళాగా మిగిలిన కుంభమేళా!

ప్రతి పన్నెండేండ్లకు ఒకసారి మన భారతదేశంలో కుంభమేళా జరుగుతుంది. ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో గంగా - మధ్యప్రదేశ్ ఉజ్జయినీలో సిప్రా - మహారాష్ట్ర నాసిక్‌లో గోదావరి - ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో గంగా, యమునల సంగమంలో కుంభమేళా జరుగుతుంది. అయితే, అది తన మూల ఉద్దేశాన్ని మరిచిపోయి, మూఢనమ్మకాలకు కేంద్రబిందువుగా మారిపోయింది. ఈ నాలుగు ప్రదేశాల్లో లక్షల జనం అక్కడి నదుల్లో స్నానాలు చేస్తుంటారు. తమ పాపాలు కడిగివేయ బడతాయనీ, తమకు స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయనీ, భవిష్యత్తులో తమకు, తమ కుటుంబానికి అంతా మంచే జరుగుతుందనీ ఆశపడుతుంటారు. ఆశపడటంలో తప్పులేదు గాని - మంచి జరుగుతుందన్న దానికి ఆధారాలు లేవు. కుంభమేళా శతాబ్దాలుగా కొనసాగుతున్నా ఆధారాలు మాత్రం ఇప్పటికీ కనిపించడం లేదు. కాలమెంత గడిచినా, అంధ విశ్వాసాలకు ఆధారాలు దొరకవుకదా? నదీ జలాల్ని కలుషితం చేసి, లక్షల మంది నీటిలో మునుగుతున్నందు వల్ల తప్పక అంటువ్యాధులు వ్యాపిస్తాయి తప్ప, ఒనగూరే మంచి-అంటూ ఏదీ ఉండదు. అసలు ఈ కుంభమేళాలకు మూలాలు ఎక్కడ? అది ఎలా ప్రారంభమైంది? కాలక్రమంలో మార్పులు చేర్పులతో, వక్రీకరణలతో అంధవిశ్వాసాలకు ఎలా ఆలవాలమైందీ?



డాక్టర్ దేవరాజు మహారాజు

చక్రవర్తి శిలాదిత్య తన కోశాగారంలో ఉన్నదంతా సమాజానికి - వివిధ వర్గాల వారికి దానం చేశాడే గానీ, గుడ్డలిప్పి నగ్నంగా ఊరేగలేదు. ఊరేగాలనీ చెప్పలేదు. నదీ స్నానాల వల్ల పుణ్యం వస్తుందని గానీ, పాపాలు పోతాయని గానీ, కోర్కెలు తీరతాయని గాని హర్షుడు తన ప్రజలకు చెప్పలేదు. బౌద్ధస్థూపం కట్టించి, బౌద్ధ జీవన విధానానికి ప్రాముఖ్యమివ్వాలని చెప్పకనే చెప్పాడు. అదే సమయంలో ఇతర మతస్థుల్ని కూడా సమానంగా ఆదరించాడు. కుల, మత, లింగ, ప్రాంత భేదాలు ఉండకూడదని, అందరూ కలిసి మెలిసి ఉండాలని ఆయన భావించాడు. నదీస్నానం పేరుతో అందరినీ ఒక్కచోట చేర్చి, ఒక్కటిగా చూడాలని అనుకున్నాడు.


తెలుసుకోవాలంటే సాధారణ శకం ఏడవ శతాబ్దంలోకి వెళ్ళాలి. ఆ కాలంలో ఉత్తర భారతదేశాన్ని ఏకరాజ్యాధికారంలోకి తెచ్చిన చక్రవర్తి హర్షుడి గూరించి తెలుసుకోవాలి. ఆయన "దానవీరుడి"గా ఎలా గుర్తింపు తెచ్చుకున్నాడో.. తెలుసుకోవాలి!

చక్రవర్తి హర్షుడి పేరు మనకు కొత్తేమీ కాదు. చరిత్ర పాఠాల్లో చదువుకున్నదే! సాధారణ శకం 590-647 మధ్య జీవించిన వాడు. 606 నుండి 647 వరకు పరిపాలించిన వాడు. ఒకవైపు యుద్ధాలు చేస్తూ సామ్రాజ్యాన్ని విస్తరించడంలోను, ప్రజలను శాంతియుతంగా పరిపాలించడంలోనూ ఆయన తనకు తానే సాటి అని అనిపించుకున్నవాడు. కుంభమేళా ఈ బౌద్ధచక్రవర్తి హర్షుడు రూపొందించుకున్న సంప్రదాయం. దాన్ని ధ్వంసం చేసి - వైదికులు మరో రకంగా ప్రచారం చేశారు. హర్షుడికి 'శిలాదిత్య' అనే బిరుదు ఉండేది. ఏడవ శతాబ్దంలో భారతదేశంలో పర్యటించిన చీనీ యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ రచనల్లో విషయాలు స్పష్టంగా ఉన్నాయి. ఆయన రచనకు తర్వాత కాలంలో హిందీ అనువాదం కూడా అందుబాటులో కొచ్చింది. అందువల్ల ఏ మాత్రం అనుమానం లేకుండా, మనం ఈ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. బౌద్ధ వారసత్వాన్ని నాశనం చేసి కుట్ర పూరితంగా కుంభమేళ ఆశయాన్ని భ్రష్టు పట్టించారు. అందుకు బలం చేకూర్చడానికి కల్పిత కథలు, అభూత కల్పనలూ జోడించారు. హర్షుడికి యుద్ధ వీరుడిగా ఎంత పేరుందో దానవీరుడిగా అంతకన్నా ఎక్కువ పేరుంది. దయార్ద్ర హృదయుడు కాబట్టే, ప్రజలు ఆయనను కోరుకుని రాజును చేశారు. తమ ప్రియబాంధవుడిగా భావించారు. ఆరోజుల్లో ఆయన చేపట్టిన దాన ధర్మాలకు - ఇప్పుడు మనం చూస్తున్న కుంభమేళాకు కొంత సంబంధముంది. ఇప్పుడు మనం చూస్తున్నది వైదిక ధర్మ ప్రభోధకులు వికృతంగా తయారు చేసిన మేళా! హర్షుడు ప్రారంభించినప్పుడు దాని ఉద్దేశం వేరు.

హర్షుడి రాజధాని కనౌజ్ (ఉత్తరప్రదేశ్). ఆయన త్రివేణి సంగమానికి వెళ్ళి, అక్కడ నుండి అందరికీ దానాలు చేసేవాడు. ఆయన ఇచ్చే దానాలు స్వీకరించాలని జనం దూర దూర ప్రాంతాల నుండి తరలివచ్చేవారు. ఆ ప్రదేశాన్ని 'మహాదాన భూమి' అని అనేవారు. మొదటిరోజు ఆయన బుద్ధుడి విగ్రహాన్ని కడిగి, వైభవోపేతంగా పూలతో అలంకరించేవాడు. తరువాత స్థానికంగా ఉన్న భిక్కులను, మేధావులను, పండితులను గౌరవించి వారికి కానుకలు ఇచ్చి సాగనంపేవాడు. నలంద, తక్షశిల విశ్వవిద్యాలయ అధ్యాపకుల్ని సత్కరించి కానుకలిచ్చేవాడు. ఆ తర్వాత ఇతర మతాలు పాటించే వారిని కూడా పిలిచి, మర్యాద పూర్వకంగా కానుకలు సమర్పించేవాడు. తరువాత వరుసలో విధవరాండ్రు, దుఃఖితులు, దరిద్రులు, రోగులు, అంగవైకల్యం ఉన్నవారు, ప్రార్థనా స్థలాల్లో పనిచేసే మహంతులు, పాండాలు, పూజారుల వంటి వారికందరికీ వరుసగా దానాలు చేసేవాడు. తన చేతి వేళ్ళకు ఉన్న ఉంగరాలు, మెడలోని రత్నాల హారాలు మొదలైన వాటిని కూడా దానం చేసేవాడు. అలా చేస్తున్నప్పుడు ఆయనకు విచారంగా, బాధగా ఉండేది కాదు. ఎంతో సంతృప్తిగా ఉండేది. అలా చేస్తున్నందుకు అమితానందం పొందేవాడు. తన కోశాగారంలోని ధనరాశులు, ప్రజలకు పంచిపెట్టడం జరుగుతూ ఉండేది. మహాదాన భూమిలో ఈ కార్యక్రమమంతా పూర్తిచేసుకుని, చక్రవర్తి శిలాదత్య ఇలా అన్నాడు... "నా దగ్గరున్నదంతా ప్రజా కోశాగారానికి చేరింది. ఒక మహోపకార్యానికి ఉపయోగ పడింది. అక్కడ - అది దుర్వినియోగం కావడానికి ఆస్కారం లేదు. ప్రజాధనం ప్రజలకు చేరిందంటే అంత కన్నా సార్థకత ఏముంది?" అని ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునేవాడు. ఇలాంటి విషయాలన్నీ హ్యూన్ త్సాంగ్ నోట్స్ వల్ల తెలుస్తున్నాయి.

హర్ష చక్రవర్తి దాన గుణం ఏ స్థాయిలో ఉండేదో తెలుసుకోవడానికి ప్రచారంలో ఉన్న ఒక కథను పరిశీలిద్దాం... ఒకసారి ఒక త్రివేణి సంగమం చేరుకుని మహాదాన భూమి నుండి దానాలు చేశాడు. ఒంటిమీద ఆభరణాలు, చేతి ఉంగరాలు, పైన ఉన్న వస్త్రాలు అన్నీ దానం చేశాడు. మెలకు ధోవతి తప్ప ఏమీ మిగలలేదు. అప్పుడు ఒకడు వచ్చి 'రాజా' అని చేయి చూపాడు. అప్పుడు ఒక ఏం చేయాలో తోచక హర్షుడు పక్కన ఉన్న మహిళను అభ్యర్థించి ఓ కండువా తీసుకున్నాడు. ఆ కండువా తను చుట్టుకుని, తన విలువైన ధోవతిని - ఆ చేయి చాపి నిలుచున్న వాడికి అందించాడు. ఒంటిమీద ఉన్న గుడ్డలతో సహా ఆయన ప్రజలకు దానం చేసేవాడని ఆ కథ చెపుతుంది. దాని ఆధారంగా వైదిక ప్రభోదకులు నగ్న సన్యాసుల్ని, నాగబాబాల్ని, అఘోరాల్ని కుంభమేళాలో చేర్చారు. ఉన్నదంతా ప్రజలకు, సమాజానికి దానమివ్వాలని శిలాదిత్య హర్షచక్రవర్తి చెబితే, దాన్ని కుంభమేళాగా మార్చి - నీటిలో మునిగితే చాలు సర్వపాపహరణ జరుగుతుందని మనువాదులు ఊదరగొట్టారు. ఎక్కడా ఏమీలేని దిగంబర సన్యాసులు ఈ సమాజానికి ఏమివ్వగలరూ? ఏ రకంగా ఆదర్శప్రాయులు కాగలరూ? ఆలోచించే పనిలేదా? హర్షుడు ప్రారంభించిన ఆ సంప్రదాయం ఆయన తర్వాత కూడా కొంత కాలం కొనసాగింది. జమీందారులు,

వీర శైవుల దేవుడు శంకరుడు. ఒంటినిండా బూడిద పూసుకుని, మొలకు చిన్న జంతు చర్మం చుట్టుకుని ఉండేవాడు. ఆయనను అనుసరించే ఈ ఆధునిక శంకరులు విభూతి, బూడిద పూసుకున్నారే గాని, చిన్న గోచీ అయినా పెట్టుకోలేకపోయారు. సమకాలీనంలో మనమేం చూస్తున్నాం? వేల సంఖ్యలో సన్యాసులు వీధుల వెంట నగ్నంగా అనాగరికంగా తిరుగుతూ ఉంటే - అదేదో పుణ్య కార్యమైనట్టు కొందరు వ్యాఖ్యానాలు చేస్తుంటారు. నాగరిక సమాజాన్ని అపహాస్యం చేస్తూ అంతమంది నగ్నంగా నడుస్తూ ఉంటే - ప్రభుత్వాలు ఇప్పటికీ చర్యలు తీసుకోవు. మూఢ భక్తులు వంగి వంగి దండాలు పెడుతుంటారు. అలా చేయడం వల్ల ఇటు భక్తులకు గాని అటు నగ్న స్వాములగ్గానీ ఏమీరాదు.



ధనవంతులూ కొందరు ఆ మహాదాన భూమికి వచ్చి, నదీ స్నానాలు చేసి తమ దగ్గరున్న ధనం, బంగారం, దానం చేసి వెళ్ళేవారు. కాలక్రమంలో దానాలు ఆగిపోయి ఉట్టి స్నానాలు మిగిలాయి.

చక్రవర్తి శిలాదిత్య తన కోశాగారంలో ఉన్నదంతా సమాజానికి - వివిధ వర్గాల వారికి దానం చేశాడే గానీ, గుడ్డలిప్పి నగ్నంగా ఊరేగలేదు. ఊరేగాలనీ చెప్పలేదు. నదీ స్నానాల వల్ల పుణ్యం వస్తుందని గానీ, పాపాలు పోతాయని గానీ, కోర్కెలు తీరతాయని గాని హర్షుడు తన ప్రజలకు చెప్పలేదు. బౌద్ధస్థూపం కట్టించి, బౌద్ధ జీవన విధానానికి ప్రాముఖ్యమివ్వాలని చెప్పకనే చెప్పాడు. అదే సమయంలో ఇతర మతస్థుల్ని కూడా సమానంగా ఆదరించాడు. కుల, మత, లింగ, ప్రాంత భేదాలు ఉండకూడదని, అందరూ కలిసి మెలిసి ఉండాలని ఆయన భావించాడు. నదీస్నానం పేరుతో అందరినీ ఒక్కచోట చేర్చి, ఒక్కటిగా చూడాలని అనుకున్నాడు. తన నుండి దానం స్వీకరించడానికి దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించేవాడు. రాజు-అంటే తండ్రి లాంటి వాడని ఆయనకు తెలుసు. అందుకే ప్రజలెవరూ ఆకలికి అలమటించకుండా ఆ మహా మానవ సమూహానికి అన్నం పెట్టే బాధ్యత హర్షుడే తీసుకునేవాడు. ఉన్నవన్నీ ఇతరుల కోసం త్యజించి, సమాజానికి మహోపకారం చేయడమన్నది బౌద్ధ చక్రవర్తి ఇచ్చిన సందేశం. అయితే ఇవ్వడానికి ఏమీలేని సన్యాసులంతా నగ్నంగా తిరుగుతూ కుంభమేళాకు వక్రభాష్యం చెప్పారు. ఇదంతా 8వ శతాబ్దపు వాడైన శంకరాచార్య ఘనత! బహుశా ఆయన సమాజానికి అందించిన మహా ప్రసాదం-అదే!

వీర శైవుల దేవుడు శంకరుడు. ఒంటినిండా బూడిద పూసుకుని, మొలకు చిన్న జంతు చర్మం చుట్టుకుని ఉండేవాడు. ఆయనను అనుసరించే ఈ ఆధునిక శంకరులు విభూతి, బూడిద పూసుకున్నారే గాని, చిన్న గోచీ అయినా పెట్టుకోలేకపోయారు. సమకాలీనంలో మనమేం చూస్తున్నాం? వేల సంఖ్యలో సన్యాసులు వీధుల వెంట నగ్నంగా అనాగరికంగా తిరుగుతూ ఉంటే - అదేదో పుణ్య కార్యమైనట్టు కొందరు వ్యాఖ్యానాలు చేస్తుంటారు. నాగరిక సమాజాన్ని అపహాస్యం చేస్తూ అంతమంది నగ్నంగా నడుస్తూ ఉంటే - ప్రభుత్వాలు ఇప్పటికీ చర్యలు తీసుకోవు. మూఢ భక్తులు వంగి వంగి దండాలు పెడుతుంటారు. అలా చేయడం వల్ల ఇటు భక్తులకు గాని అటు నగ్న స్వాములగ్గానీ ఏమీరాదు. వచ్చేది ఏదైనా ఉంటే సామాన్య ప్రజలకు విపులంగా వివరించాలి. నిరూపించాలి.

అధికారంలో ఉన్న రాజకీయ ప్రముఖులు కోట్ల విలువ గల సూట్లు వేసుకుని తిరుగుతుంటారు. కానీ, నైతికత, జీవన విలువలు - అనే వలువలు వదిలేసి - నగ్నంగానే తిరుగుతున్నారు.

'మేధావులు మౌనం వహించినప్పుడు
మూర్ఖుల సంఖ్య రెట్టింపవుతుంది.
ఇది ఎదిగే సమాజ ఉనికికే ప్రమాదం!'
- అని అన్నాడు నెల్సన్ మండేలా.


(ఈ 2023లో జనవరి 6 నుండి 18 ఫిబ్రవరి మధ్య 45రోజుల పాటు మఘ కుంభమేళ ప్రయాగలో జరిగింది)

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



దేశమంటే మనుషులోయ్!

"దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్నాడు గురజాడ అప్పారావు. ఆ విధంగా చూసినట్లయితే ప్రపంచం అనేక దేశాలు, ద్వీపాల కలయిక. ఇక్కడ నివసిస్తున్న జనాభాయే ప్రపంచానికి వెన్నెముక. దేశంలో భౌగోళిక స్వరూపాలు, వాతావరణం, జీవించడానికి అనువైన పరిస్థితులు ఆధారంగా జనాభా పెరుగుదల ఉంటుంది. గత చరిత్రను పరిశీలిస్తే జీవించడానికి అనువైన పరిస్థితులు లేకపోవడంతో కొన్ని జంతువులు కనుమరుగైన ఘటనలు అనేకం చూశాం. నేడు ఈ ప్రపంచంలో ఆకలి కేకలతో, వివక్షతలతో, యుద్ధాలతో అనేక మంది మరణిస్తున్నది చూస్తున్నాం. అయితే మానవ జనాభా కూడా తిరోగమన దిశలో ఉందని వస్తున్న వార్తలు ఆందోళన కలిగించే అంశం. సాధారణంగా ప్రపంచ వ్యాప్తంగా టోటల్ ఫెర్టిలిటీ రేటు (టీఎఫ్ఆర్) 2.1గా ఉంటే జనాభా పెరుగుదల ఉన్నట్లు భావిస్తారు. ప్రస్తుతం మన దేశంలో టీఎఫ్ఆర్ 2.05గా ఉంది. అంటే జనాభా వృద్ధి రేటు తగ్గుముఖం పడుతున్నట్టు తెలుస్తోంది. ఇక దక్షిణ భారతదేశంలో ఈ తగ్గుదల మరింత క్షీణించి 2.01గా ఉన్నది. మరీ లోతుగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో 1.7, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో 1.8గా ఉన్నది. అదే సమయంలో బీహార్‌లో 3, ఉత్తర ప్రదేశ్‌లో 2.4గా కొంచెం పెరుగుదల ఉన్నట్లు కనబడుతోంది. దీనికి అంతటికీ ప్రధాన కారణం దంపతుల మధ్య ప్రేమ, అనురాగం తగ్గటం, ఆధునిక జీవనం, ఆర్థిక సంబంధాలు, ఆహారపు అలవాట్ల వల్ల కుటుంబ వ్యవస్థకు దూరమవడంతో సంతాన ప్రక్రియ లేక జనాభా తగ్గుతున్నట్టు అంచనా. శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం పెరగడం, ఒంటరి జీవితాలకు యువత మొగ్గుచూపడం జరుగుతున్న తంతు. పెళ్లి అనే సామాజిక బంధానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, డేటింగ్‌తో గడపడం, విలువలకు తిలోదకలివ్వడం పెరుగుతున్నది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సరికాదని తల్లిదండ్రులు తమ పిల్లలకు కుటుంబ, సామాజిక, నీతి, మానవీయ విలువలు భోధించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.



ప్రసాదరావు

'చిన్న కుటుంబం చింతలేని కుటుంబం' అన్నారు పెద్దలు. దాని ప్రకారం చూస్తే జనాభా తక్కువగానే ఉంటుంది కాదా అనే సందేహం రాక మానదు. అయితే ఇక్కడ ఒక అంశాన్ని పరిశీలించాలి. మనదేశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే 1960లో 5.91 టీఎఫ్ఆర్ ఉంటే, నేడు 2.05కి పడిపోయింది. 2036 నాటికి మనదేశంలో జనాభా వృద్ధి రేటు పడిపోతుందని, దీనిలో పనిచేసేవారు సంఖ్య 50శాతం దిగువన ఉంటుందనే విషయం ఇక్కడ గుబులు రేపుతోంది. అంటే వృద్ధ జనాభా అధికంగా ఉండి మేధో సంపత్తితో పనిచేసే వారి సంఖ్య పెరుగుతుంది. మంచిదే కదా అనుకోవడం సహజం. కానీ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పరిస్థితి ఏమిటి? శ్రామిక జనాభా లేకుండా పంటల ఉత్పత్తి, వస్తుఉత్పత్తి సాధ్యమా? ఇది అందరూ ఆలోచన చేయాలి. ఇక తాజా జనాభా గణాంకాలు ప్రకారం 2048 వరకూ భారత్ జనాభా 160కోట్లు చేరి, అక్కడ నుంచి వృద్ధిరేటు పతనం అవుతూ, తిరోగమన దిశలో ఉంటుంది అని విద్యావంతులు అంచనా వేస్తున్నారు. కుటుంబం కానీ, దేశం కానీ సరైన జనాభా ఉంటేనే అభివృద్ధి అని పాలకులు గ్రహించాలి. దానికి అనుగుణంగా పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం అందిం చేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలతో జీవితాలకు భరోసా కల్పించాలి. బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించాలి. ఆర్థిక అంతరాలు లేకుండా, అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉండాలి. గిరిజన, మైనారిటీ వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేయాలి. అభివృద్ధి అంటే ఏసీ గదులు, రంగు మేడలు, విమాన ప్రయాణాలు మాత్రమే కాదు. సమస్త మానవాళి ఈ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వంతో శాంతి యుతంగా జీవించడమే ఈ ప్రపంచంలో నిజమైన అభివృద్ధి.



ప్రశ్న పత్రాన్ని నమ్మాం
పరీక్ష ఫలితంలో గెలిచాం
పరీక్ష రాయకుండానే ఓడాం

గ్రంథాలయ గదిలో
బందీలమయ్యాం
యూనివర్సిటీ చెట్లకింద
చెమటలు ఓడ్చాం
కోచింగ్ సెంటర్ల
ఒంటి కాలిపై నిలబడి రాశాం
ఉపాసముండి ఉద్యోగం
ఊపిరిగా బతికాం
ప్రవీణుడి ప్రావీణ్యాన్ని
పసిగట్టలేకపోయాం
రేణుకా కానుకకై
ఇంకా ప్రశ్నగానే మిగిలాం.


- ఎం. చిరంజీవి

అచ్చేదిన్ సరే... ఉద్యోగాలేవీ?

దేశం వృద్ధి చెందటం లేదని ఎవరూ చెప్పరు. దాని ఫలాలు ఎవరికి దక్కుతున్నా యన్నదే చర్చ. వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ ఉద్యోగాలు పెరుగుతున్నది కొన్నే. పోనీ పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెబుతున్న ఊట సిద్ధాంతం ప్రకారం పెరిగిన సంపదలు దిగువ వారికి చేరుతున్నాయా అంటే చివరికి అచ్చేదిన్, తాజాగా అమృత కాలం అని చెప్పిన నరేంద్రమోడీ తొమ్మిదేండ్ల పాలన తరువాత మన్‌కీ బాత్‌లో కూడా చెప్పే ధైర్యం చేయలేదు. గతేడాది సెప్టెంబరు చివరి వారంలో ఐఐఎఫ్ఎల్ వెల్త్ హరూన్ ఇండియా రిచ్ జాబితా వెల్లడించిన సమాచారం ప్రకారం 2021లో అదానీ కుటుంబం రోజుకు రూ.1,612కోట్లు, ముకేష్ అంబానీ రూ.210కోట్లు సంపాదించినట్లు పేర్కొన్నది. ఒక దశలో అదానీ కంటే అంబానీ సంపద రూ.రెండు లక్షల కోట్లు ఎక్కువ. అలాంటిది ఏడాది కాలంలోనే అంబానీని వెనక్కు నెట్టి అదానీ రూ.మూడు లక్షల కోట్లు ఎక్కువ. అంటే ఏడాదిలో ఐదు లక్షల కోట్లు సంపాదించాడు. అబ్రకదబ్ర, మాయలు మంత్రాలు చేసే గంధర్వులకు, మిత్రమా ఏమి నీ కోరిక, తథాస్తు అనే పైవారు ఉంటే తప్ప మానవ మాత్రులకు సాధ్యమా? 2012లో అంబానీ సంపదతో పోలిస్తే అదానీ దగ్గర ఆరో వంతు మాత్రమే ఉంది. 2014లో కేవలం ఎనిమిది బిలియన్ డాలర్ల సంపద ఉన్న అదానీ 2022 నాటికి 137 బి.డాలర్లకు ఎదిగారు. వందల సంవత్సరాలుగా ఆ రంగంలో ఉన్నవారికి సాధ్యం కానిది ఇంత స్వల్పకాలంలో అదానీకి ఎలా వచ్చింది? ఇతరులకు ఎందుకు రాలేదు? అన్నది ప్రశ్న. బ్లూమ్‌బెర్గ్ తాజా బిలియనీర్ల జాబితా ప్రకారం ఈ ఏడాది జనవరి 24న 119 బి.డాలర్ల సంపద ఉన్న అదానీ ఇప్పుడు 57.2 బి.డాలర్లకు దిగజారారు. హరూన్ సంస్థ అంచనా 53 బి.డాలర్లుగా ఉంది. ముకేష్ అంబానీ 82 బి.డాలర్లతో అగ్రస్థానంలో ఉన్నారు.

దేశంలో జనవరిలో 7.14శాతంగా ఉన్న నిరుద్యోగం ఫిబ్రవరిలో 7.45శాతానికి పెరిగిందన్న సిఎంఐఇ సమాచారాన్ని ఫైనాన్సియల్ టైమ్స్ ఉటంకించింది. నైపుణ్య శిక్షణ పథకాన్ని మన్మోహన్‌సింగ్ కాలంలోనే ప్రారంభించారు. దానికి ఒక మంత్రిని ఏర్పాటు చేసి, కేటాయింపులను పెంచి అసలు దానికి ఆద్యుణ్ణి తానే అన్నట్లుగా నరేంద్ర మోడీ ప్రచారం చేసుకున్నారు. నిజం ఏమిటి? "మనది ప్రధానంగా కార్పొరేట్ వృద్ధి మాత్రమే. ఒక యూనిట్ ఉత్పాదనకు భారత కార్పొరేట్లు ఎక్కువ మంది జనాలను నియమించటం లేదు. ఒకవైపు యువతకు ఉద్యోగాలు రావటం లేదు. మరోవైపు తమకు నిపుణులైన జనాలు దొరకటం లేదని కంపెనీలు ఫిర్యాదు చేస్తున్నాయి. జీవితకాల ఉపాధికి ప్రభుత్వ ఉద్యోగం అవసరమని ఆకాంక్షిస్తున్నారు. 140కోట్ల మంది జనాభాతో పోలిస్తే అవి చాలా తక్కువ" అని ప్రణాళికా సంఘ మాజీ ప్రధాన సలహాదారు ప్రణబ్ సేన్ చెప్పినట్లు కూడా ఆ పత్రిక పేర్కొన్నది. "నైపుణ్యాలు దొరకటం మరొక సమస్య అనేక కంపెనీలు ఇప్పటికే డిమాండ్ ఉన్న నైపుణ్యాలను వృద్ధి చేసుకున్న వారిని తీసుకుంటున్నాయి. భారత్‌లో ఫైనాన్స్, బీమా, రియల్ ఎస్టేట్, పౌరుగు సేవలు, టెలికాం, ఐ.టి రంగాలలో ఎక్కువ వృద్ధి ఉంది. కానీ ఇవి ఉపాధిని సృష్టించేవి కాదు" అని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర ప్రొఫెసర్ అమిత్ భోసలే చెప్పినట్లు కూడా ఆ పత్రిక పేర్కొన్నది.

భారత్‌లో ఉపాధి సమస్య పరిష్కారం కావాలంటే ఇరవై సంవత్సరాల పాటు వార్షిక వృద్ధి రేటు పద్దెనిమిది శాతం ఉండాలని ఐదేండ్ల క్రితం ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. చిత్రం ఏమిటంటే తన విధానాలతో ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా జీడీపీ వృద్ధి రేటును తమ ప్రభుత్వం సాధిస్తున్నట్లు మోడీ సర్కార్ చెప్పుకుంటున్నది. ఆయన అధికారానికి వచ్చిన తొలి సంవత్సరాల్లో ఐదు శాతానికి అటూ ఇటూగా ఉన్న నిరుద్యోగ రేటు ప్రస్తుతం 7-8శాతం మధ్య ఉంటున్నది. శ్రామిక శక్తి



భాగస్వామ్య అంశంలో రెండు వందల దేశాల సమాచారాన్ని గ్లోబల్ ఎకానమీ డాట్ కామ్ విశ్లేషించింది. దాని ప్రకారం 2021లో 87.3శాతంతో కతార్ ఒకటవ స్థానంలో ఉంది. మన దేశంతో సమంగా జనాభా ఉన్న చైనా 68.6శాతంతో 42వది కాగా మన దేశం 45.57శాతంతో 159వ స్థానంలో ఉంది. కరోనా కాలంలో 40శాతం లోపునకు పడిపోయింది. ఇరవై-ఇరవై నాలుగు సంవత్సరాల వయస్సు వారిలో 2022 అక్టోబరులో పట్టణ నిరుద్యోగం 42శాతం ఉండగా అదే చైనాలో 16-24 తరగతిలో 18శాతమే ఉంది. ప్రస్తుతం దేశంలో 30ఏండ్ల లోపు వారు సగం మంది ఉన్నారు. అంటే ఉపాధి అవసరం ఎంత ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడున్న ధోరణుల ప్రకారం 2040 నాటికి 59 ఏండ్లు పైబడిన వారు దేశంలో ఎక్కువ మంది ఉంటారని అంచనా.

దేశంలో ఉపాధి రహిత వృద్ధి ఆందోళన కలిగిస్తోందని, వృద్ధికి అనుగుణంగా ఉపాధి పెరగటం లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కూడా చెప్పారు. అమెరికాలో కార్మికశక్తి భాగస్వామ్యం 62శాతం కాగా మన దేశంలో 40శాతమని (2022) చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2020 ఆర్థిక సర్వేలో 2025 నాటికి మంచి వేతనాలు ఉండే ఉద్యోగాలను నాలుగు కోట్లు, 2030 నాటికి 8కోట్లు కల్పించ గలమని, చైనా తరహా వృద్ధి విధానాన్ని అనుసరించాలని కూడా దానిలో పేర్కొన్నారు. దేశంలోని పెద్ద పట్టణాల్లో స్విగ్గి, జొమాటో వంటి కాలక్షేప ఉద్యోగాలు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. గ్రామాల్లో అలాంటి అవకాశాలు కూడా ఉండటం లేదు. వృద్ధికి అనుగుణంగా ఉపాధి లేదు. ఉన్న ఉపాధికి పొందుతున్న వేతనం కూడా నామమాత్రంగా ఉంది. తగినంత వేతనం లేకుండా కొనుగోలు శక్తి పెరగదు. స్థానిక కొనుగోలు శక్తి పెరుగుతున్న కారణంగానే ఎగుమతి మార్కెట్‌లో తేడాలు వచ్చినా చైనా తట్టుకోగలుగుతోంది. మన దేశంలో ఆ పరిస్థితి ఉందా?

కార్పొరేట్లకు అమృతకాలం, అచ్చే దిన్, దేశ యువత భవిష్యత్‌కు ముప్పు. ఇది నేటి పరిస్థితి. కాంగ్రెస్ 50సంవత్సరాల్లో చేయలేని వాటిని తాను ఐదు సంవత్సరాల్లోనే చేసినట్లు 2019 ఎన్నికల్లో నరేంద్రమోడీ చెప్పుకున్నారు. దిశ, దశ తెలుసుకొనేందుకు తొమ్మిదేండ్లు తక్కువ కాదు. దేశాన్ని ఎటు తీసుకుపో తున్నారో, ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలోకి నెట్టారు. ఎన్నికల వాతావరణం ఏర్పడింది కనుక దీని గురించి మోడీ భక్తులు ఎలా స్పందిస్తారో చెప్పనవసరం లేదు. నిజానికి ఇది నరేంద్రమోడీ వ్యక్తిగత సమస్య కాదు. తమది కాంగ్రెస్‌కు భిన్నమైన పార్టీ అని జనాన్ని నమ్మించేందుకు చేసిన ప్రచారం తప్ప వాజ్‌పేయి ఏలుబడిలో గానీ ఇప్పుడు నరేంద్రమోడీ పాలనలో అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలు గానీ గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టినవే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మన దేశం మీద రుద్దిన విధానాలకు భారతీయ ముద్ర వేసి మరీ అమలు జరుపుతున్న ఫలితమే. అయితే కాంగ్రెస్‌కు బీజేపీకి తేడా లేదా అంటే ఉంది. ఆర్థిక విధానాల వైఫల్యాలకుతోడు గోబెల్స్ సమాచారాన్ని జనాలకు అందించే వాట్సాప్ విశ్వవిద్యాలయం, మత విద్వేషాన్ని బీజేపీ బోనస్‌గా ఇచ్చింది కదా!

నరేంద్రమోడీ పాలనలో అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలు గానీ గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టినవే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మన దేశం మీద రుద్దిన విధానాలకు భారతీయ ముద్ర వేసి మరీ అమలు జరుపుతున్న ఫలితమే. అయితే కాంగ్రెస్‌కు బీజేపీకి తేడా లేదా అంటే ఉంది. ఆర్థిక విధానాల వైఫల్యాలకుతోడు గోబెల్స్ సమాచారాన్ని జనాలకు అందించే వాట్సాప్ విశ్వవిద్యాలయం, మత విద్వేషాన్ని బీజేపీ బోనస్‌గా ఇచ్చింది కదా!

- సత్య



సమస్య పరిష్కారం కోసం సృజనాత్మక ఆలోచించడం ఎలాగో సుర్భిగుహ లాంటి వారికి బాగా తెలుసు. అందరితో కలవలేని ఓ అమ్మాయి. ఆరుగురు ఉన్న గదిలో కూడా మాట్లాడడానికి జంకుతూ ఉండే 23 ఏండ్ల యువతి. అయితే వచ్చిన సమస్యను అధిగమించాలనే దృఢ సంకల్పమే సోర్టిజ బిజినెస్ ప్రయాణానికి ఊపిరిపోసింది. ప్రారంభించిన అతితక్కువ కాలంలోనే ఎంతోమంది వినియోగదారులను చేరుకుంది. సోర్టిజ యాప్ గూగుల్ ప్లే ఎవ్రిడే ఎసెన్సియల్ కేటగిరి కింద భారతదేశంలోనే ఉత్తమ యాప్‌గా అవార్డు అందుకుంది. పెద్ద యాప్‌ల పక్కన తానూ నిలబడింది. వి హబ్‌తో కలిసి ఏఆర్‌హెచ రివాల్వింగ్ ఫండ్ స్వీకరించిన మొట్టమొదటి మహిళా స్టార్టప్‌గా పేరు పొందింది. ఆరోగ్యకరమైన ఆహారానికి కేరాఫ్ అడ్రెస్ వంటి సోర్టిజ డిజిటలైజ్డ్ పాకశాలలను ప్రారంభించిన ఆమె పరిచయం నేటి మానవిలో...

మంచి భోజనం పెట్టే 'సోర్టిజి'

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. మరి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే మంచి పోషకాలతో కూడిన రుచికరమైన భోజనాన్ని తీసుకో వాలి కదా! అలాంటి ఆహారం దొరకడం ప్రస్తుతం చాలా కష్టంగా మారిపోయింది. ఇక ఉద్యోగం కోసమో, పై చదువుల కోసమో ఒంటరిగా ఉండే పిల్లల గురించైతే చెప్పేదేముంది? రాత్రి పడుకోబోయే ముందు మనందరినీ వేధించే సమస్య రేపు ఏం వండాలా? అని. వీటన్నింటికీ పరిష్కారంగా సుర్భిగుహ ఓ పాకశాలను ప్రారంభించింది. అంతే కాదు ఆడవాళ్లను వంటింటికే పరిమితం చేయడానికి చెక్ పెట్టాలనుకుంది. కుటుంబసభ్యుల్లో ఎవరైనాసరే సరదాగా, చలాకీగా వంట చేసుకునే విధంగా ఓ యాప్‌ను సృష్టించింది. 2020లో వరంగల్‌కు చెందిన సుర్భి గుహ ఖరగ్‌పూర్‌కు చెందిన స్గతి ప్రకాష్, అక్షయ్, నితిన్ గుప్తాతో కలిసి ఈ యాప్ రూపొందించారు.

కుటుంబ నేపథ్యం

సుర్భి గుహ తాతగారు స్వాతంత్ర్య సమర యోధులు. వీరు ప్రెసిడెన్సీ అవార్డు గ్రహీత. నాగపూర్ వాస్తవ్యులు. తండ్రి సునీల్ గుహ, భారత రైల్వే శాఖలో రైల్వే మెనేజర్. తల్లి మనోరమ గృహిణి అమ్మానాన్నలకు ముగ్గురు సంతానం. సుర్భి గుహ అన్నయ్య రతన్ యూఎస్‌ఏలో వార్టన్ యూనివర్సిటీలో ఎంబీఏ చేస్తున్నాడు. చెల్లి ప్రజ్ఞ యూఎస్‌లో మాస్టర్స్ చేస్తుంది. సుర్భి గుహ 2018లో వరంగల్‌లో ఇంటర్ పూర్తి చేసింది. గణితంలో వంద శాతం మార్కులు సాధించినందుకు మహారాష్ట్ర హోంశాఖా మంత్రిచే అవార్డు అందుకుంది. శాన్‌ఫ్రాసిస్కోకి సంబంధించిన ఒర్బీస్ మెడికల్ బిజినెస్ సొల్యుషన్స్ అనుబంధ సంస్థ హైదరాబాద్‌లో బిజినెస్ కన్సల్టెంట్‌గా సీటు వచ్చింది. ఇందులో బాగంగానే మొదటి సారిగా వరంగల్ నుండి ఆమె హైదరాబాద్ వెళ్ళవలసి వచ్చింది. అదుగో అప్పుడే సమస్య మొదలయ్యింది.

ఇబ్బందులు ఎదుర్కొంది

అప్పటివరకు అమ్మచేతి కమ్మనైన భోజనం అలవాటైన సుర్భికి తప్పనిసరి పరిస్థితుల్లో వంట తనే చేసుకోవల్సి వచ్చింది. సమయం సరిపోక ఇబ్బంది ఎదుర్కొంది. తనలాగే తన సహోద్యోగులు కూడా ఇలాంటి ఇబ్బందినే ఎదుర్కుంటున్నారని తెలుసుకుంది. వంట చేసుకునే సమయం, అనుభవం, అవగాహన లేదు. ఇదే విషయాన్ని సహోద్యోగులు కలిసి చర్చించుకునే వారు. ఉరుకుల పరుగుల జీవితంలో కడుపు నిండా తినడానికే సమయం లేదు. ఇక అంతంత మాత్రం అవగాహన ఉన్న వాళ్ళు ఆరోగ్య కరమైనవి ఎలా వండుకుని తినగలరు? దీనికి ఏదైనా పరిష్కారం ఆలోచించాలని నిర్ణయించుకున్నారు. ఈ సాంకేతిక ప్రపంచంలో ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలన్నీ ఒకే చోట దొరికేలా చేస్తే బాగుంటుందనుకున్నారు. వాటన్నింటినీ డిజిటలైజ్ చేస్తే ఇంటికి దూరంగా ఉండే విద్యార్థులకు, యువతకు, ఉద్యోగాల్లో బిజీగా ఉండేవారికి ఎంతో సౌలభ్యంగా ఉంటుందనుకున్నారు.

ఆహార సమాచారం కోసం

వడ్డించిన విస్తరిలా చిటికెలో ఆహారానికి సంబంధించిన సమాచారం ఉండాలని ఆలోచనలోంచి ఆవిష్కరించబడిందే సోర్టిజి యాప్. ఒకవిధంగా చెప్పాలంటే ఇది డిజిటలైజ్డ్ ఆధునిక వంటశాల. ధైర్యే సాహసే లక్ష్మి అన్నట్టుగా స్టార్ట్‌అప్ ప్రారంభించ డానికి ముందు 50 సంవత్సరాల వ్యాపార అనుభవం ఉన్న ఐఐటీ మద్రాసు పూర్వ విద్యార్థుల సంఘంతో కలిసి తన వ్యాపార ప్రయాణాన్ని మొదలుపెట్టారు సర్బీ. దానికి సంబంధించిన గ్రాంట్ కోసం ఐఐటీ హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసారు. స్టార్ట్ అప్‌లో ఎలాంటి అనుభవం లేదు. అయినా సమస్యకు పరి ష్కారం అందించాలనే పట్టుదలతో సుర్భి మంచి జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలి పెట్టారు. దీని వల్ల కొద్దిగా ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఒకవైపు కరోనా మహమ్మారి సృష్టించిన లాక్‌డౌన్, ఇంట్లో వాళ్ళ ఆరోగ్య సమస్యలు, జీతాలు లేకపోవడం, తన లాంటి ఆలోచ నలున్న సహ వ్యవస్థాపకులు దొరకడం, సాంకేతిక సహాయం కోసం నిపుణులను వెదడకం, వారిని ఒప్పించడం అన్నీ ఖర్చులతో కూడిన పనులే. ముఖ్యంగా టీం తయారు చేసుకోవడమే ఒక సవాలుగా మారింది. అయితే 450 మంది యువతతో స్టార్ట్ అప్ ప్రారంభించాలనే సంకల్పం ముందు ఆమెకు ఇవేవి కష్టం అనిపించలేదు.





ఇక ఆందోళన లేకుండా...

ఎప్పుడూ అదే ధ్యాస. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రొడక్ట్స్‌లో అనుభవం ఉన్న IIT, BITS, IIIT, NITకి సంబంధించిన అగ్రశ్రేణి కళాశాలల నుంచి బృందాన్ని సేకరించారు. యాప్‌ని ప్రారంభించ డానికి నిధుల సేకరణ ప్రారంభించారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ సంస్థాగత వ్యవస్థలు, పంజాబ్ ఇన్వెస్టర్లు ఈ స్టార్ట్ అప్‌ను మరింత ముందుకు తీసుకెళ్ళడానికి తోడుగా నిలబడ్డాయి. ఐఐటీ హైదరాబాదు, వి హబ్ అడుగడుగునా అండగా ఉండి సోర్టిజీ ఎదుగుదలకు సహకరించాయి. కేంద్ర ఎలక్ట్రానిక్ ఐటీ మంత్రిత్వ శాఖ నుండి గ్రాంట్ వచ్చింది. ఇంకా ఎందరి నుండో పెట్టుబడులు పొందారు. ఏ విధమైన ఆందోళన లేకుండా హాయిగా అమ్మ, అమ్మమలు అందించిన రుచి కరమైన ఆహారం వండుకునే విధానం, కావలసిన కిరాణ, వేలాది మల్టీ మీడియా రెసిపీ గైడ్స్, బ్రాండ్స్, ఉత్పత్తులు, సులభమైన భోజన ప్రణాళిక, ఫుడ్ బ్లాగర్ల నుండి కంటెంట్, హోం కుక్ పరిచయాలు, వాటికి సంభందించిన వీడియోలు అన్నీ ఒక్కచోటే ఏర్చి కూర్చి అందించే ప్రత్యేక ఫుడ్ పోర్టల్ ప్లాట్ ఫోరం 'సోర్టిజి'గా తయారయింది. ముఖ్యంగా 22 నుంచి 40 ఏండ్ల లోపు ఉండేవారి అవసరాలను దృష్టిలో పెట్టు కుని శాఖాహార మాంసాహార లిస్టు ఇందులో ఉంటుంది. అలాగే పోషక విలువలతో కూడిన డైట్ ప్లాన్, వారానికి సరిపడా టిఫిన్లు, మధ్యాహ్నా, రాత్రి భోజన ప్రణాళిక లతో రూపొందించబడింది ఇది. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా ఎన్నో లక్షల మంది తమకు నచ్చిన వంట చేసుకుని తినేలా ప్రోత్సహిస్తుంది

మూడు ప్రణాళికలు...

బారతదేశంలో ఫుడ్ స్పేస్ వీడియో రౌరెక్స్‌లో అగ్రగామిగా ఉంటూ మూడు ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తున్నారు సోర్టిజి వ్యవస్థాపక బృందం. అందులో ఒకటి వివిధ రకాల ఆహార తయారీ విధా నాల ద్వారా వినియోగదారుడు తనకు నచ్చిన ఆహా రాన్ని సులభంగా తయారు చేసుకోవడం. రెండవది వంటల తయారీకి సంభందించి విషయ పరిజ్ఞానాన్ని అందిస్తున్న భాగస్వాములకు అధిక రాబడి ద్వారా మరింత ఆదాయం పొందేలా చూడడం. మూడవది ఆకర్షణీయమైన మెరుగైన ధరల ద్వారా వినియోగ దారులతో సత్సంబంధాలు కలిగి ఉండడం. ఇలా ఎందరో మహిళలకు ఆర్థిక స్వావలంబన కలిగిస్తుంది సోర్టిజి. దీనికి భారత దేశమంతటా వెయ్యిమంది పబ్లిషర్లు వారి ఆహార విషయ పరిజ్ఞానాన్ని ఆర్థిక స్వావలంబనగా మలచుకుంటున్నారు.

వినియోగదారులకు దగ్గరై...

సుర్భికి తాను స్టార్ట్ అప్ ప్రారంభించిన కొత్తలో మొదటి వినియోగదారున్ని ఒప్పించిన సంఘటన, టీం ఏర్పాటు చేయడానికి పడ్డ కష్టం తరచూ గుర్తుకు వస్తాయట. గూగుల్ పేలో ఈ యాప్ ప్రారం భించబడినప్పటి నుండి అంటే మే 2021 నుండి వంటకాల కోసం 3.6 లక్షలకు పైగా ప్రశ్నలు వచ్చాయి. సుమారు 2000 గంటల కంటే ఎక్కువ సమయం వంటకు సంబంధించిన విషయాల కోసం ఈ ప్లాట్‌ఫారమ్ ను ఉపయోగించారు. అంటే ఇది వినియోగదారులకు ఎంత నమ్మకమైనదో, ఎంత దగ్గరైందో చెప్పేదేముంది. సార్టిజీ ద్వారా 'వంట చేసుకోవడం ఎలా" అన్న ప్రశ్నకు సమాధానం దొరికిందని క్యాంపస్ ఫండ్ భాగస్వామి అనిరుధ్ తోష్నివాల్ అన్న మాట అక్షర సత్యం.

'మనం ఎదుగుతూ ఇతరులని ఎదగనిద్దాం.... నాకు నిరంతరం తోడుగా ఉంటూ ప్రోత్సహించిన వి హబ్‌కి కృతజ్ఞురాలిని. యువతను ఈవిధంగా ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు' అంటే ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం

యువతులు వారి అభిరుచులకు అనుగుణంగా ఆత్మవిశ్వాసంతో, స్వశక్తితో ఎదగడానికి స్ఫూర్తిగా నిలబడాలని ఆమె నిర్ణయించు కున్నారు. తనకు కలిగిన ఇబ్బంది ఎవ్వరికీ కలగొద్దని చిన్న వయసులోనే పరిష్కారం ఆలోచించి సోర్టిజిని స్థాపించారు. అనతి కాలంలో ఎంతో మంది వినియోగదారులను సంపాదించుకున్నారు. మహిళా సాధికారతకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎంతో అవసరమని గుర్తించి ఎంతోమంది గృహిణులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆసరాగా నిలిచిన సుర్భిగుహ జీవితం ఇప్పుడు ఎందరికో ఆదర్శం. వీరి యాప్ ఆండ్రాయిడ్ ఐఒయస్ వెర్షన్లలో లభిస్తున్నది. మీరు ఏదైనా వంట కొత్తగా ట్రై చేయాలని అనుకుంటున్నారా.. మరెందుకు ఆలస్యం వెంటనే www.sortizy .com యాప్‌ని డౌన్లోడ్ చేసుకోండి.

- ప్రమోద మునిమడుగు



వేడిగున్నా చలువనిస్తాయి

వేసవిలో డీహైడ్రేషన్ అని టీ, కాఫీలకు వీలైనంత దూరంగా ఉండమంటారు. టీ తాగనిదే పని ముందుకెళ్లదు కొందరికి! మరి అలాంటి వాళ్ల పరిస్థితేంటి? వీటిని ప్రయత్నిస్తే సరి!

హైబిస్కస్ టీ: వేడి తాపం నుంచి రక్షించడంలో ఈ టీ ముందుంటుంది. రక్తపోటును తగ్గిస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరాన్ని శుద్ధి చేయడంతో పాటు నెలసరి సమయంలో నొప్పినీ, ఆందోళననీ దూరం చేస్తాయి.

రోజ్ టీ: ఎ, సి విటమిన్లు, పాలీఫినాల్స్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు దీనిలో పుష్కలంగా ఉంటాయి. త్వరిత శక్తినిస్తుందిది. రోగనిరోధకతనీ పెంచుతుంది. నరాలను శాంతపరిచి ఒత్తిడి, ఆందోళనలనూ దూరం చేస్తుంది. వేడిగా కంటే చల్లగా రుచి ఇంకా బాగుంటుంది.

గ్రీన్ టీ: బరువును అదుపులో ఉంచడంలోనూ, శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలోనూ సాయపడుతుంది. దీనిలోని గుణాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. తక్కువ మోతాదులో ఉండే కెఫిన్ మెదడును ఉత్తేజపరుస్తుంది. యాంటీ ఏజెంగ్‌గా కూడా పనిచేస్తుంది. ఇ, బి12 విటమిన్లు చర్మ ఆరోగ్యానికి సాయపడతాయి. చల్లగా, వేడిగా ఎలా తీసుకున్నా మంచిదే!

తులసి టీ: రోగనిరోధకతను పెంచే గుణాలు దీనిలో ఎక్కువ. ఇన్ఫెక్షన్ల బారి నుంచీ రక్షిస్తుంది. అయితే పుదీనా, రోజ్, నిమ్మ వంటి వాటితో కలిపి తీసుకుంటే శరీరంలో వేడిని తగ్గించడంలో సాయపడుతుంది. త్వరితగతిన శక్తినిస్తూనే ఒత్తిడినీ దూరం చేస్తుంది. దీనిలో జీర్ణప్రక్రియను వేగవంతం చేసే గుణాలూ ఎక్కువే!

సీపీ సార్.. ఫోన్‌కు అనుమతి లేదు

పరీక్షా కేంద్రం వద్ద అడ్డుకున్న మహిళా కానిస్టేబుల్

- ప్రత్యేకంగా అభినందించిన సీపీ
- రూ.500 క్యాష్ రివార్డు అందజేత



నవతెలంగాణ- సిటీబ్యూరో

పదో తరగతి ప్రశ్నపత్రాలు వాట్సాప్‌లో వైరల్ అవడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం కఠిన నిబంధనలు పెట్టింది. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లడాన్ని అధికారులు పూర్తిగా నిషధించారు. ఈ క్రమంలో గురువారం పదో తరగతి పరీక్ష జరుగుతున్న కేంద్రాలను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ స్వయంగా పరిశీలించారు. ఎల్బీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకు వచ్చిన సీపీకి అక్కడున్న అధికారులు సెల్యూట్ చేశారు. ఆ తర్వాత పరీక్షా కేంద్రంలోకి వెళున్న సీపీని అక్కడే విధుల్లో ఉన్న ఎల్‌బీనగర్ పోలీస్టేషన్ మహిళా కానిస్టేబుల్ కల్పన ఆపారు. 'సీపీ సర్.. ప్లీస్ పరీక్షా కేంద్రంలోకి ఫోన్ అనుమతి లేదు' అని గుర్తు చేశారు. దాంతో అక్కడున్న మిగతా పోలీసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కానీ సీపీ డీఎస్ చౌహాన్ తన వద్ద ఉన్న ఫోన్‌ను కానిస్టేబుల్‌కు అప్పగించి లోపలికి వెళ్లిపోయారు. సీపీ తిరిగి బయటకు వచ్చాక కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్యాష్ రివార్డు రూ.500 ఆమెకు అందజేశారు. తన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించిన కానిస్టేబుల్ కల్పనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తనిఖీల్లో సీపీ వెంట ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ శ్రీధర్ రెడ్డితో పాటు ఇతర అధికారులున్నారు.

గాంధీ పేరంటేనే సంఘ్‌కు కంటగింపు

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ పేరంటేనే బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు కంటగింపుగా ఉందని ఆయన ముని మనుమడు తుషార్ గాంధీ వ్యాఖ్యానించారు. గాంధీజీ పేరు ప్రతిష్టలు, గుర్తింపు వారికి ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలలో గాంధీజీ పాఠ్యాంశం మాయం కావడం ఆశ్చర్యం కలిగించడం లేదని, అయితే అలాంటి మరిన్ని ప్రయత్నాలు జరుగుతాయేమోనన్నదే ఆందోళన కలిగించే విషయమని అన్నారు. సంఘ్ పరివార్ దుష్ప్రచారంలో గాంధీజీ పాఠ్యాంశాల తొలగింపు ఒక భాగమని తెలిపారు. 'చరిత్రను తుడిచేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు నాకు ఆశ్చర్యం కలిగించడం లేదు. చరిత్రను తిరగరాయడం, దానిని అగౌరవపరచడం వంటి సంఘ్‌పరివార్ ఉద్దేశాలలో రహస్యమేమీ లేదు. ఇది రెండు లక్ష్యాలను నెరవేరుస్తుంది. తమకు అనుకూలమైన చరిత్రను రాయడం, తాము గాంధీజీని ఎలా చూపాలనుకున్నారో అలా చిత్రించడం. ఎందుకంటే ఆయన పేరుప్రతిష్టలు వారికి ఎప్పుడూ కంటగింపుగానే ఉంటాయి' అని తుషార్ అన్నారు. చరిత్ర పుటలను వక్రీకరించడమే వారి పని అని విమర్శించారు. భవిష్యత్ తరాల వారికి చరిత్ర తెలియకుండా చేయడమే సంఘ్ పరివార్ లక్ష్యమని, తమ దుష్ప్రచారాన్ని వారు నమ్మేలా చేసేందుకు యత్నిస్తోందని చెప్పారు. మొదట్లోనే యువత మేధస్సును కలుషితం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో ఇది ఒక భాగమని అన్నారు. యువత మస్తిష్కంలో అబద్ధాలను చొప్పించి, తమ లక్ష్యాన్ని సులభంగా చేరుకోవాలని సంఘ్‌పరివార్ భావిస్తోందని తుషార్ గాంధీ విమర్శించారు. ఆర్ఎస్ఎస్ నిండా కపటత్వమే దాగి ఉందని, దాని పని మభ్యపెట్టడమేనని అన్నారు.

పాలకేడ్చే కాలమొచ్చే

(మొదటిపేజీ తరువాయి)

అయితే కోవిడ్ తర్వాత ఉత్పత్తి రేటులో వృద్ధి తగ్గిందని వివరించారు. కోవిడ్ కాలంలో పశువులకు కృత్రిమ గర్భధారణ ప్రక్రియ సజావుగా సాగలేదని, దీనివల్ల ఉత్పత్తి తగ్గిందని ఆయన అన్నారు. మొత్తానికి ఈ కాలంలో పాలు, పాల ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయని ఇరువురు నిపుణులూ తెలిపారు. కొనుగోలు శక్తి పెరగడమే దీనికి కారణమని చందల్ అభిప్రాయపడగా, ఆహారంలో ప్రొటీన్ ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెరగడమే దీనికి కారణమని సోధీ చెప్పారు. పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరగడమే ధరల పెరుగుదలకు కారణమని సోధీ అనగా ఉత్పాదకాల ధరలు పెరగడమే కారణమని చందల్ అన్నారు. ఇలా కారణాలేమైనా ప్రజలకు అత్యంత నిత్యావసరమైన పాల కోసం అపసోపాలు పడాల్సిన కాలం దాపురించింది. ఈ పాపం మోడీ సర్కారుది కాకుంటే ఇంకెవరిది?

ముగిసిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

బిల్లులు ప్రవేశపెట్టగా, ఆరు బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. ఈ సమావేశాల్లో లోక్‌సభ 34 శాతం, రాజ్యసభ 24 శాతం జరిగింది. జనవరి 31న ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ముగిశాయి. మొదటి విడత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 12 వరకు, రెండో విడత మార్చి 13 నుంచి ఏప్రిల్ 6 వరకు జరిగాయి. మొదటి విడతలో పది రోజులు, రెండో విడతలో 15 రోజులు కార్యాకలాపాలు జరిగాయి. మొత్తం 25 రోజుల పాటు సమావేశాలు జరిగాయని పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో 13.44 గంటలు, రాజ్యసభలో 12.42 గంటలు పాటు చర్చ జరిగింది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లపై ఉభయ సభల్లో సాధారణ చర్చ జరిగింది. లోక్‌సభలో 14.45 గంటలు, రాజ్యసభలో కేవలం 2.21 గంటల పాటు మాత్రమే చర్చ జరిగింది. లోక్‌సభలో నిరంతర అంతరాయాల కారణంగా రైల్వేలు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గిరిజన వ్యవహారాలు, పర్యాటకం, సంస్కృతి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వంటి మంత్రిత్వ శాఖల గ్రాంట్ల కోసం డిమాండ్లపై చర్చ జరగలేదు. రాజ్యసభలో స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, టెక్స్‌టైల్స్, ఫిషరీస్, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ, గ్రామీణాభివృద్ధి, సహకారం, రైల్వేలు, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖల పనితీరుపై సభలో నిరంతర అంతరాయాల కారణంగా చర్చ జరగలేదు.

తీవ్ర అంతరాయం

రెండో విడత సమావేశాల్లో లోక్‌సభ 45 గంటలు, రాజ్యసభ 31 గంటల పాటు పనిచేసిందని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసర్చ్ సర్వే డేటా వెల్లడించింది. అదానీ గ్రూప్-హిండెన్ బర్గ్ నివేదిక వ్యవహారం ఉభయ సభలను కుదిపేసింది. ఈ ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగాయి. దీంతో సభలు తరచూ స్తంభించాయి. లోక్‌సభ మొత్తం 133.6 గంటలు పనిచేయాల్సి ఉండగా కేవలం 45 గంటలు (34.28శాతం) పనిచేసింది. ఇక రాజ్యసభను 130 గంటలు నిర్వహించాల్సి ఉండగా.. 31 గంటల (24 శాతం) పాటు మాత్రమే పనిచేసిందని సర్వే డేటా స్పష్టం చేసింది.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశాలు సాఫీగా నడవనీయకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ధ్వజమెత్తారు. 'పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండానే.. 12 నిమిషాల్లోనే రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. పైగా ప్రతిపక్ష పార్టీలు సహకరించడం లేదని ఆరోపించింది' అని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీ ప్రతినిధులే పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడేందుకు అనుమతించలేదని, తన 52 ఏండ్ల ప్రజాజీవితంలో ఎప్పుడూ ఇలా జరగలేదని పేర్కొన్నారు. దీని వెనుక ఏదో మతలబు దాగుందని, అందుకే జేపీసీ విచారణకు అంగీకరించడం లేదని ఆరోపించారు. అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమాధానం చెప్పకుండా.. బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ అందరి దృష్టిని మళ్లించిందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో టీఆర్ బాలు (డీఎంకే), సంజయ్ సింగ్ (ఆప్), కే.కేశవరావు (బీఆర్ఎస్), వి.శివదాసన్ (సీపీఐ(ఎం), బినయ్ విశ్వం(సీపీఐ), మనోజ్ కుమార్ ఝా (ఆర్జేడీ), ప్రసూన్ బెనర్జీ (టీఎంసీ), కౌశలేంద్రకుమార్ (జేడీయూ), ఎస్.టీ హసన్ (ఎస్పీ), మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), ప్రియాంక చతుర్వేది (శివసేన, ఠాక్రే), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ), మహువా మాజి (జెఎంఎం), తిరుమావలవన్ (వీసీకే) తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్ ఆతిథ్యం.. ప్రతిపక్షాలు బహిష్కరణ

పార్లమెంట్ ముగిసిన తరువాత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆతిథ్యం ఇచ్చే సంప్రదాయ 'ఈవినింగ్ టీ'ని ప్రతిపక్ష నేతలు బహిష్కరించాయి. టీ పార్టీకి ప్రతిపక్ష పార్టీల ఎంపీల్లో ఒకే ఒక్కరు హాజరయ్యారు. మిగిలిన ప్రతిపక్ష పార్టీల నుంచి నేతలు వెళ్లలేదు. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా మాత్రమే హాజరయ్యారు. ఆ సమయంలో ప్రధాని మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు అక్కడే ఉన్నారు. ఫరూఖ్ అబ్దుల్లాతో కలిసి ముచ్చటించుకుంటూ అందరూ తేనీరు సేవించారు.

సింగరేణిని ప్రయివేటీకరించే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఇప్పటికే సింగరేణి ప్రయివేటీకరణ ప్రయత్నాలను తమ పార్టీ తరఫున, అలాగే ప్రభుత్వం పక్షాన తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ మేరకు సింగరేణికి అవసరమైన బొగ్గు గనులను నేరుగా కేటాయించాలని ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు కేసీఆర్ గతంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు. అయితే ఇప్పటికే లాభాల్లో నడుస్తున్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా అమ్మేస్తున్న మోడీ సర్కార్ సింగరేణిని కూడా తెగ నమ్మేందుకు కంకణం కట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. లాభాల బాటలో ఉన్న సింగరేణికి.. భవిష్యత్తులో బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల బాట పట్టించాలన్న కుతంత్రంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు కూడా గనులు కేటాయించకుండా ఆ సంస్థను దివాలా తీయించిన కేంద్రం..అదే విష ప్రయోగాన్ని ఇక్కడ అమలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వాపోయారు.

ఇదే కేంద్ర ప్రభుత్వం గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి మాత్రం నామినేషన్ పద్ధతిన భారీగా లిగ్నైట్ గనులు కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. గుజరాత్ మాదిరిగానే తెలంగాణలోని సింగరేణికి బొగ్గు గనులను కేటాయించాలని ఎన్నోసార్లు తమ ప్రభుత్వం కోరినప్పటికీ కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించబోమంటూ మోడీ చేసిన ప్రకటలన్నీ కల్లబొల్లి మాటలేనని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రధాని హామీకే దిక్కులేకపోతే ఎలా అని సూటిగా ప్రశ్నించారు. మోడీ మరోసారి రాష్ట్రానికి రాబోతున్న తరుణంలో దానిపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అటు ఉత్పత్తిలోనూ, లాభాల్లోనూ, పిఎల్ఎఫ్‌లోనూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న సింగరేణిని ప్రయివేటీకరించాల్సిన అవసరం ఏమొచ్చిందో చెప్పే దమ్ము కేంద్ర ప్రభుత్వంలో ఏ ఒక్కరికైనా ఉందా అని ప్రశ్నించారు.

తొలగించిన పాఠ్యాంశాలను పునరుద్ధరించండి : సీపీఐ(ఎం)

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించింది. కేవలం మతతత్వ అభిప్రాయ భేదాలను ప్రాతిపదికగా తీసుకుని వివిధ కాలాలకు సంబంధించిన మన గతాన్ని తొలగించలేమన్న అంశాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోందని సీపీఐ(ఎం) తప్పుబట్టింది. మొఘల్ సామ్రాజ్యం గురించిన మొత్తం అధ్యాయాలను తొలగించడం ద్వారా చరిత్రను వక్రీకరించే మెజారిటీవాదుల ధోరణిని ఇది నొక్కి చెబుతోందని ఆ ప్రకటన పేర్కొంది. మహాత్మా గాంధీ హత్య తదనంతరం ఆర్ఎస్ఎస్‌ను నిషేధించ డానికి దారి తీసిన పరిస్థితులకు సంబంధించిన కీలకమైన పాఠ్య భాగాలను తొలగిం చాలని ప్రభుత్వం భావించిన తీరు చూస్తుంటే ఆర్ఎస్ఎస్ విచ్ఛిన్నకర, హింసాత్మక పాత్రను తుడిచిపెట్టే ఉద్దేశ్యంతోనే ఈ పాఠ్య పుస్తకాలను సవరించేందుకు ప్రస్తుత ప్రయత్నాలు చేపట్టినట్లు స్పష్టమవుతోందని పొలిట్‌బ్యూరో విశ్లేషించింది. హేయమైన ఈ చర్యలను తిప్పికొట్టడానికి, పాత పాఠ్య పుస్తకాలను పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మన గతాన్ని నిష్పక్షపాతంగా అధ్యయనం చేయడంలో ఆసక్తి కలిగిన దేశభక్తులందరూ తక్షణమే తమ నిరసన గళాన్ని వినిపించాలని సీపీఐ(ఎం) కోరింది.

వడ్డీ రేట్లు యథాతథం

ముంబయి : వరుసగా ఆరు సార్లు కీలక వడ్డీ రేట్లు పెంచిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా సమీక్షాలో ఉపశమనం కల్పించింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షా గురువారం నాటితో ముగిసింది. ఈ దఫా కూడా కీలక వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చన్న నిపుణుల అంచనాలకు భిన్నంగా.. రెపోరేటును యథాతథంగా 6.5 శాతంగా కొనసాగించాలని నిర్ణయించింది. 2023-24లో ఇదే తొలి ద్రవ్య పరపతి విధాన సమీక్ష భేటీ అనంతరం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడుతూ.. 2022-23లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ఏడు శాతం పెరగొచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు నిలకడగా ఉన్నాయన్నారు. అయితే ద్రవ్యోల్బణంపై మాత్రం యుద్ధం కొనసాగుతుందని గవర్నర్ అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. ప్రస్తుత ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం పెరగొచ్చన్నారు. ఇంతక్రితం ఆరు సమీక్షల్లోనూ రెపోరేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రుణ గ్రహీతలపై తీవ్ర భారం పడింది.కొత్త ఏడాది 2023 ఆశాజనకంగా ప్రారంభమైందని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. సరఫరా వ్యవస్థలు మెరుగయ్యాయని తెలిపారు. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్నాయని వెల్లడించారు. అనుహ్యంగా మార్చిలో అంతర్జాతీయ పరిస్థితులు క్లిష్టంగా మారాయన్నారు. బ్యాంకింగ్ రంగంలో పలు కుదుపులు చోటు చేసుకున్నాయన్నారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థల స్థిరత్వంపై అనుమానాలు నెలకొన్నాయన్నారు. వాటి పర్యవసానాలపై ఆర్బీఐ దృష్టి సారించిందన్నారు. కాగా.. దేశ బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక వ్యవస్థలు బలంగా ఉన్నాయన్నారు. ఇటీవల అమెరికన్, స్విస్ బ్యాంక్‌ల్లో తీవ్ర సంక్షోభం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ద్రవ్యోల్బణం కొంత అదుపులోకి వచ్చినప్పటికీ.. తాము ఎంచుకున్న లక్ష్యం కంటే ఎక్కువగానే ఉందన్నారు. 2023-24 జీడీపీ అంచనాలను 6.4 శాతం నుంచి 6.5 శాతానికి పెంచామన్నారు.

తాజ్‌మహల్, కుతుబ్‌మినార్‌లను కూల్చేయండి..

గువహతి : దేశంలోని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ చరిత్రను తుడిచేయాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. తన మతోన్మాద అజెండాను మరింత ఉధృతంగా ముందుకు తీసుకుపోయేందుకు కృతనిశ్చయంతో కనిపిస్తున్నది. తాజాగా ఆ పార్టీకి చెందిన అసోం శాసనసభ్యుడు చారిత్రక కట్టడాలను కూల్చేయాలంటూ పిలుపునిచ్చారు. వాటి స్థానంలో దేవాలయాలు నిర్మించాలంటూ ఉచిత సలహా కూడా ఇచ్చారు.చారిత్రక తాజ్‌మహల్, కుతుబ్‌మినార్ కట్టడాలను కూల్చేసి వాటి స్థానంలో దేవాలయాలు నిర్మించాలని అసోంలోని మరియానీ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే రూప్‌జ్యోతి కుర్మి సూచించారు. విలేకరుల సమావేశంలో కుర్మి చెప్పిన మాటల వీడియో సోషల్ మీడియాలో వైరలైతోంది. తాజ్‌మహల్, కుతుబ్‌మినార్‌లను కూల్చేసి అక్కడ దేవాలయాలను నిర్మించాలంటూ ఆయన ప్రధాని మోడీని కోరారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి తన సంవత్సర జీతం విరాళంగా ఇస్తానని కూడా ఆయన ఆఫర్ ఇచ్చారు. తన ప్రకటనపై వివాదం చెలరేగినప్పటికీ ఆయన వెనక్కు తగ్గలేదు. తాజ్‌మహల్‌ను ప్రేమకు చిహ్నంగా చూడరాదంటూ వితండవాదం చేశారు. "మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన నాలుగో భార్య ముంతాజ్ జ్ఞాపకార్థం తాజ్‌మహల్‌ను నిర్మించారు. ఆయన నిజంగా ముంతాజ్‌ను ప్రేమిస్తుంటే ఆమె మరణం తర్వాత మరో ముగ్గురిని ఎందుకు పెళ్లి చేసుకున్నారు ?" అని ప్రశ్నించారు. అసోం రాజధాని గువహతిలోని లటాసీ పోలీస్ స్టేషన్‌లో కుర్మిపై ఫిర్యాదు నమోదైంది. అయితే ఇప్పటివరకూ ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదు. ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పాఠ్యపుస్తకంలో మొఘల్ చరిత్రకు సంబంధించిన చాప్టర్‌ను తొలగించడంపై వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. అయినప్పటికీ బీజేపీ నాయకులు వెనక్కి తగ్గడం లేదు. కుర్మీ వ్యాఖ్యలు అందులో భాగమే అని రాజకీయ విశ్లేషకులు, సామాజికవేత్తలు అన్నారు.

ఏసుక్రీస్తు త్యాగాలు గొప్పవి : సీఎం కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

ఉండేందుకు ఏసుక్రీస్తు బోధనలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడేను ప్రజలు దైవ ప్రార్థనలతో జరుపుకోవాలనీ, ప్రజల మధ్య శాంతి, సామరస్యం విలసిల్లాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన కృష్ణయాదవ్, రోషం బాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో
హనుమాన్ జయంతి సందర్భంగా అడిక్మెట్ ఆంజనేయ స్వామి దేవాలయంలో టీజీవో హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.బీ కృష్ణ యాదవ్, తెలంగాణ సినీ హీరో రోషం బాలు ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్ చార్యులు, ఆలయ చైర్మెన్ మధుసూదన్, కృష్ణమా చార్యులు. డి.రాజ్ కుమార్, శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానని, అందరికీ మంచి జరగాలని వేడుకున్నానని తెలిపారు.

చంచల్‌గూడ నుండి విడుదలైన యూత్ కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-హయత్‌నగర్
ఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీకి నిరసనగా ఎస్ఎస్‌సీ బోర్డ్ వద్ద ఇటీవల ఆందోళన నిర్వహించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డిలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపగా, అనంతరం గురువారం చంచలగూడ జైలు నుండి విడుదలైన యువజన కాంగ్రెస్ నాయకులు.

బ్యాంక్ ఖాతాలో ప్రధాని వేస్తామన్న రూ.15లక్షలు ఎక్కడ?

- టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ - ఎల్బీనగర్
దేశంలోని ప్రజలకు 15లక్షలు 8 సంవత్సరాల నుండి ఎందుకు ఇవ్వడంలేదని ప్రధాన మంత్రికి గుర్తుచేయడం కోసం దేప భాస్కర్‌రెడ్డి ఉత్తరం రాశారు. మహేశ్వరం నియోజకవర్గం, సరూర్‌నగర్‌లో వున్న గణేష్ నేత, మహమ్మద్ గుల్షన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పోస్ట్ కార్డు ఉద్యమంను టీపీసీసీ సభ్యులు, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సదర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతు ప్రధాని మోడీ 2014లో వాగ్దానం చేసిన డబ్బును మాకు ఎప్పుడు పంపుతారు అని ప్రశ్నించారు. పేదల బ్యాంక్ అకౌంట్‌లలో వేస్తానన్న 15లక్షల రూపాయలు ఏమయ్యాయని, అదేవిధంగా సంవత్సరానికి 2లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 2014లో ప్రపంచ కుబేరుల జాబితాలో 609 స్థానంలో వున్న అదాని సెల్ కంపెనీలు మోడీ ప్రధాని అయిన తర్వాత, ప్రపంచంలో 2వ స్థానంలో 140 బిలియన్ కోట్ల రూపాయల సంపాదనలో ముందున్నాడు అని తెలిపారు. ఇదే వాస్తవ విషయంను పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ భారతదేశ 140 కోట్ల ప్రజల తరుపున మోడీని పార్లమెంట్‌లో నిలదీయడం జరిగింది అని దేప భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. పదే పదే ప్రశ్నిస్తుంటే



మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా రాహుల్ గాంధీ మీద పరువు నష్టం దావా కేసు వేశారని గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా రాహుల్ గాంధీ ఎంపీ పదవిపై అనర్హత వేటు వేయడం బీజేపీ ప్రభుత్వం దుర్మార్గపు చర్య అని అన్నారు. ప్రశ్నించే గొంతుక, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని దేప భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్ రెడ్డి, నల్లెంకి ధనరాజ్ గౌడ, గట్ల రవీంద్ర , బొడ్డుపల్లి మహేందర్, అలీ, ఎన్ఎస్‌యూఐ శివ, రాజు నాయక్, ప్రేమ్ నాయక్, భాస్కర్ నాయక్, కల్యాణ్ యాదవ్, ఇస్మాయిల్, పింటూ, సలీం, శ్రీకాంత్ రెడ్డి, నగేష్, శ్రావణ్ కురుమ, శ్రీధర్, విప్లవ్‌రెడ్డి, జహంగీర్



అనుదీప్, సంతోష్ కుమార్, శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాలనా సౌలభ్యం కోసం నూతన గ్రామపంచాయతీలు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్
పాలనా సౌలభ్యం కోసం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లోని గుంతపల్లి గ్రామంలో 20లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయంలను సర్పంచ్ కరిమెల వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవలు అందించాలని, పాలన పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. చిన్న గ్రామ పంచాయతీతో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు సులభతరంగా ఉంటుందన్నారు. కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు దశలవారీగా మరిన్ని నిధులు విడుదల చేసి అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ కార్యాలయం ప్రజలకు అనువుగా



ఉండేందుకు మౌలిక వసతులతో కూడిన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బింగి దాస్ గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, సర్పంచులు కరిమెల వెంకటేష్, చెరుకు కిరణ్ కుమార్ గౌడ్, ఎంపీటీసీ మేడిపల్లి బాలమ్మ, మాజీ సర్పంచ్ కరిమెల వరలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ జగన్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, మాజీ అధ్యక్షులు పూజారి చక్రవర్తి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-వనస్థలిపురం
హనుమాన్ విజయోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవస్థానంలో బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు ఉమేష్‌గౌడ్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా హనుమాన్ శోభయాత్ర

నవతెలంగాణ - మీర్‌పేట్
మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 39వ డివిజన్ కమలానగర్ యంగ్ స్టార్ హనుమాన్ యూత్ ఆర్గనైజర్ బొజ్జ రాజు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా కమల నెహ్రూనగర్ నుండి కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ వరకు హనుమాన్ శోభయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ శోభ యాత్రలో కాంతార వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, జిల్లెలగూడ వెంకటేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్ మదారి రమేష్, బచ్చనబోయిన రమేష్ యాదవ్, లప్ప లక్ష్మణ్, శివగౌడ్, దేవి ముదిరాజ్ మరియు యూత్ సభ్యులు, ఆంజనేయ స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వాకర్స్ క్లబ్ గవర్నర్ టి.చక్రపాణి



నవతెలంగాణ - సరూర్‌నగర్
వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి అని హైదరాబాద్ వాకర్స్ క్లబ్ గవర్నర్ టి.చక్రపాణి అన్నారు. గురువారం గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ గ్రౌండ్‌లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌ను హైదరాబాద్ వాకర్స్ క్లబ్ గవర్నర్ టి.చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ చక్రపాణి మాట్లాడుతూ ఇంత మంచి హెల్త్ క్యాంప్ నిర్వహించిన గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జగిని శ్రీనివాస్ గుప్తాను, వారి టీమ్‌ను అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని అన్ని క్లబ్‌లు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మెగా హెల్త్ క్యాంప్‌లో 161 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్, కోశాధికారి చోల్లెటి ఆనంద్, ప్రాజెక్ట్ చైర్మెన్లు కాశెట్టి నగేష్‌గుప్త, కూర శ్రీనివాస్‌గుప్త, వాకర్స్ క్లబ్ సభ్యులు నాంపల్లి శ్రీనివాస్, పొద్దుటూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

"బీజేపీకో హటావో దేశ్‌కీ బచావో"

ఇంటింటికీ సీపీఐ గోడపత్రిక విడుదల



నవతెలంగాణ-నాగోల్
"బీజేపీకో హటావో దేశ్‌కే బచావో" అంటూ ఇంటింటికీ సీపీఐ గోడపత్రికను నాయకులు, కార్యకర్తలు కలిసి విడుదల చేశారు. ఈనెల 14 నుండి మే 15 వరకు జరిగే ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నాగోల్ డివిజన్లోని ఎస్ఎ డాంగే భవన్‌లో డివిజన్లోని ఆయా శాఖల కార్యదర్శిలు, సహాయ కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆందోజు రవీంద్రచారి, మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్.రాములు మండల కౌన్సిల్ సభ్యులు భూపతి సురేష్, లలిత, పి.మధు, రాసమళ్ల రాజేందర్, నరసింహ సహదేవ్‌లతో పాటు పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సరూర్‌నగర్
భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సరూర్నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కార్యకర్తలకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ భారతదేశంలో ప్రముఖ జాతీయస్థాయి రాజకీయ పార్టీలో ఒక్కటిగా గుర్తింపు ఉందన్నారు. జాతీయ రక్షణనే ప్రధానంగా ముందుకు తీసుకెళ్తూ ఎంతో మంది నాయకుల త్యాగాలు, ఆశయాల స్ఫూర్తితో నడుస్తున్న పార్టీ బీజేపీ అని అన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు, అన్ని రంగాలలో ప్రపంచ స్థాయిలో అగ్ర దేశాలతో సహా పోటీ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి

నవతెలంగాణ-ఘట్కేసర్
ఘట్కేసర్ మునిసిపల్ 9వ వార్డ్‌లో సర్వే నెంబర్. 130,131లో ఉన్న ఒక ఇంటిపైన ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణం చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నారని కాలనీవాసులు మున్సిపల్ వైస్ చైర్మెన్ పలుగుల మాధవ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ పలుగుల మాధవ్ రెడ్డి వెంటనే స్పందించి కాలనీలో ఉర్దూ మీడియం స్కూల్, తెలుగు మీడియం స్కూల్, అంగన్ వాడిలు చుట్టుపక్కల ఉన్న పిల్లలకు, గర్భిణీలకు రేడియేషన్ ప్రభావం వల్ల తీవ్ర ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందని మునిసిపల్ కమిషనర్ వేమన్‌రెడ్డి చర్చించారు. నిర్మాణ పనులు వెంటనే నిలిపి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ వార్డ్ సభ్యురాలు మీనా, మైనారిటీ సెల్ అధ్యక్షులు కుతుబ్, ఈ డబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షులు కేశవపట్నం ఆంజనేయులు



పంతులు, కోశాధికారి శశి, బర్ల రాధాకృష్ణ, రామకృష్ణ, గఫ్ఫార్ ఆనంద్‌రెడ్డి శానవాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-సంతోష్‌నగర్
అత్యంత వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు పురస్కరించుకొని స్వామివారి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం స్వామివారి ఆశీర్వాదంతో అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ దళిత మోర్చా సిటీ సెక్రెటరీ, సెక్రెటరీ విజయ్ కుమార్ అంబేద్కర్ నగర్ బస్తీ ఆవరణలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీర్వాదంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు జాగ్రత్తలు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరానికి గుర్తింపు ఉండాలంటే యువత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కార్యకర్తలు, సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సహకారంతో దేవాలయం మరింత అభివృద్ధి

మాజీ చైర్మెన్ జగిని రమేష్ గుప్తా



నవతెలంగాణ - సరూర్‌నగర్
మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో ఆర్.కె పురంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంను మరింత అభివృద్ధి చేస్తామని దేవాలయం మాజీ చైర్మెన్ జిగిని రమేష్ గుప్తా అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ మాజీ స్థపతి, యాదాద్రి పునప్రతిష్ట ముఖ్య స్థపతి అయిన సుందరరాజన్ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానమును దర్శించి ఆలయ పునర్నిర్మాణం కొరకు సూచనలు చేసినారు అని అన్నారు. ఆలయ పునర్నిర్మాణం మంత్రి సబితా ఇంద్రారెడ్డితో చర్చించిన తర్వాత కార్యరూపందాల్చుటకు నిశ్చయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మెన్‌లు కొలిశెట్టి శివకుమార్, ఆలయ ఈఓ చిలుకూరి రంగారావు, మాజీ ధర్మకర్త భిన్నూరి ప్రశాంత్, ఆలయ సిబ్బంది రామ్మోహన్, అర్చకులు లక్ష్మణాచారి, విక్రమ్‌శర్మ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు నిరసనగా ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-బడంగ్‌పేట్
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అక్రమ అరెస్టులకు నిరసనగా గురువారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి పక్ష పార్టీల నాయకులను అక్రమ అరెస్టులు చేయటం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



వరల్డ్ ఆటిజంపై అవగాహన సదస్సు



నవతెలంగాణ- సరూర్‌నగర్
వరల్డ్ ఆటిజం అవేర్నెస్ వీక్ సందర్భంగా జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం నందు వరల్డ్ ఆటిజం అవేర్నెస్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిడబ్ల్యుఓ అధికారి ఎన్.మోతి మాట్లాడుతూ ఆటిజం అనునది నాడి సంబంధిత, పిల్లల ఎదుగుదలకు సంబంధించిన ఒక పరిస్థితి అని అన్నారు. దీనిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా సంబంధిత థెరపీలు అందిచడం వలన దాని యొక్క తీవ్రతను తగ్గించ వచ్చును అని అన్నారు. ఆటిజం యొక్క లక్షణాలు, నివారణల గురించి సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రమేష్, శోభ, వివిధ ఎన్జీవోల నుంచి పిల్లలు, టీచర్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగ హనుమాన్ శోభాయాత్ర

శోభ యాత్రలో సామరంగారెడ్డి, లచ్చిరెడ్డి, నవీన్ శర్మ

నవతెలంగాణ- వనస్థలిపురం
హనుమాన్ విజయోత్సవం సందర్భంగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం డివిజన్ పరిధిలోని ఎస్‌కేడి నగర్ డీపీఎస్ స్కూల్ గ్రౌండ్ నుంచి కర్మాన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం వరకు నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, రాజేశ్వరి శక్తిపీఠం నవీన్‌శర్మ అయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవకిషోర్ రెడ్డి పాల్గొని హనుమాన్‌కి జై జై అంటూ నినాదంతో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు భూపాల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాజిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ, రవికుమార్ నాయక్, యాదిరెడ్డి, సంజీవరెడ్డి, పాండురంగారెడ్డి, రాజు గౌడ్, పార్టీ నాయకులు రఘురాం నేత, శంకరయ్య గౌడ్, నరసింహారెడ్డి, సందీప్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, శరత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవిశంకర్, జైపాల్ రెడ్డి, శ్రీధర్‌రావు, సంగమేశ్వర్, ముత్యాలు, రాజేందర్ రెడ్డి, శివ కుమార్, మధుసూదన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, సెక్రటరీ భ్రమరాంబ, నాయకులు కామేష్, ఫణి, సుధీర్, పవన్ రెడ్డి, గోపి, సుధీర్, జగన్మోహన్, విజయ్, రాజు, మురళి, భాను, ప్రేమ్ కుమార్, వెంకటేష్, శివ మరియు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో హనుమ శోభాయాత్ర

నవతెలంగాణ-బడంగ్‌పేట్

అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మామిడిపల్లి గ్రామం నుంచి శ్రీ పంచముఖి హనుమాన్ వ్యాయామశాల కమిటీ ఆధ్వర్యంలో సాగిన హనుమాన్ శోభాయాత్రలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు. జై శ్రీరామ్ - జై హనుమాన్ అంటూ పాతబస్తీ గల్లీల్లో కాషాయ జెండాలను రెపరెపలాడించారు. శ్రీరామ రక్షకులు హిందూ ధర్మ కార్యాన్ని కాషాయం జెండా ఊపి ఆయన ప్రారంభించారు. రహదారి వెంట యువకులు వీర హనుమాన్ జెండా చేతబూని బైక్ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్ రెడ్డి, విజేందర్ రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్, బడంగ్‌పేట్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు పెరమోని నరేష్ యాదవ్, విఘ్నేశ్, రంగనాథ్, విశ్వనాథ్, శ్రీకాంత్, జగన్నాథ్ రెడ్డి, వెంకట్, మురళీ సహా బీజేపీ, బీజేవైఎం సహా స్థానిక హిందూ బంధువులు, హిందూ ధార్మిక సంస్థలు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు

హనుమాన్ జయంతి సందర్భంగా బాలాపూర్ శ్రీ ఆంజనేయస్వామిని, దేవతలగుట్ట ఆంజనేయస్వామిని, పెద్ద చెరువు బాల ఆంజనేయస్వామిని పీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగేటి మధుసూదన్‌రెడ్డి, కళ్లెం నిరంజన్ రెడ్డి, సమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం గోవర్ధన్ రెడ్డి, ఆంజనేయులు రామస్వామి, నందు, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల శ్రీనివాసగుప్త ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నాగోల్
గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నాగోల్ డివిజన్లోని నాగోలు, అలకాపురి కాలనీలో హనుమాన్ దేవాలయంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, ఐవిఎఫ్ తెలంగాణ విభాగం అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త సకుటుంబ సమేతంగా సందర్శించి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి సతీమణి ఉప్పల స్వప్న కుమారులు ఉప్పల సాయికిరణ్, సాయి తేజ, టెంపుల్ చైర్మెన్ రాజు, టెంపుల్ డైరెక్టర్స్ దేవాలయ కమిటీ సభ్యులు, పండితులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



సాయిబాలజీ కాలనీలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్
హనుమాన్ జయంతి సందర్భంగా సాయిబాలజీ కాలనీలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సాయి బాలాజి కాలనీలో ఏర్పాటు చేసిన ర్యాలీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావంతో ప్రజలందరూ కలసిమెలసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

కాప్రాలో నీటి తొట్టెల ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా

వేసవి కాలంలో కుక్కల , పక్షుల దాహం తీర్చడం కోసం జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తోంది. ఈ నేపథ్యంలో కాప్రా డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ వాటిని ప్రారంభించారు. డివిజన్‌లోని మిగతా కాలనీల్లో రేపటి నుంచి ఏర్పాటు చేస్తారని తెలిపారు..ఈ కార్యక్రమంలో రెడ్డి కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి,కోశాధికారి తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు సుదర్శన్,సలహాదారుడు సురేందర్ రెడ్డి,కాలనీ వాసులు జీవన్ రెడ్డి,బాల్ రెడ్డి, వెటర్నరీ సిబ్బంది, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఐఐసీ చైర్మెన్‌ను కలిసిన గొల్లూరి అంజయ్య



నవతెలంగాణ-కాప్రా

పరిశ్రమ భవనంలో టీఎస్ఐఐసీ చైర్మెన్ గ్యాదరి బాలమల్లును, జీహెచ్ఎంసీ మాజీ స్టాడింగ్ కౌన్సిల్ మెంబర్, బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గొల్లూరి అంజయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర వంజరి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ వంజరి ప్రవీణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కనకరాజ్ గౌడ్,అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేడుకలో ప్రజలను భాగస్వాములు చేయాలి

- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహ ఆవిష్కరణ ఏప్రిల్ 14న వైభవోపేతంగా జరుగుతుందని, ఈ వేడుకలో ప్రజలను భాగస్వాములు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. గురువారం గొర్రెల పంపిణీ, అంబేద్కర్ జయంతి వేడుకలపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ అమోయ్ కుమార్ పాల్గొని గొర్రెల పంపిణీ, అంబేద్కర్ జయంతి పై పలు సూచనలు చేశారు.

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 300 మంది అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 6 బస్సులతో ప్రజలను తరలించాలని, స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మండల కేంద్రం నుంచి బస్సులు నడపాలని తెలిపారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి తప్పనిసరిగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు హైదరాబాద్ కు ప్రజలు చేరుకునే విధంగా జిల్లా స్థాయిలో ప్రణాళిక తయారు చేసుకోవాలని అధికారుల కు సూచించారు. ప్రజలకు ఆ రోజు టిఫిన్, లంచ్, డిన్నర్ ఏర్పాటు చేయాలని, ప్రతీ బస్సులో పోలీస్ అధికారి, ప్రభుత్వ అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించాలని, బస్సు తిరిగి మండల కేంద్రాలకు చేరే వరకు జిల్లా స్థాయిలో మానిటరింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రజల తరలింపు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పాల్గొనే ప్రజల వివరాలు ఏప్రిల్ 10 నాటికి సేకరించాలని, ప్రతీ మండల పరిధిలో వెళ్లే బస్సులో అవసరమైన స్నాక్స్, వాటర్ బాటిల్, బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రతీ మండల కేంద్రంలో ఉదయం 6గంటల వరకు బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జెడ్పీ సీఈవో దేవసహాయం,. జిల్లా పశువైద్యాధికారి శేఖర్, ఆర్డీవోలు రవి, మల్లయ్య, డిఆర్డిఓ పద్మజారాణి డిపిఓ రమణమూర్తి, జిల్లా ఎస్సి వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్.. ఎన్ఎఫ్‌సీ ఉద్యోగి ఆత్మహత్య



నవతెలంగాణ-కాప్రా

ఆన్‌లైన్ గేమింగ్‌లో మోసపోయిన ఎన్ఎఫ్‌సీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాప్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈసీఐఎ ల్‌కు చెందిన వరద శివ ఎన్ఎఫ్ సీలో పనిచేస్తున్నాడు. భార్య, ఏడాది న్నర కుమారునితో కలిసి ఈసీఐఎల్‌లోని డీఏఈ కాలనీలో నివాసముం టున్నారు. ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైన వరద శివ రూ. లక్షల్లో డబ్బులు నష్టపోయాడు. ఇదిలా ఉండగా ఈ నెల 2న కుటుంబసమ్మేతంగా తన భార్య పుట్టిళ్లు అయిన గద్వాల్‌కు వెళ్లారు. తన భార్యా, కుమారున్ని అక్కడే వదిలేసిన శివ అదే రోజు రాత్రి డీఏఈ కాలనీకి తిరిగొచ్చాడు. అయితే బుధవారం ఎన్ఎఫ్‌సీలో సెక్యూరిటీ గార్డు పనిచే స్తున్న కమలయ్యా డీఏఈ కాలనీలోని శివ ఇంటికొచ్చాడు. ఎన్నిసార్లు తలుపులు తట్టినా ఎలాంటి స్పందన లేకపోవ డంతో అనుమానం వచ్చిన కమలయ్యా శివ భార్యకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆందోళనకు గురైన ఆమె స్థానికులకు, పోలీసులకు సమాచా రం అందించింది. వెంట నే సంఘ టనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి లోనికెళ్లారు. అయితే అప్పటికే శివ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసునమోదు చేసుకున్న కాప్రా పోలీసులు విచారణ చేపట్టారు.

జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు
- ప్రెస్ క్లబ్ నిర్మాణానికి శంకుస్థపన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయం వెనకాల సర్వేనెంబర్ 278లో మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ నూతన భవనానికి కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత దశాబ్దాల కాలంగా మల్కాజిగిరి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడంతో వారి నిరంతర కార్యకలాపాలకు ఇబ్బందులు జరుగుతున్నాయని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం అందరి సహకారం అందిస్తామని తెలిపారు. వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఆయన తన వంతు సహాయంగా 5 లక్షల రూపాయలు ప్రకటించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జీఎస్ వి సతీష్ కుమార్‌ను నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే సహకారానికి జర్నలిస్టులంతా హర్షం వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా ప్రెస్ క్లబ్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నామని మైనంపల్లి సహకారంతో తమ చిరకాల కోరిక నెరవేరిందని జర్నలిస్టులు తెలిపారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జార్జి విల్సన్,బాలాజీ గౌడ్,ప్రధాన కార్యదర్శి యాదగిరి గడ్డమిది,ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు విశాల్,రవి కుమార్ యాదవ్,జర్నలిస్ట్ నాయకులు బి.మురళి యాదవ్, డి.పాండు గౌడ్,అక్కల రాజు గౌడ్,తేజ,శ్రీకాంత్,శివ కుమార్,సదానంద చారీ, రమేష్, శివ గడ్డమిది, సుధాకర్, నాగరాజు గౌడ్, ప్రభాకర్, పరమేష్, ప్రభాకర్ గౌడ్ , కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, సునీత రాము యాదవ్, నాయకులు ఉపేందర్ రెడ్డి, గూండా నిరంజన్ , జీఎస్‌వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ప్రసాద్, బుజ్జి, సురేష్, నర్సింగ్ ,ఆగమయ్య ,బాలకష్ణ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇండ్ల పట్టాలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- పేదలకు పట్టాల పంపిణీ



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మేలు చేసేందుకు తీసుకొచ్చిన జీవో నెంబర్ 58, 59 పథకం కింద అర్హులైన పట్టాలు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం దమ్మాయిగూడా మున్సిపాల్టీలో దమ్మాయిగూడ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 221 మంది పేదలకు ఇండ్ల పట్టాలు, 28 మందికి కల్యాణ లక్ష్మీ ,షాధి ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జీవో నెంబర్ 58, 59 పథకం కింద పెద్ద ఎత్తున పట్టాలు సిద్ధం చేసి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేదలు ప్రభుత్వ స్థలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నివాసాలకు మునుపెన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారికే ఈ పథకం ద్వారా శాశ్వత ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పేదలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలనే ఉద్దేశంలో ప్రభుత్వం జీవో నెంబర్ 58, 59 పథకాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేయగా ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించి గడువును పొడిగించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే పకడ్బందీ ప్రణాళికతో ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని గుర్తు చేశారు. రైతులకు ఉచితంగా 24గంటల కరెంట్ , రైతు బంధు, రైతు బీమా, పెన్షన్, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ స్వామి, డిప్యూటీ తహసీల్దార్ రెహ్మాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, కౌన్సిలర్లు నాను నాయక్, నాగయిపల్లి సుజాత, కొత్త హేమలత, మంగల్ పురి వెంకటేష్ , కొత్త సురేఖ, వరగంటి వెంకటేష్, సంపన్ బోల్ స్వప్న, గోగుల సరిత, పాండాల అనురాధ, వసుపతి రమేష్ గౌడ్, మాదిరెడ్డి నరసింహారెడ్డి, రామారం శ్రీహరి గౌడ్, కో ఆప్షన్ సభ్యులు షేక్ షాదుల్ బి.ఆర్.ఎస్ దమ్మాయి గూడా మున్సిపల్ అధ్యక్షుడు కౌకుంట్ల తిరుపతి రెడ్డి ,ప్రధాన కార్యదర్శి హరి గౌడ్, నాయకులు వసుపతి శ్రీకాంత్ గౌడ్, కొత్త శ్రీనివాస్ గౌడ్, కొత్త భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) అగ్రనేత బీటీ రణదీవేకు నివాళ్లు

నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) అగ్రనేత బీటీ రణదీవే వర్ధంతి సందర్భంగా గురువారం పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆధ్వర్యంలో ఆయనకు నివాళి కార్యక్రమం ఈసీఐఎల్‌లోని కమలానగర్ ఆఫీసులో నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు గొడుగు యాదగిరిరావు అధ్యక్ష వహించారు. బీటీ రణదీవే చిత్ర పటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, పార్టీ జిల్లా ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాసరావులు బీటీ రణదీవే చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ బీటీ రణదీవే అగ్ర నాయకుల్లో ఒకరని చెప్పారు. బొంబాయి నగరంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణంలోనూ అగ్రగన్యులని చెప్పారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా నావికా తిరుగుబాటు జరిగినప్పుడు బొంబాయి నగరంలో కార్మిక వర్గం నాయకులకు మద్దతుగా వారికి తోడ్పడ్డారని, దానికి నాయకత్వం బీటీ రణదీవే వహించారని చెప్పారు. భారత దేశంలో వర్ణ వ్యవస్థ వర్గ రూపం దాల్చిందని, రెండింటిపై పోరాటం తప్పనిసరిగా చేయాల్సి ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ , ప్రముఖ రచయిత పి బి చారిలు మాట్లాడుతూ.. రణదీవే కార్మికుల పక్షాన, ప్రజల పక్షాన పోరాడి హక్కుల సాధించినటువంటి గొప్ప నాయకుడు అని అభివర్ణించారు. అనంతరం హాజరైన వారందరూ రణదీవే చిత్రపటానికి పుష్పాలు అర్పించి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు , సాంబశివరావు , గౌసియా, ప్రసాద్ బాబు , వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లోని రీజినల్ బజార్‌లో గురువారం కురిసిన వర్షానికి మనోహర్ థియేటర్ వెనుక వైపు విద్యుత్ స్థంభం నెలకొరిగింది. దాంతో ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లు కనిపిస్తున్నాయి. విద్యుత్ వైరు ఏ మాత్రం తెగినా పెద్ద ప్రమాదం తప్పదు.
నవతెలంగాణ-బేగంపేట

చర్లపల్లి ఆర్ఓబిని త్వరలో ప్రారంభిస్తాం

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

నిర్మాణం పనులు పూర్తి చేసుకున్న చర్లపల్లి ఆర్ఓబిని త్వరలో ప్రారంభిస్తామనిఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి తెలిపారు. చర్లపల్లి రైల్వే రోడ్డు కం ఓవర్ బ్రిడ్జిని గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం అవసరమైన కోట్లాది రూపాయల నిధులను కేటాయింపజేసి ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి., బీఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు డప్పు గిరిబాబు, సారా అనిల్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు , కడియాల రమేష్, బాబు, చంద్రమౌళి, వంశీరాజ్, నందకిషోర్, జోండ్ల వేణుగోపాల్ రెడ్డి, రెడ్డి నాయక్, సర్వరాజ్, రాకేష్, కరీం, చర్లపల్లి పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు, డప్పు కళాకారులకు బాసటగా ఉంటా

- ప్రజా గాయకుడు గద్దర్



నవతెలంగాణ-నేరేడ్‌మేట్

గద్దర్ అంటే విప్లవం అని, బీఆర్ఎస్ పార్టీతో పాటు అన్నీ పార్టీలతో 'గద్దర్ గళం' పనిచేస్తుందని ప్రజాయుద్ధనౌక గద్దర్ తెలిపారు. రాష్ట్రం మొత్తం తిరగడంలో వెనుకంజ వేసే ప్రసక్తి చేయలేదని స్పష్టం చేశారు. గురువారం నాటికి గద్దర్ పై కాల్పులు జరిగి 26 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విప్లవం, ఓట్లు - యుద్ధంపై సదస్సును అల్వాల్‌లో నిర్వహించారు. పలువురు గద్దర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ... 75 సంవత్సరాలుగా జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ప్రజల కోసం గద్దర్ ప్రజా గళం వినిపిస్తూ ఉద్యమ బాటలో నడిచానన్నారు. తన శేష జీవితాన్ని తన సతీమణి విమల తో కలసి కొత్తగా "గద్దర్ దళం"ను ఏర్పాటు చేసి, కన్వీనర్‌గా విమల గద్దర్‌ను నియామకం చేసి ఆమె సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగిస్తుంటుం దన్నారు. తాను మాత్రం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని సభను ఉద్దేశించి చెప్పారు. సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేసి, కళాకారులకు, రచయితలకు, డప్పు కళాకారులకు బాసటగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డప్పు కళాకారులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాస్టర్, జెవి, రాజు, హరినాథ్, నేర్నాల కిషోర్, ఏపూరి సోమన్న, వెంకటాచారి, సీ.ఎల్, యాదగిరి, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

హనుమాన్ జయంతి సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం తాడ్ బండ్ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ ఈవో అంబుజ ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో పండితులు ఆశీర్వచనం చేశారు. మంత్రి వెంట కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, నాయకులు టీఎన్ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, పాండు తదితరులు ఉన్నారు.

పేదలను ఆదుకోవడం మన కర్తవ్యం

- కో ఆప్షన్ సభ్యులు నూరుద్దీన్ ఫారూఖ్



నవతెలంగాణ-జవహర్ నగర్

నిరుపేద ముస్లిం మైనారిటీలను అండగా నిలిచి ఆదుకోవాలని జవహర్ నగర్ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇత్తెహాద్ ఉల్ ముస్లిమేన్ వెల్ఫేర్ అసోసియేషన్ దాదాపు 200 మంది ముస్లిం మైనారిటీ మహిళలకు రంజాన్ రేషన్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కో. ఆప్షన్ సభ్యులు పాల్గొని బియ్యం నిత్యావసర సరుకులను అందజేసి సంస్థ వారిని అభినందించారు. గత కొంత కాలం నుంచి ప్రతీ నెల ఈ సంస్థ నుంచి పేద ముస్లిం మైనారిటీలకు,వితంతువులను గుర్తించి ఈ కిట్ అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు ఈ సంస్థ ఫౌండర్ మహమ్మద్ రఫిక్, అబ్దుల్ హమీద్, మహమ్మద్ గఫార్, ఎండీ నజీమ్ పాషా, ఫైసల్ అలీ, గత కొన్ని సంవత్సరాల నుండి ఈ సంస్థను స్థాపించి సేవ చేయడం జరుగుతున్నది. ఈ కార్యక్రమానికి తమ వంతు సహాయంగా మొహమ్మద్ ఫరూక్ కో- ఆప్షన్ సభ్యులు, నియామత్ ఖాన్, మొహమ్మద్ సాదిక్,అబ్దుల్ మతిన్, ఎండీ రఫీ బాయ్, అమీర్, సుభన్, తాజుద్దీన్ శేఖర్ అలీ సహాయం చేయడం జరిగిందన్నారు.



దళిత రత్న అవార్డులు అందుకున్న వారిని అభినందించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నాచారం

తెలంగాణ ప్రభుత్వం 2023 సంవత్సరానికి గాను రవీంద్రభారతిలో జరిగిన మహనీయులు బాబు జగ్జీవన్ రావ్, బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్‌కు చెందిన పలువురికి దళిత రత్న అవార్డులను ప్రదానం చేశారు. దళిత రత్న అవార్డు అందుకున్న నాగేందర్, జగన్, రాజు, నరసింగరావు, దేవయ్య, సురేష్ కుమార్, శ్రీనివాస్, నెక్సన్, మాన్యం, రామచంద్రు, లోకేష్, రవి శేఖర్, సురేష్‌లను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆలోచన విధానాన్ని, ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడంలో వీరు చేస్తున్న కషికి గుర్తింపుగా దళిత రత్న అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగారం బాబు, ఫైళ్ళ ప్రవీణ్, చిన్న దుర్గయ్య, నర్సింగరావు, శీలం, ప్రవీణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోల్ ఆఫ్ ఐసీటీ ఇన్ ఎడ్యుకేషన్‌పై వర్చువల్ కాన్ఫరెన్స్



నవతెలంగాణ-నాచారం

సమాజాన్ని అధ్యయనం చేయడం సాంకేతిక పరిజ్ఞానం ద్వారానే సాధ్యమవుతుందని ప్రముఖ విద్యావేత్తలు అన్నారు. రోల్ ఆఫ్ ఐసీటీఇన్ ఎడ్యుకేషన్ ఎన్ఈపీ 2020 అనే అంశంపై నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్ అండ్ ఆర్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సునీతారావు సమన్వయంతో నిర్వహించిన కాన్ఫరె న్స్‌లో ఎన్ సీఈఆర్టీ ఢిల్లీ డాక్టర్ పవన్ సుధీర్, దక్షిణాసియా కేంబ్రిడ్జ్ రీజనల్ మేనేజర్ లలిత్ ప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్ యూజీసీ హెచ్ఆర్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ కేజీ విశ్వ నాథ్, నార్త్ బెంగుళూరు డీపీఎస్ ప్రిన్సిపల్ మంజు బాలసుబ్రమణ్యం, క్లినికల్ సైకాలజిస్ట్, ఎన్ఎంహెచ్ ఫ్యాకల్టీ డాక్టర్ జీ శ్రీకష్ణ ఇంటిగ్రేషన్ చర్చల్లో పాల్గొన్నారు. దేశవ్యా ప్తంగా నాణ్యమైన విద్యా బోధన విధానంపై ఆర్ట్ ఇంటిగ్రేషన్ చర్చించారు. వనరులను సమీకరించడం ద్వారా సహకారం బోధనకు ఐసిటి సహాయపడుతుందని.. దానితో అద్భుతమైన అభ్యాస అనుభవాన్ని ఇస్తుందని డాక్టర్ పవన్ సుధీర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అధ్యాపకులు కంటెంట్ క్రియేటర్స్ గా మార్చవలసిన అవసరం వారికి ఇవ్వవలసిన ట్రెనింగ్ పై లలిత ప్రసాద్ చర్చించారు. సుస్థిరమైన ఆన్‌లైన్ కమ్యూనిటీని నిర్మించడానికి పాఠశాలలు ఐసీటీని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. నార్త్ బెంగళూరు డీపీఎస్ ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త మంజు బాలసుబ్రహ్మణ్యం. వ్యక్తిగతీకరించిన బోధన కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ వినియోగం గురించి ప్రొఫెసర్ జీకే విశ్వనాథ్ వివరించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు డిజిటల్ ప్లాట్ ఫామ్‌ను సమర్థవంతమైన సాధనగా ఉపయోగించే మార్గాలను డాక్టర్ జి శ్రీకష్ణ వివరించారు. విద్యా వ్యవస్థ దేశ నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర పరిధి సవాళ్లపై తమ దార్శనిక ఆలోచనను పంచుకున్నారు. టీచింగ్, లెర్నింగ్ ప్రక్రియలో ఐసీటీ తీసుకొచ్చిన ప్రధాన మార్పులకు వక్తులందరూ సుస్థిరంగా అంగీకరించి స్థిరమైన పర్యవేక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడం విద్యార్థులు అధిక వినియోగానికి బాధితులుగా మారకుండా నిరోధించడంలో సహాయపడుతుందన్నారు. ఎన్ఈపీ 2020 విద్యా విధానంలో ఐసీటీ పాత్ర అద్భుతమైన ఫలితాలను సాధించాలని వక్తలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రముఖ విద్యావేత్తలు, ఫ్యాకల్టీ మెంబర్స్, ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ న్స్, ఇస్టాటిక్స్ పాల్గొన్నారు.

ఘనంగా హరివర్ధన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు కీసరలో ఘనంగా జరిగాయి. కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని హరివర్ధన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కీసర అంబేద్కర్ విగ్రహం నుంచి పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే మేడ్చల్ జిల్లా లోని కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీగా తరలివచ్చి హరివర్ధన్ రెడ్డితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు రవి, కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్, పార్టీ మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోటకూర జంగయ్య యాదవ్, కృష్ణ యాదవ్, పార్టీ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి , నాయకులు రామిడి విజయ్ రెడ్డి ,మధుసూదన్ రెడ్డి , శివరాంరెడ్డి ,పొట్ట శ్రీశైలం ,పొట్ట విగ్నేష్ ,గండిపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన చైర్మెన్ ప్రమాణస్వీకారం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ కుషాయిగూడ శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి వారి దేవస్థాన కమిటీ నూతన చైర్మెన్‌గా ఎన్నికైన సంకురి శ్రీనివాస్ గౌడ్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీనివాస్ గౌడ్‌తో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మెన్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి హాజరై శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానించి శుభాకాం క్షలు తెలియజేశారు. ఆలయ ఈవో వీరేశం, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, శివకుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో నూతన నియామకాలు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేటివ్ స్థానాల్లో నాలుగు మార్పులు, చేర్పులు చేశారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొ.ఇ.విద్యా సాగర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఓయూ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (ఓటీబీఐ) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ నుంచి మైక్రోబయాలజీ విభాగానికి చెందిన ప్రొ.బి.సందీప్త సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ చరిత్ర విభాగానికి చెందిన ప్రొ.బి.లావణ్య కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ (సిడిసి) డీన్‌గా నియమితులయ్యారు. డా.సి.హెచ్.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొ.డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్సెస్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, మహాత్మా జ్యోతిబా పూలే రీసెర్చ్ సెంటర్, ఓయూ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. నూతన నియామకాల ఉత్తర్వులను వారికి ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అందజేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి అవినీతికి తావు లేకుండా చూడాలనీ, ఈ బాధ్యత అధికారులపై ఉన్నదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం గోల్నాక డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అగ్రగామి డివిజన్‌గా గోల్నాకను అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కమలాకర్ రెడ్డి, రాజు, రాజేష్, ఆర్కే బాబు, బి.నర్సింగ్ యాదవ్, రేడపాక రాము, ఎం.నర్సింగ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్మూలనకు అవగాహన అవసరం

- బసవతారకం కృషి, సేవలు అభినందనీయం
- గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

వ్యాధి నిర్మూలనకు అవగాహన ఎంతో అవసరం అనీ, వ్యాధిని నయం చేసి ఇంటికి పంపిస్తే సంతోషపడుతారనీ, వైద్యురాలిగా తనకు ఇబ్బందులు తెలుసుసనీ, సాంకేతిక నిపుణత వ్యాధి నిర్మూలనకు ఎంతో దోహదపడుతుందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో 24 పడకల నూతన డే కేర్ వార్డును గవర్నర్ ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్ రోగులకు స్వాంతన చేకూర్చడంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చేస్తున్న కృషి, అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. క్యాన్సర్ రాకుండా ముందుగానే నివారించే చర్యలు చేపట్టాలనీ, అందుకోసం వ్యాధిపై ప్రజల్లో అవగాహన కలిపించాలని సూచించారు. ఈ హాస్పిటల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్యం అంది వారికి వ్యాధి నయం చేసి తిరిగి వారి ఇంటికి పంపించడానికి ప్రయత్నం చేస్తే ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. ఒక హాస్పిటల్ నడపడం ఎంత కష్టమో వైద్యురాలిగా తనకు తెలుసు అనీ, ఇంతటి పెద్ద హాస్పిటల్‌ను అందులోనూ సుమారు 25 శాతం మందికి తక్కువ ధరల్లో, ఉచిత వైద్యం అందించడం హాస్పిటల్ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతన డే కేర్ వార్డు నిర్మాణంతోపాటు హాస్పిటల్ రోగుల కోసం రూ.50 లక్షల విరాళం అందించిన రేఖ రాజశేఖర్ ఫౌండేషన్‌కు చెందిన డా.డి.వి. రాజశేఖర్, వారి కుమారులు రాజీవ్, రంజిత్, రంజన్లను సత్కరించి ప్రశంసించారు. అంతకు ముందు హాస్పిటల్ చైర్మెన్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఎప్పటికపుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోనికి తీసుకొస్తూ క్యాన్సర్ రోగులకు అత్యున్నత శ్రేణి వైద్య చికిత్సలు అందించడానికి కృషి చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఈ పయనంలో ఎందరో దాతలు ముందుకు వచ్చి హాస్పిటల్ అభివృద్ధికి దోహదపడ్డారనీ, ఈ కోవలోనే డా.రాజశేఖర్ ముందుకు వచ్చి విరాళం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఈఓ డా.ఆర్ వి ప్రభాకర రావు ఆహూతులకు స్వాగతం పలుకుతూ హాస్పిటల్ అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డా.టిఎస్ రావు, దాత డా.రాజశేఖర్, వారి కుమారులు రంజిత్, రాజీవ్, రంజన్లు, హాస్పిటల్‌కు చెందిన వైద్యులు, వైద్యేతర సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసిన తర్వాతే పరీక్షల తేదీలను ప్రకటించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ బోర్డును ముట్టడించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహేష్. శ్రీకాంత్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్స్ లీకేజీ వల్ల నెల రోజులుగా రాష్ట్రంలో అభ్యర్థులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. నోటిఫికేషన్ల కోసం రాష్ట్రంలో అనేక పోరాటాలు జరిగాయనీ, దీంతో నిరుద్యోగుల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించుకోవడానికి నామమాత్రమైన నోటిఫికేషన్లు ఇచ్చారన్నారు. దీంట్లో కూడా పేపర్ లీకేజీకి అవ్వడంతో తీవ్రమైన నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ తన రాజకీయ స్వలాభం కోసం పని చేస్తున్నారని మండిపడ్డారు. లక్షలాదిమంది విద్యార్థులకు, నిరుద్యోగులకు మనోధైర్యం ఇవ్వడం కోసం ఇంతవరకు కనీసం స్పందించకపోవడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి విద్యార్థులకు నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రెటరీలను తొలగించి బోర్డును ప్రక్షాళ చేయాలని డిమాండ్ చేశారు. నూతన బోర్డు నియామకాన్ని వెంటనే చేపట్టిన తర్వాతే పరీక్షల తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లీకేజీ వల్ల నష్టపోయిన అభ్యర్థులందరికీ రూ.లక్ష నష్టపరిహారాన్ని ఇవ్వాలని కోరారు. ప్రభుత్వమే ఉచితంగా కోచింగ్ వసతులను కల్పించాలనీ, పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను నిరుద్యోగులను కలిసి వచ్చే అన్ని ప్రజాసంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, కిరణ్, శ్యాం, రాజేశ్వర్, సైదులు, సత్యం, కుమార్, రవి, శ్రీనివాస్, చంద్రరావు పాల్గొన్నారు. ముట్టడికి ప్రయత్నించిన వీరందరినీ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు

- డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లను అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. గురువారం అడ్డగుట్ట డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో 48 మంది లబ్దిదారులకు మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయాన్ని డిప్యూటీ స్పీకర్, హోం మంత్రి మహమూద్ అలీ, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కార్పొరేటర్లు లింగాని ప్రసన్న, సామల హేమ, రాసురి సునీత, బీఆర్ఎస్ యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్, నాయకులు మోతె శోభన్ రెడ్డి, లింగాని శ్రీనివాస్, కరాటే రాజు, చీఫ్ ఇంజినీర్ సురేష్ కుమార్, జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డీఓ వసంత కుమారి, హౌసింగ్ సెల్ ఇంజినీర్ వెంకట దాస్, జలమండలి జనరల్ మేనేజర్ రమణారెడ్డి రెడ్డి, ఇతర నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ స్థలాల కొరత కారణంగా నాలుగు ప్రదేశాల్లో మాత్రమే 419 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించగలిగామన్నారు. పేదలకు ఇతర ప్రాంతాల్లో ఇండ్లను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అడ్డగుట్టలో ప్రభుత్వ హాస్పిటల్‌ను నిర్మిస్తామనీ, ఆజాద్ చంద్రశేఖర్ నగర్ ను సమస్యల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అర్హులకు పించన్లు అందిస్తామని తెలిపారు. హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ పేద ప్రజల కలలను సాకారం చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. పేదల ప్రయోజనాల పరిరక్షణలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ కృషి ప్రశంసనీయమన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు బీఆర్ఎస్ సర్కారు చిరునామాగా నిలుస్తుందని వారు తెలిపారు.

'అపోలో' వార్షిక నివేదిక విడుదల



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఊబకాయం, అసాధారణ కొలెస్ట్రాల్ అసమానతలను సూచించే డిస్లిపిడెమియా వంటి ప్రారంభ ప్రమాద కారకాల ప్రాబల్యం 2019-2022 మధ్య వరుసగా 50శాతం, 18శాతం పెరిగింది. జీవనశైలి రుగ్మతలకు దారితీయడంలో 'మానసిక ఆరోగ్యం' నిద్ర ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించడం లేదు. వ్యక్తి ఆరోగ్య స్థితిని గ్రహించి, వ్యక్తిగతీకరించిన పరీక్షలతో, ప్రమాదాలను అంచనా వేసే, ఆరోగ్య విషయంలో మార్గనిర్దేశం చేసే 100 శాతం వైద్యుని ద్వారా అందించే చికిత్సతో, ఎఐ-మద్దతు గల హెల్త్ ప్రోగ్రాం అయిన ప్రోహెల్త్‌ను అపోలో అందిస్తున్నది. ఇది సాధారణ చెకప్‌ల యుగానికి ముగింపు పలికే వన్-స్టాప్ నివారణ ఆరోగ్య పరిష్కారాన్ని అందిస్తుంది. అపోలో, హెల్త్ ఆఫ్ ది నేషన్ పేరుతో తన వార్షిక నివేదికను విడుదల చేసింది. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మెన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ 'అనారోగ్యం, వ్యాధి లేదా ఇతర ఆరోగ్య సమస్యలను నివారించడానికి స్క్రీనింగ్, చెక్-అప్‌లు, రోగి కౌన్సెలింగ్‌తో కూడిన సాధారణ ఆరోగ్య సంరక్షణ అయిన ప్రివెంటీవ్ హెల్త్‌కేర్ అనేది జాతీయ ప్రాధాన్యతగా మారాలి. 3 దశాబ్దాలుగా, నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ (జీవనశ్శైలి వ్యాధులు) అనేవి మరణాలు, బాధలకు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. దేశంలో 65శాతం మరణాలకు ఇవి దోహదం చేస్తున్నాయి. ఎన్‌సిడిలు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా, ఉత్పాదకత, ఆర్థిక వృద్ధిని కూడా ప్రభావితం చేస్తాయి. 2030 నాటికి వీటి వల్ల భారతదేశంపై సుమారు 4.8 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక భారం పడుతుందని ఒక అంచనా. ప్రపంచంలో అతి పిన్నదైన, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశానికి ప్రజా ఆరోగ్యం అనేది మన దేశ భవిష్యత్తుకు ఒక కీలకమైన సూచిక. ప్రజల ఆరోగ్యం అనేది మనం ఎంత సమర్థవంతంగా, పూర్తి సామర్థ్యంతో జీవిస్తున్నామో నిర్ణయిస్తుంది. ఎన్‌సిడి (నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్)ల ప్రభావాన్ని తగ్గించడానికి ఒక చురుకైన, స్పష్టమైన వ్యూహం మనకు అవసరం. ఉత్తమ పరిష్కారం అనేది నివారణలోనే ఉన్నది" అని ఆయన తెలిపారు.

కార్మికవర్గ సమస్యలపై పోరాటం చేసి వ్యక్తి 'బీటీఆర్'



నవతెలంగాణ-హైదరాబాద్

కార్మికవర్గ సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహా వ్యక్తి బీటీ అని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్, కోటయ్య అన్నారు. సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో బీటీ రణదివే 33వ వర్ధంతి సందర్భంగా చాంద్రాయణగుట్టలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకులు సోమయ్య, వీరన్న, సక, నగప్ప పాల్గొన్నారు.

సౌత్ జిల్లా కార్యాలయంలో..



బీటీఆర్ స్వాతంత్ర్య పోరాట యోధుడు, కార్మిక వర్గ పక్షాన పోరాడుతూ జీవితం గడిపిన మహనీయుడనీ, ఆయన జీవితం కార్మిక వర్గానికి ఆదర్శనీయమని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు ఎం.మీనా అన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యాలయంలో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళా కార్మికులతో కలిసి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, భవన్ నిర్మాణ కార్మికులు, సీఐటీయూ జిల్లా నాయకులు మహేష్ దుర్గే, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ఏటికూరి కృష్ణమూర్తికి సన్మానం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరయోధులు 102 ఏండ్ల ఏటికూరి కృష్ణమూర్తిని గురువారం బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్ అవుట్ పేషెంట్ విభాగంలో జరిగిన హెల్త్ ఫర్ ఆల్ కార్యక్రమంలో సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. ఏటుకూరి కృష్ణమూర్తిని సత్కరించుకోవడం సంతోషంగా ఉందని హాస్పిటల్ సీఓఓ నీలేష్ గుప్తా తెలిపారు. ఆయన రోజు వారి దినచర్యలు ఆరోగ్య రహస్యాలు హాస్పిటల్ సిబ్బందికి తెలియచేయాలన్నారు. ఆయన రాసిన "ప్రజా వైద్యం" అనే పుస్తకం ఎంతమందికి ఎన్నో ఆరోగ్య సూత్రాలను నేర్పిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఏటుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ మన జీవనశైలి, అలవాట్లే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయన్నారు. తెలిసో, తెలియకో ఆహార పదార్థాలు, ఆచరించే పద్ధతులు శరీరాన్ని గుల్ల చేస్తాయనీ, అలాంటి విషయాలను తెలుసుకుని రోజు వారి దినచర్యలో పాటించాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం కాలినడక వ్యాయామం అవసరమనీ, అయితే దాని గురించి కచ్చితంగా తెలిసి ఉండాలన్నారు. ఇటీవలి కాలంలో చాలామంది జీవితాల్లో యోగా ఓ భాగమైపోయిందనీ, దీనివల్ల శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎన్నో పొందచ్చు అన్నారు. ముఖ్యంగా జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేయలేని వారికి యోగా మంచి ప్రత్యామ్నాయం అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంతితోపాటు వైద్య నిపుణులు, హాస్పిటల్ మెడికల్ సూరింటెండెంట్ డాక్టర్ అజిత్ సింగ్, సీఓపీసీ హెడ్ మిస్టర్ రూఫుస్ అగస్టీన్, సీఓపీసీ అడ్మిన్ విభాగాధిపతి మిస్టర్ సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసమే బీజేపీ లీకేజీ డ్రామాలు

- సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో పేపర్ లీకేజీ ఘటనలతో విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ నిస్పృహలకు గురవుతున్నారనీ, అందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేస్తే తప్ప వాస్తవ విషయాలు బయటకు రావని సీపీఐ పదే పదే ప్రకటిస్తున్నా ప్రభుత్వానికి చలనం లేదని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎలాగైనా రాష్ట్రంలో అధికారంలోకి రావాలని బీజేపీ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు అందులో భాగంగానే పదో తరగతి ప్రశ్నాపత్రం కాపీ చేసి లీక్ అయిందని వదంతులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎంతో కష్టపడి చదువుతున్న విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బండి సంజయ్ పై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీ విషయంలో ఆయనను విచారించాలన్నారు. ప్రజాస్వామ్యంపై ఏమాత్రం గౌరవం లేని బీజేపీ అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అక్రమంగా కూల్చివేస్తుందనీ, ప్రతిపక్ష పార్టీలపై సీబీఐ, ఐటీ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలతో దాడులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయటం చేతగాక ఎలాగైనా అడ్డదారిన, అక్రమ మార్గాల ద్వారా అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీ దివాలా రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో ఈ ఎనిమిదేండ్ల కాలంలో మనకు కనిపిస్తుందన్నారు. మతాన్ని, పండగలను అడ్డం పెట్టుకుని హింసకు పాల్పడుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక బీజేపీ చేస్తున్న దుర్మార్గ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని ఆమె సూచించారు.

ముగిసిన క్రాస్ బో షూటింగ్ టోర్నమెంట్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా క్రాస్ బో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల డా.బి.ఆర్ అంబేద్కర్ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి క్రాస్ బో టోర్నమెంట్స్ అట్టహాసంగా గురువారం ముగిశాయి. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలోని వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా ఈ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎస్.హెచ్.ఓ.ఎన్ సంజయ్ కుమార్, టిసిఎస్ఏ ప్రెసిడెంట్ లక్ష్మి చైతన్య, ఉపాధ్యక్షులు మేజర్ పద్మజా, ప్రధాన కార్యదర్శి వి.వసంత మాధురి, కోశాధికారి బి.పవన్ కుమార్, రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ పి.భువనేశ్వరి, నటులు శ్రీచరణ్, డైరెక్టర్ చంద్రశేఖర్, అంబేద్కర్ కాలేజ్ ప్రిన్సిపాల్ భవాని, డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ డా.రిషికాంత్, క్రాస్ బో షూటింగ్ జిల్లా బోర్డ్ హైదరాబాద్, క్రాస్ బో షూటింగ్ జిల్లా అసోసియేషన్ మెంబెర్స్ హాజరయ్యారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ ఇది పురాతన రోజుల్లో బతుకు తెరువు కోసం ఉపయోగించే విల్లునీ, నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా వచ్చిన తుపాకీతో విల్లుని అమర్చి కొత్త రకమైన ఒక ఆటని మన ముందుకు తీసుకురావడం అభినందనీయమన్నారు. పిల్లల మేధస్సు పెరగడంతో పాటు శారీరక దారుఢ్యం పెరగడంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు పథకాలను అందజేశారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. గెలిచామని పొంగిపోకుండా ఓడినవారు పట్టుదలతో ప్రయత్నించి విజయం సాధించాలని సూచించారు. మన రాష్ట్రానికే కాకుండా దేశానికి మంచి పేరు తీసుకురావాలనీ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు వారు సూచించారు.

నాలా పనులను త్వరగా పూర్తి చేయండి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నల్లకుంట కూరగాయల మార్కెట్లో నాలా పనులు నెలల తరబడి జరగుతుండటంతో స్థానికులు, వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వీరయ్య తెలిపారు. నాలా పనులను అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గురువారం నల్లకుంట కూరగాయల మార్కెట్ రోడ్డులోని హెరిటేజ్ నుంచి మూన్ కేఫ్ వరకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తోపాటు జీహెచ్ఎంసీ అధికారులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య నేతృత్వంలో పద్మ కాలనీ అసోసియేషన్, నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్, ఆదర్శనగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు పాదయాత్ర చేస్తున్న వారిని కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేలు, అధికారులను డిమాండ్ చేశారు. స్థానికంగా జరుగుతున్న నాలా పనులతో ఇబ్బందులకు గురవుతున్నామనీ, ఇప్పటికే అనేక దఫాలుగా అధికారులతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వారి దృష్టికి తీసుకొచ్చారు. మట్టి రోడ్డు కారణంగా దుకాణాలు, ఇండ్లలోకి దుమ్ము, ఇసుక వస్తోందనీ, దాంతో పలువురు దుకాణందారులు దుకాణాలను మూసివేస్తున్నారన్నారు. దుమ్మూ ధూలీతో వివిధ రకాల చర్మ సమస్యలు వస్తున్నాయని వివరించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా నల్లకుంట కూరగాయల మార్కెట్లో నాలా పనులు మే 15లోపు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తయిన దగ్గర వెంటనే రోడ్డు వేయించాలన్నారు. నాలా పనులు జరుగుతున్న దగ్గర భద్రతా చర్యలు చేపట్టాలనీ, దుమ్మూ ధూళీ పైకిలేవకుండా రోడ్డుపై నీళ్లు చల్లించాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని నాయకులు రితేష్, మోహన్ నాయుడు, రమేష్ నాయుడు, బాలకృష్ణారెడ్డి, వి.మోహన్ రావు, డాక్టర్ జయసూర్య శ్రీనివాసరావు, వెంకటస్వామి, జయంత్ రెడ్డి, హర్ష వీరయ్య, అశ్విన్, వినోద్ నాయుడు, రమణ, సత్యనారాయణ, జీహెచ్ఎంసీ ఎస్.ఎస్.డీ.పీ.సీ. ఈ కిషన్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ముషీరాబాద్ ఈఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్ తిలక్ పాల్గొన్నారు.



ఉస్మానియా యూనివర్సిటీ, తార్నాకలో గురువారం మధ్యాహ్నం గంటపాటు వడగండ్ల వర్షం కురిసింది. 15 నిమిషాల పాటు వడగండ్ల వర్షం కురవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. నవతెలంగాణ-ఓయూ



6 నెంబర్ రోడ్డు శ్రీరామ మందిర్‌లో గురువారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నితిన్ ప్రసాద్, రాహుల్ ప్రసాద్, గోకుల్ ప్రసాద్, కోట్ల శివకుమార్, స్వరూప, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట మహంకాళి ఆలయ అభివృద్ధికి నూతనంగా ఎన్నుకున్న కమిటీ విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సీనియర్ నాయకులు పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, కె.దుర్గాప్రసాద్ రెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన అంబర్ పేట మహంకాళి దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో త్రిశూలం గుర్తుపై పోటీచేసి విజయం సాధించిన వై శంకర్ గౌడ్ ప్యానల్ అభ్యర్థులు ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షులుగా వై శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా బింది మల్లికార్జున్ గౌడ్, జాయింట్ సెక్రెటరీగా చెంగలి సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా దోమకొండ కిషోర్, కోశాదికారిగా గడ్డం శ్రీధర్ గౌడ్ అమ్మవారి ఆలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు గడ్డం లక్ష్మణ్ గౌడ్, పి.గిరిధర్ గౌడ్, బింది రాజు గౌడ్, సతీష్ గౌడ్, దాడిగె జగన్, గోపాల్ గౌడ్, మహేందర్ గౌడ్, పండిత్ ముదిరాజ్, చంద్ర శేకర్, గడ్డం కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సంబురాల్లో డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని లాలాపేట్ వీర హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి ఉత్సవాల్లో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడారు.

పలు చోట్ల అన్నదానం





నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీసు స్టేషన్‌లో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఓబీసీ మోర్చ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క.గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్, డీఐ ఆంజనేయులు, ఎస్ఐలు లక్ష్మీనారాయణ, రాజేందర్, రవి, నరేష్, బిక్షం, భార్గవి, శాంతికుమార్, రాజశేఖర్ రెడ్డి, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసుఫ్‌గూడ బస్తీ చౌరస్తాలో జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 600 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటగా హనుమంతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజారులతో కలిసి పూజ చేశారు ఈ కార్యక్రమంలో యువకులు, స్థానికులు భారీగా పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ఎర్రగడ్డ, బోరబండలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అడిక్‌మెట్ : హనుమాన్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోటు శ్రీను ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జై సింహ, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పన యాదవ్ తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఈ



ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొట్టు శ్రీను, ప్రవీణ్, శ్రీను నాయుడు, నరహరి, రవి, నర్సింహ, గణేష్, విజయ్ యాదవ్, చిన్న రాజేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతేనగర్ హనుమాన్ గుడి వద్ద సుమారు 40 ఏండ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సనత్ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సనత్ నగర్ పోలీసుల వివరాల ప్రకారం చనిపోయిన వ్యక్తి గతేడాది నుంచి గుడి వద్ద ఇక్షాటన చేస్తూ, అక్కడే పడుకుంటాడని తెలిపారు. అక్కడకు వచ్చిన వారు ఇచ్చే ఆహారంతో జీవనం సాగిస్తాడని తెలిపారు. ఈనెల 5వ తేదీన సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో అతను చనిపోయి పడి ఉండగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. చనిపోయిన వ్యక్తి గళ్ళ చొక్కా, తెల్ల ప్యాంట్ ధరించి ఉన్నాడు. సుమారు 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు ఉంటాడనీ, ఎవరైనా అతని బంధువులు ఉంటే సనత్‌నగర్ ఎస్‌హెచ్ఓ 9490617132 నెంబర్‌కు, లేదా సబ్ ఇన్‌స్పెక్టర్ 9866683449 ను సంప్రదించాలని కోరారు.

ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి పత్తికుంట చెరువు వద్ద నూతనంగా చేపడుతున్న 51 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. అనంతరం హనుమాన్ జయంతి సందర్భంగా శోభా యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు'



నవతెలంగాణ: మేడ్చల్

టీపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు రొండా మల్లారెడ్డి ఆధ్వర్యంలో గ్రామం నుంచి బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కండ్లకోయ ఔటర్ రింగ్ రోడ్డు చేరుకొని అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరారు. అనంతరం కీసరలో ప్రారంభించే కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభంలో పాల్గొని హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నీరుడి శ్రావణ్,నాయకులు అఫ్సర్,శేఖర్, షాదు, ఆంజనేయులు, మహేష్, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే కేసీఆర్ తపన

- రాష్ట్ర హెూం మంత్రి మహమూద్ అలీ
- డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించిన హెూం మంత్రి, డిప్యూటీ స్పీకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే కేసీఆర్ తపన అని, అందుకు ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర హెూం మంత్రి మహమూద్ అలీ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏ.సీ.ఎస్ నగర్‌లో రూ.336లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 48 డబుల్ బెడ్ రూం ఇండ్లను గురువారం హెూం మంత్రి, డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 111 ప్రాంతాల్లో ఒక లక్ష గహాలు నిర్మించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా నిరుపేదలకు పైసా ఖర్చు లేకుండా అన్ని సదుపాయాలతో ప్రభుత్వమే రెండు పడకల గదుల నిర్మాణాలు చేపట్టి అందజేయడం జరుగుతుందని తెలిపారు. డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు మాట్లాడుతూ నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి డబుల్ బెడ్ రూం ఇండ్లను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు రాని వారు నిరాశ చెందవద్దని, ఇక్కడ స్థలం కొరత ఉన్నందున తక్కువ డబుల్ బెడ్ రూంలు నిర్మించడం జరిగిందన్నారు. డబుల్ బెడ్‌రూంలు రానివారికి బండ్లగూడ, జవహర్ నగర్, నాగోల్ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అడ్డగుట్ట బస్తీవాసుల కోరిక మేరకు ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ గృహాలను అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు అర్హులైన సుమారు 500 మందికి ఇండ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లింగాని ప్రసన్న లక్ష్మి, ఆర్. సునీత, సామల హేమ, హౌసింగ్ ఓ.ఎస్.డి సురేష్ కుమార్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి పథకాలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

సబ్బండ వర్గాల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక పథకాలు అమలు చేస్తున్నదని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ముడుచింతలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కల్యాణ లక్ష్మి చెక్కులను (47) లబ్దిదారులకు మంత్రి అందజేశారు. అలాగే అర్హులకు జీఓ 58 కింద మంజూరు అయినా ఇంటి పట్టా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి ఉద్దేమర్రి గ్రామంలో హనుమాన్ జయంతిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ వెంకటేష్, ఎంపీపీ హారిక మురళి గౌడ్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్ రెడ్డి, ఎంపీటీసీలు పారుపల్లి నాగరాజు, సర్పంచులు జామ్ రవి, సింగం ఆంజనేయులు, శిల్పా యాదగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, హరిమోహన్ రెడ్డి, అనురాధ రవిందర్ రెడ్డి, జ్యోతి బలరాం గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, వార్డు సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



నవతెలంగాణ-కూకట్ పల్లి

విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటమాడుతున్నదని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ మండిపడ్డారు. ప్రశ్న పత్రాల లీకేజీలలో జరుగుతున్న వ్యవహారంపై బుధవారం కార్పొరేటర్లు రోజాదేవి రంగారావు, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావులతో కలిసి ఎమ్మెల్యే పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేపర్ లీకేజీ ముమ్మాటి బీజేపీ కుట్ర అని, బండి సంజయ్ అరెస్టుతో బాగోతం బయట పడిందన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు భయ బ్రాంతులకు లోను కావొద్దనీ, తెలంగాణ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి బీజేపీ అగ్రనాయకత్వం చేసిన కుట్రలో భాగమే ఈ లీకేజీల వ్యవహారం అన్నారు. పథకం ప్రకారమే పేపర్ బయటకు వచ్చిందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ఉన్న వ్యక్తికి బీజేపీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని.. గతంలో అనేక ఫోటోలు బయటకు వచ్చాయని తెలిపారు. తాజాగా పదో తరగతి ప్రశ్న పత్రాల లీకేజీల వెనక కూడా బీజేపీ నాయకుల హస్తం ఉందన్నారు. లీక్ చేసిన వ్యక్తి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు వాట్సాప్ చేసిన ట్టు ఆరోపణలు రావడం వాట్సాప్ లో చేసిన తర్వాత ఆ విష యాన్ని బండి సంజయ్ దాచడం ఇందుకు నిదర్శనం అన్నా రు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలనుకుంటే తగిన శాస్తి జరిగిందన్నారు. నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోగా తెలంగాణలో నిరుద్యోగుల జీవితాలతో బండి సంజయ్ లాంటి వారి సాయంతో ఆడుకుంటోందన్నారు. లీకేజీ కేసులో ఎంత పెద్దవాళ్లు ఉన్నా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. బీజేపీ నాయకుల కుట్ర కుట్రలో ఎవ్వరూ పడొద్దనీ, పిల్లలు బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దొడ్ల రామ కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నిరుద్యోగ మహాదీక్షను విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన ఇందిరాపార్క్ లో జరిగే విద్యార్థి నిరుద్యోగ మహా దీక్షను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం చంద్రకాంత్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వరుసగా పేపర్ లీకుల ఘటనలు జరుగు తున్నా ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి కనీసం స్పందించలేదన్నారు. విద్యార్థులకు భరోసా ఇచ్చేలాగా ప్రభుత్వం స్పందించాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పై కూడా ప్రభుత్వం ప్రకటనలో నిరుద్యోగులకు భరోసా ఇచ్చేలాగా లేవని, ఈ ఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్రమైన న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గ్రూప్ – 1, ఇతర పరీక్షలు వాయిదా, రద్దు వల్ల నష్టపోయిన విద్యార్థులకు నెలకు రూ.20వేల నష్టపరిహారం అందించాలన్నారు. కార్పొరేట్ , ప్రయివేటు విద్యాసంస్థలల్లో ఫీజులు లక్షల రూపాయలకు పెంచుతున్నారని వాటిని, ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు చట్టం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నదన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

- జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులను సమాజంలో ఉన్నత్తులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం గాజుల రామారం ప్రాంతంలో గల వైష్ణవి టెక్నో పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల యాజమాన్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ముందుగా ఉత్తమ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లా డుతూ ఉపాధ్యాయులు ఎలాంటి స్వార్థం లేకుండా పిల్లలందరిని ఒకేలా చూస్తూ ఉత్తమ పౌరులుగా తయారు చేస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు స్వేచ్ఛను ఇవ్వాలని సూచించారు. రానున్న రోజుల్లో ఉపాధ్యా యుల కొరత ఉండే ప్రమాదం ఉందన్నారు. ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కె. రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ కోసమే కఠినంగా వ్యవహరిస్తామని అంతే తప్ప వ్యక్తిగతంగా ఎలాంటి ఉద్దేశాలు ఉండవన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు ఆంజనేయులు, కుత్బుల్లాపూర్ ట్రస్మా చైర్మెన్ శివయ్య, అధ్యక్షులు రావుల వరప్రసాద్, సలహాదారులు నర్సింహులు గౌడ్, కోశాధికారి దయాకర్, లయన్స్ క్లబ్ అఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు లయన్ వినోద్ జాదవ్, వైష్ణవి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మెన్ సిహెచ్. .నర్సింహులు గౌడ్, డైరెక్టర్ గడ్డమీది బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి లాప్ టాప్ బహూకరించిన జగన్ మోహన్ రావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

మంత్రి కేటీఆర్ మొదలుపెట్టిన గిఫ్ట్-ఏ-స్మైల్ కార్యక్రమంలో భాగంగా, ఇంజనీరింగ్ విద్యార్థి సిద్దార్థ్‌కు టీఎస్‌టీఎస్ చైర్మెన్ పాటి మీది జగన్ మోహన్ రావు ల్యాప్ టాప్ బహూకరించారు. ఆయన మాట్లాడుతూ.. బోయిన్‌పల్లి చెందిన బీఆర్ఎస్ నాయకులు వాసు యాదవ్ కుమారుడు సిద్దార్థ్ ఇంజనీరింగ్ చదువుతున్న సందర్భంగా అతనికి గిఫ్ట్ ఏ స్మైల్‌లో బాగంగా ల్యాప్ టాప్ అందించడం సంతోషంగా ఉందని అన్నారు

కాంగ్రెస్ మేడ్చల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బ్రహ్మండపల్లి మల్లేష్



నవతెలంగాణ- మేడ్చల్

కాంగ్రెస్ మేడ్చల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని రాజబోల్లారం గ్రామానికి చెందిన బ్రహ్మండపల్లి మల్లేష్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో నియామకానికి సహకరించిన టీపీసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, టీపిసిసి అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,నియోజకవర్గ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గతంలో దళితులకు చేసిన సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. దళితుల్లో చైతన్యం నింపి మండలంలోని ప్రతి గ్రామంలో దళిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీని చేరవేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సింగరేణి పోచయ్య, ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్,వేముల శ్రీనివాస్ రెడ్డి, దుడ్డు నవీన్,తాండ్ర నవీన్, బ్రహ్మండపల్లి రాములు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనలో కాంగ్రెస్ నాయకుల



నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని చిత్తారమ్మనగర్ డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగల్ రావు పాల్గొన్నారు. వారితో పాటు ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, బాలానగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆకుల నరేందర్, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి ప్రవీణ్ గౌడ్, ఎ.శ్రీనివాస్ గౌడ్, మైసూర్ రవి, చిన్న శ్రీను, కిరణ్, శ్రావణ్, సిహెచ్. సాయి, శేఖర్, ముక్తార్ అహ్మద్, గురు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు వెడల్పు పనులకు చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ 15వ వార్డు బహదూర్ పల్లి ప్రధాన రోడ్డులో గాయత్రి మిడోస్ వద్ద ఇటీవల ప్రజలు నిత్యం ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతుండడంతో ఆ ప్రాంతాన్ని గురువారం హెచ్ఎండిఏ, మున్సిపల్, ట్రాఫిక్ స్థానిక కౌన్సిలర్ నర్సింగం భరత్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద పరిశీలించారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణమే రోడ్డు వెడల్పు పనులకు చర్యలు తీసుకోవాలని హెచ్.ఎం.డి.ఏ అధికారులకు ఆదేశించారు. డివైడర్, యూటర్న్, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ట్రాఫిక్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. హెచ్.ఎం.డి.ఏ ఎస్ఈ హుస్సేన్, ఈఈ రమేష్ కుమార్, మున్సిపాలిటీ కమిషనర్ కె.సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'సమష్టి కళాకారుల కృషి వల్లే నాటకం రక్తి'



నవతెలంగాణ-కల్చరల్

నాటకం రక్తి కట్టటానికి సమష్టి కళాకారుల కృషి అవసరమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ. రమణ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ నిర్వహణలో యవనిక పేరిట మూడు రోజుల నాటికోత్సవం ఆరంభమైనాయి.ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ మాట్లాడుతూ దీపికా రెడ్డి మంచి నాట్య గురువు, సంగీత నాటక అకాడమీ అధ్యక్షులుగా నాటకాలకు ప్రాధాన్యత ఇవ్వటం ముదా వహమన్నారు. సురభి నాటకాలను ఘంటసాల కళా వేదిక పై ప్రదర్శన ఏర్పాటు చేయాలని యువ నాట కోత్సవాలు నిర్వహించాలని సూచించారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ స్వాగతం పలుకుతూ తెలంగాణ రాష్ట్రంలో కళలకు సాహిత్యంకు ప్రాధాన్యత పెరిగిందని ఇందుకు కారణం ముఖ్యమంత్రి కే.సి.ఆర్‌కు వీటిపట్ల ఉన్న అభిమానయేనని అన్నారు రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మెన్ అనిల్ కూర్మాచలం, సంగీత నాటక అకాడమీ చైర్మెన్ దీపికరెడ్డి పాల్గొన్నారు. సుజాత శ్రీధర్ వ్యాఖ్యానం హృద్యంగా ఉంది. అనంతరం దక్షిణాత్య ఆర్ట్స్ అకాడమీ వారి చే డాక్టర్ కోట్ల హను మంత రావు దర్శకత్వంలో రామప్ప నాటిక,చైతన్య కళా భారతి కరీం నగర్ వారిచే చీకటి పువ్వు నాటిక మంచాల రమేష్ దర్శకత్వంలో ప్రదర్శించారు

అదనపు కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రముఖ కవి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహ్మా రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన అభినవ కవి, పుడమి రత్న అవార్డు గ్రహిత, మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామ్ రెడ్డి గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వాకిటి రామ్ రెడ్డి మాట్లడుతూ విధి, నిర్వహణ ,సాహిత్య రంగం రెండుకండ్లులాగా భావించి సేవలందిస్తున్న ఏనుగు నరసింహ్మా రెడ్డి ధన్యుడని అభినందించారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-శామీర్ పేట

మూడు చింతలపల్లి మండలంలో బీజేపీ లక్ష్మాపూర్ గ్రామ శాఖ బూతు అధ్యక్షులు కామాటి రాజు యాదవ్, కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ ప్రధాన కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు.



జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నాయక్, మండల దళితమోర్చా అధ్య క్షుడు డప్పు రతన్, మండల కోశాధికారి నాగార్జున్ పటేల్, బూత్ ప్రధాన కార్యదర్శి కిరణ్ యాదవ్, భూపాల్,కృష్ణ , కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

హనుమాన్ జయంతి పురస్కరించుకొని గురువారం గాజుల రామారం, కుత్బుల్లా పూర్ జంట సర్కిళ్ల పరిధిలోని జగద్గిరిగుట్ట శ్రీ సాలాసర్ హనుమాన్ మందిర్, రింగ్ బస్తీ, గాజులరామారం శ్రీరామ్ నగర్ కాలనీ, బహదూర్ పల్లి, దూలపల్లి, షాపూర్ నగర్, ఎస్.ఎల్.బి నగర్, కుత్బుల్లాపూర్ చౌరస్తా, గాంధీనగర్, గిరి నగర్లలో హనుమాన్ జయంతి వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో హనువాన్ శోభా యాత్రలు, అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, హనుమాన్ మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లిలో హనుమాన్ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు..



బాలానగర్ : బాలానగర్ డివిజన్ పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బాలానగర్ లోని ఆంజనేయస్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం డివిజన్ పరిధిలోని వివిధ బస్తి, కాలనీలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు కార్పొరేటర్ విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్‌పల్లి, దూలపల్లి తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, డివిజన్ల అధ్యక్షులు, అనుబంధం కమిటీల ప్రతినిధులు, నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని స్థానిక ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ఆంజనేయ స్వామి ఆలయంలో, రాష్ట్ర బీ.జే వై.ఎమ్ కార్యదర్శి, హనుమాన్ ఆలయ కమిటీ మెంబర్ విజిత్ వర్మ ఆధ్వర్యంలో హనుమాన్ జన్మోత్సవ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు గజ్జల యోగానంద్ పాల్గొన్నారు. ఉదయం హనుమాన్ పూజ కార్యక్రమం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం హనుమాన్ విజయ యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 9600 ప్రాంతాలలో హనుమాన్ జన్మోత్సవాన్ని వైభవంగా నిర్వహించారని వెల్లడించారు. ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డి, బూర నరసయ్య గౌడ్, మణిభూషణ్, రామరాజు, కమలాకర్, టప్పు రఘు, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పాలక మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.



సన్‌రైజర్స్ మెరిసేనా?

- సఫారీల రాకతో నూతనోత్సాహం
- లక్నో సూపర్‌జెయింట్స్‌తో పోరు నేడు

నవతెలంగాణ-లక్నో:

ఐపీఎల్ 2021లో పాయింట్ల పట్టికలో చిట్టచివరి స్థానం (8). ఐపీఎల్ 2022లో పది జట్లు పోటీపడగా హైదరాబాద్ మళ్లీ ఎనిమిదో స్థానంలోనే నిలిచింది. ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించలేదు. మెగా ఆటగాళ్ల వేలంలో ఆకర్షణీయ ఆటగాళ్లను కొనుగోలు చేసిన హైదరాబాద్‌పై ఐపీఎల్ 2023లో మంచి అంచనాలు నెలకొన్నాయి. కానీ ఐపీఎల్16 తొలి మ్యాచ్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తేలిపోయింది. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో 72 పరుగుల తేడాతో భారీ పరాజయం మూటగట్టుకుంది. బంతితో పవర్‌ప్లేలో 85/1తో రాయల్స్ చేతిలో చితికిపోయిన సన్‌రైజర్స్.. బ్యాట్‌తో 30/2తో రాయల్స్ బౌలర్ల చేతిలో కంగుతింది. మూడేండ్ల తర్వాత సన్‌రైజర్స్ సొంత గడ్డపై ఆడుతున్న మ్యాచ్ కావటంతో సుమారు 40 వేల మంది అభిమానులు స్టేడియానికి పోటెత్తగా.. పసలేని పోరాటంతో ఆరెంజ్ ఆర్మీ నిరాశకు లోనైంది. కెప్టెన్ సహా కీలక ఆటగాళ్లు తొలి మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవటంతో ఆ ఓటమిని హైదరాబాద్ పెద్దగా సిరీయస్‌గా తీసుకోవటం లేదు. నేడు రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌తో హైదరాబాద్ తలపడనుంది. లక్నోపై మెరుగైన ప్రదర్శనతో గెలుపు బాట పట్టేందుకు ఆరెంజ్ ఆర్మీ ఎదురుచూస్తుంది.

ఆ ముగ్గురు వచ్చారు!

కెప్టెన్ ఎడెన్ మార్కరం, పేసర్ మార్కో జెన్సన్, వికెట్‌కీపర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్‌లు లక్నోతో మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చారు. ఎస్‌ఏటీ20 లీగ్‌లో సన్‌రైజర్స్‌ను చాంపియన్‌గా నిలిపిన మార్కరం.. ఐపీఎల్‌లో తొలిసారి సారథ్య పగ్గాలు అందుకున్నాడు. మార్కరం, జెన్సన్, క్లాసెన్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. మార్కరం రాకతో మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ లైనప్ బలోపేతం కానుంది. క్లాసెన్ తుది జట్టులో నిలిస్తే.. లోయర్ ఆర్డర్‌లో కీలకం అవగలడు. ఇంగ్లాండ్ స్టార్ హ్యారీ బ్రూక్ తొలి మ్యాచ్‌లో తేలిపోయినా.. అతడిని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. భారత ఆటగాళ్లలో రాహుల్ త్రిపాఠి, అభిషేక్ శర్మ, మయాంక్ అగర్వాల్ అంచనాలను అందుకోవాల్సి ఉంది. పేస్ విభాగంలో నటరాజన్ మినహా భువి, ఫరూకీ, ఉమ్రాన్ మాలిక్ నిరాశపరిచారు. మార్కో జెన్సన్ రాకతో పేస్ విభాగానికి మరింత బలం చేకూరనుంది. ఫరూకీ స్థానంలో జెన్సన్ తుది జట్టులోకి రానున్నాడు. స్పిన్నర్ ఆదిల్ రషీద్ తొలి మ్యాచ్‌లో వికెట్లు తీయలేదు. నాణ్యమైన స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ సైతం రాయల్స్‌పై విఫలమయ్యాడు. రషీద్ నేడు తుది జట్టులో నిలిచేది లేనిది అనుమానమే. మార్కరం, బ్రూక్, జెన్సన్‌లతో పాటు మరో విదేశీ ప్లేయర్ కోటా కోసం ఫిలిప్స్, క్లాసెన్, రషీద్ పోటీపడుతున్నారు.

సొంతగడ్డ సానుకూలత! :

లక్నో సూపర్‌జెయింట్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్లో ఓ మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో లక్నో విజయం సాధించింది. ఈ సీజన్లో లక్నో రెండు మ్యాచులు ఆడగా..ఓ గెలుపు, ఓ ఓటమి చవిచూసింది. సొంతగడ్డపై ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించిన లక్నో.. చెపాక్‌లో ధోనీసేన చేతిలో ఓటమిపాలైంది. కెప్టెన్ కెఎల్ రాహుల్ ఫామ్ ఆ జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. పొట్టి ఫార్మాట్‌కు అనుగుణంగా రాహుల్ దూకుడు ఉండటం లేదు. ఓపెనర్ కైల్ మేయర్స్ ధనాధన్ హిట్టింగ్ సూపర్‌జెయింట్స్ శిబిరంలో ఉత్సాహం నింపుతోంది. మేయర్స్ బాదుడుతో బౌలర్లపై లక్నో ఆధిపత్యం చెలాయిస్తోంది. నేడు సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లోనూ మేయర్స్ కీలకం కానున్నాడు. స్పిన్నర్ రవి బిష్ణోయ్, పేసర్ మార్క్‌వుడ్‌లు రెండు మ్యాచుల్లో ఆకట్టుకున్నారు. సన్‌రైజర్స్ బ్యాటర్లకు ఈ ఇద్దరు బంతితో కఠిన సవాల్ విసరనున్నారు.

ఐపీఎల్‌లో నేడు
హైదరాబాద్ X లక్నో
వేదిక : లక్నో, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో



ప్రపంచకప్‌కు కేన్ దూరం?

- ఏఎల్‌సీ గాయానికి గురైన విలియమ్సన్
- త్వరలోనే కివీస్ కెప్టెన్‌కు శస్త్రచికిత్స



క్రైస్ట్‌చర్చ్ : ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్ ముంగిట న్యూజిలాండ్‌కు గట్టి ఎదురుదెబ్బ!. కివీస్ కెప్టెన్, స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ గాయంతో రానున్న మెగా ఈవెంట్‌కు దూరం కానున్నాడు. ఈ మేరకు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వర్గాలు తెలిపాయి. ఐపీఎల్‌లో తొలిసారి గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న కేన్ విలియమ్సన్.. సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే గాయపడ్డాడు. అహ్మదాబాద్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ సిక్సర్‌ను నిలువరించే క్రమంలో కేన్ విలియమ్సన్ అదుపు తప్పాడు. జట్టుకు రెండు పరుగులు ఆదా చేసిన కేన్..ఈ క్రమంలో కుడి కాలు మోకాలి గాయానికి గురయ్యాడు. బాధతో విలవిల్లాడిన కేన్ స్వయంగా లేచి నడవలేకపోయాడు. అతడిని సహాయక సిబ్బంది భుజాలపై తీసుకెళ్లారు. గాయం తీవ్రత దృష్ట్యా టైటాన్స్ రెండో మ్యాచ్‌కు విలియమ్సన్ దూరంగా ఉన్నాడు. తాజాగా కేన్ విలియమ్సన్ మోకాలు ఏఎల్‌సీ గాయానికి గురయ్యాడని వైద్య నివేదికల్లో తేలింది.

మోకాలి లిగమెంట్ గాయానికి కేన్ విలియమ్సన్‌కు శస్త్రచికత్స చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మోకాలు వాపు ఉండటంతో రానున్న మూడు వారాల్లో కివీస్ కెప్టెన్‌కు సర్జరీ చేయనున్నారు. సర్జరీ అనంతరం విశ్రాంతి, అనంతరం పూర్తి ఫిట్‌నెస్ సాధించటం విలియమ్సన్‌కు కీలకం. ఏఎల్‌సీ శస్త్రచికిత్స దృష్ట్యా విలియమ్సన్ 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆడే పరిస్థితులు కనిపించటం లేదు. విలియమ్సన్ గైర్హాజరీలో న్యూజిలాండ్‌కు వికెట్ కీపర్ టామ్ లేథమ్ సారథ్యం వహిస్తున్నాడు. రానున్న పాకిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు సహా వరల్డ్‌కప్‌కు సైతం టామ్ లేథమ్‌కు సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశం కనిపిస్తోంది. 161 వన్డేలు ఆడిన కేన్ విలియమ్సన్ 13 శతకాలు బాదటంతో పాటు 47.83 సగటుతో పరుగులు సాధించాడు. అత్యంత నిలకడగా రాణించే విలియమ్సన్ సేవలను కోల్పోవటం న్యూజిలాండ్‌కు సారథ్య పరంగా, బ్యాటింగ్ విభాగం పరంగా పూడ్చలేని లోటుగా మారనుంది.



సూపర్ శార్దూల్

ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్ ఈలేసింది. 89/5తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న ఆతిథ్య జట్టును తొలుత పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ (68) విధ్వంసక అర్థ సెంచరీ ఇన్నింగ్స్‌తో ఆదుకోగా.. కోల్‌కత 204/7 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. భారీ ఛేదనలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ చేతులెత్తేసింది. మిస్టరీ స్పిన్ త్రయం సునీల్ నరైన్ (2/16), వరుణ్ చక్రవర్తి (4/15), సుయాశ్ శర్మ (3/30) డుప్లెసిస్‌ను మాయ చేశారు. 81 పరుగుల తేడాతో బెంగళూర్‌పై కోల్‌కత ఘన విజయం సాధించింది.

- 29 బంతుల్లో 68 బాదిన ఠాకూర్
- బెంగళూర్‌పై కోల్‌కత ఘన విజయం

నవతెలంగాణ-కోల్‌కత

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై కోల్‌కత నైట్‌రైడర్స్ 81 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. 205 పరుగుల భారీ ఛేదనలో విరాట్ కోహ్లి (21), డుప్లెసిస్ (23) తొలి వికెట్‌కు శుభారంభం అందించినా.. మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు నిలువలేకపోయారు. మైకల్ బ్రాస్‌వెల్ (19), గ్లెన్ మాక్స్‌వెల్ (5), హర్షల్ పటేల్ (0), షాబాజ్ అహ్మద్ (1), దినేశ్ కార్తీక్ (9), అనుజ్ రావత్ (1), కర్ణ్ శర్మ (1) దారుణంగా విఫలమయ్యారు. 61 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన బెంగళూర్ ఓటమి లాంఛనం చేసుకుంది.17.4 ఓవర్లలో 123 పరుగులకే బెంగళూర్ కుప్పకూలింది.కోల్‌కత నైట్‌రైడర్స్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి నాలుగు వికెట్లు పడగొట్టగా.. ఇంపాక్ట్ ప్లేయర్ సుయాశ్ శర్మ మూడు వికెట్లు, సునీల్ నరైన్ రెండు వికెట్లతో సత్తా చాటారు. అంతకముందు, శార్దుల్ ఠాకూర్ (68, 29 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సలు) విధ్వంసక అర్థ సెంచరీ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. రింకూ సింగ్ (46, 33 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సలు) జతగా రెచ్చిపోయిన శార్దుల్ ఠాకూర్.. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు 204/7 పరుగుల భారీ స్కోరు అందించాడు.

ఠాకూర్ విధ్వంసం : ఈడెన్‌గార్డెన్స్‌లో సొంత అభిమానుల నడుమ తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఆరంభం ఏమాత్రం కలిసి రాలేదు. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ (57, 44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సలు) ఓ ఎండ్‌లో ఆకట్టుకున్నాడు. క్రమం తప్పకుండా బౌండరీలు, సిక్సర్లు బాది నైట్‌రైడర్స్‌ను రేసులో నిలిపాడు. కానీ మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు పడటం ఆతిథ్య జట్టును దెబ్బతీసింది. వెంకటేశ్ అయ్యర్ (3), మన్‌దీప్ సింగ్ (0), కెప్టెన్ నితీశ్ రానా (1), సహా బిగ్ హిట్టర్ ఆండ్రీ రసెల్ (0) దారుణంగా విఫలమయ్యారు. ఓపెనర్ గుర్బాజ్ అర్థ సెంచరీ సాధించినా.. 89 పరుగులకే ఐదు వికెట్లు చేజార్చుకున్న నైట్‌రైడర్స్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. ఈ సమయంలో కోల్‌కత స్వల్ప స్కోరుకే పరిమితం అయ్యేలా కనిపించింది. కానీ రింకూ సింగ్ (46) తోడుగా టెయిలెండర్ శార్దుల్ ఠాకూర్ (68) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బెంగళూర్ బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. వరుస ఓవర్లలో ఫోర్లు, సిక్సర్లు సంధించాడు. రింకూ సింగ్ తోడుగా ఆరో వికెట్‌కు ఏకంగా 103 పరుగులు జోడించాడు. ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 20 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన శార్దుల్ ఠాకూర్.. బెంగళూర్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. మరో ఎండ్‌లో రింకూ సింగ్ సైతం సమయోచిత ఇన్నింగ్స్‌తో శార్దుల్ ఠాకూర్‌కు అండగా నిలిచాడు. శార్దుల్, రింకూ మెరుపులతో కోల్‌కత నైట్‌రైడర్స్ 204/7 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.



స్కోరు వివరాలు

కోల్‌కత నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ : 204/7 (శార్దుల్ ఠాకూర్ 68, రెహ్మానుల్లా గుర్బాజ్ 57, రింకూ సింగ్ 46, డెవిడ్ విల్లే 2/16)

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఇన్నింగ్స్ : 123/10 (డుప్లెసిస్ 23, విరాట్ కోహ్లి 21, వరుణ్ చక్రవర్తి 4/15, సుయాశ్ శర్మ 3/30)

వరల్డ్ నం.1 అర్జెంటీనా

- ఫిఫా ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానం కైవసం

జ్యురిచ్ : ప్రపంచ చాంపియన్, ప్రపంచ ఫుట్‌బాల్ అగ్రజట్టు అర్జెంటీనా ఆరేండ్ల సుదీర్ఘ విరామం అనంతరం తిరిగి అగ్రస్థానం కైవసం చేసుకుంది. ఫిఫా తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో బ్రెజిల్‌ను మూడో స్థానానికి నెట్టిన లియోనల్ మెస్సీ సేన.. వరల్డ్ నం.1 జట్టుగా నిలిచింది. 2022 ఫిఫా ప్రపంచకప్ విజేతగా నిలిచిన అర్జెంటీనా.. లియోనల్ మెస్సీ నాయకత్వంలో ఫైనల్లో ఫ్రాన్స్‌పై గెలుపొందిన సంగతి తెలిసిందే. తాజాగా పనామాపై 2-0, కురాసోపై 7-0తో తిరుగులేని విజయాలు సాధించిన అర్జెంటీనా ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఆరేండ్ల విరామం అనంతరం అగ్రస్థానానికి చేరుకుంది. యూరో క్వాలిఫయర్స్‌లో నెదర్లాండ్స్‌పై 4-0, ఐర్లాండ్‌పై 1-0తో గెలుపొందిన ఫ్రాన్స్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. ఫ్రెండ్లీ మ్యాచ్‌లో 1-2తో మొరాకో చేతిలో కంగుతున్న



బ్రెజిల్ మూడో స్థానానికి పడిపోయింది. బెల్జియం, ఇంగ్లాండ్ టాప్-5లో కొనసాగుతున్నాయి. నెదర్లాండ్స్, క్రోయేషియా, ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్ టాప్-10లో నిలిచాయి.

ఎట్టకేలకు.. సినీ పరిశ్రమ స్పందించింది

'ఆర్‌ఆర్‌ఆర్' ఆస్కార్ విజేతలకు ఘన సన్మానం



ఎం.ఎం. కీరవాణి, చంద్రబోస్

నవతెలంగాణ ఎఫెక్ట్

విశ్వవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే అవార్డ్.. ఆస్కార్. ఆస్కార్ చరిత్రలో ఇప్పటివరకు ఏ భారతీయ సినిమాకి ఆస్కార్ దక్కలేదు. కానీ మన తెలుగు సినిమా పాట ఆస్కార్‌ని దక్కించుకుని ఓ సువర్ణాధ్యాయాన్ని క్రియేట్ చేసింది. ఒరిజనల్ సాంగ్ విభాగంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు..'పాటకు ఆస్కార్ పురస్కారం లభించింది. అయితే ఇంతటి సంచలనం క్రియేట్ చేసిన ఈ ఆస్కార్ విజేతలను ఇప్పటి వరకు అటు ఇండస్ట్రీగాని, ఇటు రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే కేంద్రప్రభుత్వం సైతం సముచితంగా గౌరవించలేదు. కేవలం అభినందనల ట్వీట్లతో మమా.. అనిపించారు. ఇదిలా ఉంటే, ఈ ఏడాది మన దేశం నుంచి 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' షార్ట్ ఫిల్మ్‌కి కూడా ఆస్కార్ పురస్కారం దక్కింది. అంతేకాదు ఈ షార్ట్ ఫిల్మ్ దర్శక, నిర్మాతలకు తమ రాష్ట్ర ప్రభుత్వమే కాదు కేంద్ర ప్రభుత్వం సైతం ఘనంగా సత్కరించింది. అంతేకాదు తమిళనాడు ముఖ్యమంత్రి ఈ షార్ట్ ఫిల్మ్ దర్శకురాలికి కోటి రూపాయల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేసి విజేతలకు తాము ఇస్తున్న గౌరవాన్ని సర్వత్రా చాటారు. ఇదే విషయాన్ని ఉటంకిస్తూ నవచిత్రంలో 'మనోళ్ళని పట్టించుకోవట్లే' అని ఓ ఆర్టికల్ ప్రచురితమైంది. ఆ ఆర్టికల్ ఎఫెక్ట్ కాబోలు.. ఎట్టకేలకు పరిశ్రమ ఒక్క అడుగు ముందుకేసి మన ఆస్కార్ విజేతలను సత్కరించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈనెల 9వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో తెలుగు సినీ పరిశ్రమ ఘన సన్మానం చేసి గౌరవించనుంది. ఈ వేడుకలో నటీనటులు, నిర్మాతలు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు హాజరు కానున్నారు అని తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి కె. ఎల్. దామోదర్ ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



నవచిత్రం



గోపీచంద్, డింపుల్ హయాతి

ఐ ఫోన్ సేతుల పట్టి..

గోపీచంద్ కథానాయకుడిగా శ్రీవాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'రామబాణం'. యాక్షన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలోని హీరో క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా గురువారం ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'ఐఫోన్...' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేసి, మ్యూజికల్ జర్నీ ప్రారంభించారు.మిక్కీ జె మేయర్ హై-స్పీడ్ బీట్స్‌తో మాస్ డ్యూయెట్‌ను కంపోజ్ చేశారు. అద్భుతమైన వోకల్స్, సూపర్బ్ డ్యాన్సులు, క్లాసీ విజువల్స్‌తో ఇది మాస్ యుఫోరియాను సృష్టిస్తుంది. మాస్ పాటలు రాయడంలో స్పెషలిస్ట్ అయిన కాసర్ల శ్యామ్ అద్భుతమైన సాహిత్యం అందించారు. తెలంగాణ యాసలో ఈ పాటను రాశారు. రామ్ మిరియాల, మోహన భోగరాజు వోకల్స్‌లో కావాల్సిన ఎనర్జీ ఉంది. గోపీచంద్, డింపుల్ హయాతి గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ మాస్ డ్యూయెట్‌లో చాలా కూల్‌గా కనిపించి, రాకింగ్ కెమిస్ట్రీని పంచుకున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా మే 5న రిలీజ్ చేస్తున్నారు.




నిఖిల్

అక్షరాల.. రూ.40 కోట్లు

'కార్తికేయ2' తర్వాత నిఖిల్ పాన్-ఇండియన్ చిత్రం 'స్పై'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'కార్తికేయ 2'లాగానే 'స్పై' కూడా యూనివర్సల్ అప్పీల్, యూనిక్ పాయింట్‌తో బహు భాషా చిత్రంగా రూపొందుతోంది. ఎడిటర్ గ్యారీ బిహెచ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని చరణ్‌తేజ్ ఉప్పలపాటి సిఇఓగా ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కె రాజశేఖర్ రెడ్డి నిర్మిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా నాన్-థియేట్రికల్ రైట్స్ ఫ్యాన్సీ ధరకు అమ్ముడయ్యాయి. అమెజాన్, స్టార్ నెట్‌వర్క్ కలిసి ఈ చిత్రం పూర్తి నాన్-థియేట్రికల్ హక్కులను రూ.40 కోట్లకు పొందడం విశేషం. ఐశ్వర్యా మీనన్ నాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఆర్యన్ రాజేష్ ఓ ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు.

పవర్‌ఫుల్ హనుమాన్..


ప్రభాస్, కృతి సనన్ జంటగా నటించిన బాలీవుడ్ సినిమా 'ఆదిపురుష్'. ఓంరౌత్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రాన్ని రామాయణ ఇతిహాసం ఆధారంగా రూపొందించారు. ప్రభాస్ రాముడుగా, కృతి సీత పాత్రలో నటించిన ఈ చిత్రంలో హనుమంతుడుగా దేవదత్త నాగే నటించారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా దేవదత్త నాగు హనుమంతుడు గెటప్‌లో ఉన్న లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. అలాగే దీంతో పాటు రిలీజ్ చేసిన ఓ పాట ట్యూన్‌తో పాటు లిరిక్స్ అద్భుతంగా ఉన్నాయి. అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ఉన్న ఈ పాట హనుమంతుడు అంటే బలం, పట్టుదల, విధేయత మూర్తీభవించిన యోధుడు అనే అంశాలను హైలెట్ అయ్యేలా మేకర్స్ శ్రీ భజరంగ్‌బలి పోస్టర్‌ను ఆవిష్కరించారు. టి-సిరీస్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రెట్రోఫిల్స్‌కు చెందిన రాజేష్ నాయర్, యువి క్రియేషన్స్‌కు చెందిన వంశీ, ప్రమోద్‌ల సహకారంతో నిర్మించారు. జూన్ 16న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



దేవదత్త నాగే

రెట్రో స్టైల్‌లో రంగమ్మ.. పాట

బిగ్ బెన్ సినిమాస్ బ్యానర్‌పై వస్తోన్న తాజా చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఇచ్చట అందమైన ఫోటోస్ తీయబడును అనేది ఉపశీర్షిక. చైతన్య రావు, లావణ్య జంటగా నటిస్తున్నారు. ప్రిన్స్ హెన్రీ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి తాజాగా మొదటి లిరికల్ సాంగ్‌ను నటుడు ప్రియదర్శి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. కథా నేపథ్యాన్ని బట్టి 80ల నాటి రెట్రో మ్యూజిక్‌ను గుర్తు చేసేలా కంపోజింగ్, ట్యూన్ ఉన్నాయి. ఎస్పీ బాలుని గుర్తుకు తెచ్చేలా ఆయన తనయుడు చరణ్ అద్భుతంగా ఈ పాటను పాడారు. 'కంటిచూపు నిన్నే దాటి పోనంటోందమ్మా..గుండె కాజేసి జెడ గంటె కట్టావమ్మా.. రంగమ్మా' అంటూ ఈ లిరిక్స్ కాస్త ఫన్నీగా ఉన్నా.. రెట్రో స్టైల్ పిక్చరైజేషన్‌తో చాలా ఎట్రాక్టీవ్‌గా ఉంది.



చైతన్య రావు, లావణ్య

'ఈ 'రంగమ్మ..' పాట నాకు చాలా ఫేవరెట్ సాంగ్.చాలా మంది ఈ పాటతో ప్రేమలో పడిపోయాం' అని హీరో చైతన్య రావు అన్నారు.

'బీట్ పరంగా ఎనభైల్లోని ఆర్డీ బర్మన్, బప్పీలహిరి తరహా రిథమ్ కనిపిస్తుంది. సినిమాలో చాలా ఇంపార్టెంట్ టైమ్‌లో ఈ పాట వస్తుంది' అని నిర్మాత అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ, 'ప్రిన్స్ హెన్రీ ఈ పాటకి ఇచ్చిన సౌండింగ్ కొత్తగా ఉంటుంది. ఈ పాట మాస్‌తో పాటు పబ్బుల్లో కూడా మెగుతుంది. షూటింగ్ పూర్తయ్యింది. త్వరలోనే రిలీజ్ చేస్తాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

భగీరథలో బతుకు భారం

ఏడాదికాలంగా జీతాల్లేని ల్యాబ్ సిబ్బంది

- జీతాలడిగితే ఉన్నతాధికారుల చులకన మాటలు
- ఆందోళనకు దిగలేక.. కుటుంబం గడవక
- ఆకలితో గడుపుతున్న 320 కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలే రూ.7.70కోట్లు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

మిషన్ భగీరథ శాఖలో నీటి నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి ఫలితాలు అందించే ప్రయోగశాలల సిబ్బంది బతుకు భారంగా మారింది. ఏడాది కాలంగా జీతాలు రాక ఆ ఉద్యోగుల కుటుంబాలు అప్పులపాలయ్యాయి. రెన్నెళ్లు, మూన్నెళ్లు.. ఎదురుచూసిన సిబ్బంది ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటూ వచ్చినా.. వేతనాలు రాక ఏడాది గడిచిపోయింది. పది రోజుల కిందట సంబంధిత శాఖ ఉన్నతాధికారులను కలిస్తే 'ఉంటే ఉండండి.. లేదంటే ఉద్యోగం మానేయండి.. ఎక్కువ మాట్లాడితే మేమే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం' అంటూ బెదిరింపులతో చులకన చేసి మాట్లాడారని పలువురు సిబ్బంది 'నవతెలంగాణ'తో వాపోయారు. ఆందోళనకు దిగలేక.. జీతాలు రాక కుటుంబం గడవక వారంతా ఆకలితో అలమటిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 320 మంది సిబ్బందికి సంబంధించి ఏడాది కాలంగా జీతాల బకాయిలే రూ.7.70కోట్లు ఉన్నాయంటే వారి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో ఉన్న నీటి నాణ్యత పరీక్ష కేంద్రాలను తెలంగాణ ప్రభుత్వం 'మిషన్ భగీరథ' శాఖలో విలీనం చేసింది. దీని కింద ఒక రాష్ట్ర స్థాయి ల్యాబ్ సహా 9 పాత జిల్లా కేంద్రాలు, మరో 9 డివిజన్ స్థాయి, 57 సబ్ డివిజన్ స్థాయి కేంద్రాలుగా వీడదీసింది. రాష్ట్ర వ్యాప్తంగా 75 నీటినాణ్యతను పరీక్షించే ల్యాబ్‌లను నిర్వహిస్తోంది. ఇందులో కెమిస్ట్, మైక్రోబయాలజిస్టు, హెల్పర్, ఫీల్డ్ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ కలిపి మొత్తం ఆరుగురు చొప్పున 9 పాత జిల్లా కేంద్ర ల్యాబ్‌ల్లో పని చేస్తున్నారు. మిగిలిన 64 కేంద్రాల్లో ల్యాబ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ మినహా.. నలుగురు సిబ్బంది చొప్పున విధుల్లో ఉన్నారు. వీరి పనిని పర్యవేక్షించేందుకు అదనంగా ప్రతి పాత జిల్లా కేంద్రంగా ఒక కన్సల్టెంట్ ఉద్యోగి ఉన్నారు. మొత్తంగా మిషన్ భగీరథ శాఖలోని నీటి నాణ్యతను పరీక్షించే ల్యాబ్‌ల్లో 319 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారు.



జీతాల బకాయిలే రూ.7.70కోట్లు

రాష్ట్ర వ్యాప్తంగా ల్యాబ్‌ల్లో పని చేస్తున్న 319 మంది సిబ్బందికి ఏడాది కాలంగా జీతాలు రావడం లేదు. వీరికి వారి ఉద్యోగ స్థాయిని బట్టి నెలకు రూ.16వేల నుంచి రూ.22వేల వరకు ఇస్తున్నారు. కన్సల్టెంట్లకు రూ.35వేలు ఇస్తున్నారు. అయితే ఈ మొత్తం సిబ్బందికి నెలకు రూ.64లక్షల 18వేల 500 జీతాలు చెల్లించాల్సి ఉంది. ఏడాదికి (12నెలలకుగాను) రూ.7కోట్ల 70లక్షల 22వేలు జీతాల రూపంలో ప్రభుత్వం బకాయి పడింది.

వేతనం రాకున్నా ఆగని నీటి నమూనా పరీక్షలు

కన్సల్టెంట్లు, కెమిస్ట్‌లు, మైక్రోబయాలజిస్టులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హెల్పర్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లంతా ఔట్‌సోర్సింగ్ కిందనే విధులు నిర్వహిస్తున్నారు. నీటి నమూనాలను సేకరించి, వాటిని పరీక్షించి ఫలితాలను గుర్తిస్తూ ఉంటారు. ఆ నాణ్యతా ప్రమాణాలపై సమాచారాన్ని నిత్యం నమోదు చేస్తుంటారు. గ్రామపంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమూనాలు సేకరించి, నీటి నాణ్యతపై అవగాహన కల్పిస్తుంటారు. ప్రతి నెలా ఒక్కో ల్యాబ్ నుంచి 250 నమూనాల నాణ్యత పరీక్ష సహా 50 సూక్ష్మజీవన నీటి పరీక్ష ఫలితాలు నమోదు చేస్తున్నారు.

ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా 22,500 నమూనాలను నిత్యం పరీక్షించి ఫలితాలు నమోదు చేస్తుంటారు. ఏడాది కాలంగా జీతం రాకపోయినా 2.70లక్షల నమూనాలను పరీక్షించి ఫలితాలు నమోదు చేశారు. వీరు ఏండ్లుగా పని చేస్తున్నా.. ఉద్యోగాలు పర్మినెంట్‌కాక ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే సాగుతున్నారు.



జీతాలడిగితే ఉన్నతాధికారుల చులకన

ప్రతినెలా జీతాలు రాక అప్పులు చేసి కుటుంబాలను వెళ్లదీసుకుంటున్న ఉద్యోగులు పైఅధికారులకు విన్నవించుకుంటూ వస్తున్నారు. ఈ నెల వస్తాయి. వచ్చే నెల వస్తాయి అంటూ దాటవేస్తూ వచ్చిన ఉన్నతాధికారులు తీరా ఇప్పుడు కటువుగా సమాధానాలు ఇస్తున్నారని అంటున్నారు. 'ఇష్టం ఉంటే చేయండి.. లేదంటే మానేయండి' అని, 'ఎక్కువగా మాట్లాడితే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం' అంటూ బెదిరింపులకు దిగుతున్నారని సిబ్బంది వాపోయారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై ఈ నెల 11న చలో హైదరాబాద్ : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు



నవ తెలంగాణ - సిద్దిపేట

'నూతన విద్యా విధానం పేరిట విద్యను వక్రీకరించడమే కాక, బడుగు, బలహీన తరగతులను విద్యకు దూరం చేసేలా చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ ఎల్ మూర్తి, నాగరాజు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాలు మూడు రోజులుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివం గార్డెన్‌లో నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ మీద ఇంకా స్పందించకపోవడం దారుణమన్నారు. దీనిపై ఈ నెల 11న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ (ఇందిరాపార్క్) వద్ద ఒకరోజు విద్యార్థి, నిరుద్యోగ మహా దీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ దీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. విద్యాసంవత్సరం పూర్తయినా నేటికీ ఉర్దూ, మరాఠి మీడియం పుస్తకాలు రాలేదన్నారు. చైతన్య, నారాయణ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా పర్మిషన్ ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రయివేటు విద్యా సంస్థలను కట్టడి చేయాలంటే ఫీజులపై నియంత్రణ కమిటీని వేయాలని కోరారు. ప్రయివేటు విద్యాలయాల్లో 27 శాతం ఉచిత సీట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీతో 30 లక్షల మంది నిరుద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వానికి నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఉంటే.. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలకు వేదికలవుతున్న ఉస్మానియా, కాకతీయ, శాతవాహన లాంటి యూనివర్సిటీలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. యూనివర్సిటీల్లో ఒక పోస్టు కూడా భర్తీ చేసిన దాఖలాలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరిట విద్యను కాషాయీకరణ, వ్యాపారీకరణ చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. మూఢనమ్మకాలను నమ్మే విధంగా అంశాలు పెడదామనడం ఎంతవరకు న్యాయమన్నారు. విద్యారంగ సమస్యలపై రాష్ట్ర కమిటీ సమావేశాల్లో చర్చించామని, సిద్దిపేటలో యూనివర్సిటీ ఏర్పాటు, మెడికల్ కళాశాల సీట్లు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల, కేజీబీవీ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలలు పెంచాలని, బీఎస్సీ నర్సింగ్ హాస్టల్‌కు పక్కా భవనం నిర్మించాలన్నారు. పలు అంశాలపై తీర్మానాలూ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి, సిద్దిపేట జిల్లా అధ్యక్షకార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్, రాష్ట్ర నాయకులు శంకర్, రాజు, మిశ్రిన్ సుల్తానా, కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ కంపెనీల ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి

- బఫర్ జోన్ లేదు.. ప్రజలు అధైర్య పడొద్దు : విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- ఫార్మా భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ



నవతెలంగాణ-కందుకూరు

ఫార్మాసిటీ కంపెనీల ఏర్పాటుతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటయ్యే 19 వేల ఎకరాల్లో అర కిలో మీటర్ మేర బఫర్ జోన్‌కు ప్రతిపాదనలు జరుగుతున్నాయని, రైతులకు ఇబ్బందులు కలగకుండా మాస్టర్ ప్లాన్ ఉంటుందని తెలిపారు.

గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సాయిరెడ్డిగూడలో ఆ గ్రామ సర్పంచ్ బుక్క మహేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డితో కలసి ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు, ప్రతి రైతుకూ ఎకరాకు 121 గజాల చొప్పున ఇల్లు నిర్మించుకోవడానికి స్థలాలు ఇస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రైతులకు ఇండ్ల స్థలాలు ఇచ్చామన్నారు.

గత ప్రభుత్వాలు రైతుల నుంచి భూములు తీసుకున్నా ఇలాంటి మంచి కార్యక్రమం చేయలేదన్నారు. తుక్కుగూడ నుంచి కందుకూరు మండలం వరకు అనేక కంపెనీలు వస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో కందుకూరు మండలానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. రైతులు భూములు, ఇండ్ల స్థలాలు అమ్ముకోవద్దని సూచించారు. ఫార్మా భూ నిర్వాసితులకు ఇంతకుముందే 518 మందికి ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. సాయిరెడ్డిగూడలో 125 మందికి ఇండ్ల స్థలాల సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. రాబోయే కాలంలో కందుకూరు మండలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం మార్కెటింగ్ చైర్మెన్ సురసాని సురేందర్‌రెడ్డి, కందుకూరు సహకార సంఘం చైర్మెన్ దేవరశెట్టి చంద్రశేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఎదుర్కొనే దమ్ము కేసీఆర్‌కే

- దేశంలో రోజురోజుకూ దిగజారుతున్న కాంగ్రెస్ ప్రతిష్ట
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవతెలంగాణ జహీరాబాద్

దేశంలో, రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనే దమ్ము కేసీఆర్‌కే ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనశ్రీ గ్రామంలో మంత్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కర్నాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న ధనసిరివాసులకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఏంటో బాగా తెలుస్తున్నాయన్నారు. సరిహద్దు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చూసి కర్నాటక, మహారాష్ట్ర నుంచి ఎంతోమంది కార్యకర్తలు, రైతులు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు వస్తున్నారని తెలిపారు. రైతుల విద్యుత్ సరఫరాకు మీటర్లు బిగించనందున కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఆపివేసిందని విమర్శించారు. సీఎం కేసీఆర్ చొరవతో రూ.2 వేల కోట్లు ఖర్చుపెట్టి విద్యుత్ కొనుగోలు చేసి ఉచితంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ఇన్ని పథకాలు అమలులో ఉన్నాయా అని ప్రశ్నించారు. షాదీముబారక్, కల్యాణ లక్ష్మి, కంటి వెలుగు, రైతుబంధు లాంటి అనేక పథకాలు విజయవంతంగా కొనసాగిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. బీజేపీ.. కేవలం మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లను చీల్చి పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. పేపర్ లీకేజీ దొంగలు జైల్లో పడ్డ అనంతరం పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటన్నింటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ అభ్యర్థులు మెజార్టీ స్థాయిలో గెలుపొందాలన్నారు. రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద గిరిజన జాతర మూతిమాత జాతరను అధికారికంగా నిర్వహిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు.



ఎంపీ బీబీ పాటిల్ ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషి కారణంగా జహీరాబాద్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉన్న బీఆర్ఎస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మెన్ మంజు శ్రీ రెడ్డి, జడ్పీటీసీ అరుణ మోహన్ రెడ్డి, సర్పంచ్ రాజు, జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల ఆత్మహత్య

భార్య ఉరి.. భర్త సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని.. ఆత్మహత్య

నవతెలంగాణ-జనగామ

భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా, గంట వ్యవధిలోనే భర్త ఎస్ఐ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పదేండ్లుగా జనగామ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కాసర్ల శ్రీనివాస్ (55) దంపతులు పట్టణంలోని వెంకన్నకుంట హాల్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం ఎస్ఐ భార్య స్వరూప (50) బాత్‌రూమ్‌కి వెళ్లి కిటికీకి చున్నీతో ఉరి వేసుకున్నది. కాగా, పాలు పోయడానికి వచ్చిన వ్యక్తి తలుపుకొట్టగా.. నిద్రలేచిన శ్రీనివాస్.. బాత్‌రూమ్‌లోకి వెళ్లగా.. భార్య విగతజీవిగా కనిపించింది. విషయం తెలుసుకున్న వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్ రెడ్డి, సర్కెట్ల సీఐ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్వరూప మృతికి కారణం ఏంటని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వాష్‌రూమ్ కని బెడ్‌రూమ్‌లోకి వెళ్లిన వెళ్లిన శ్రీనివాస్.. మనస్తాపంతో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు.

అక్కడే ఉన్న అధికారులు.. కాల్చుకున్న శబ్దం విని లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే మృతిచెంది ఉన్నారు. మృతులకు ఇద్దరు కుమారులున్నారు. వారు ఉద్యోగాల రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. దంపతుల మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. కాగా, ప్రజలు, అధికారులు, తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి మృతిచెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. అయితే, దంపతుల మధ్య ఆర్థిక, కుటుంబ సంబంధిత విషయాలపై బుధవారం రాత్రి గొడవ జరిగిందని డీసీపీ తెలిపారు. ఎస్ఐ దంపతుల ఆత్మహత్యపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పూర్తి వివరాలు అందిస్తామని తెలిపారు.



శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించిన వరంగల్ సీపీ

భార్య చనిపోయిందన్న మనస్తాపంతో ఆత్మ హత్యకు పాల్పడిన జనగాం ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు అతని భార్య మృతదేహాలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సందర్శించి, మృత దేహాలపై పూల మాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఐ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. దహన సంస్కారాల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.20 వేలు సీపీ అందజేశారు. ఎస్ఐ శ్రీనివాస్ దంపతులకు నివాళులర్పించిన వారిలో డీసీపీ సీతారాం, ట్రైనీ ఐపీఎస్ అంకిత్ కుమార్ శంకర్, జనగామ ఏఎస్పీ దేవేందర్ రెడ్డి, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రణదివే వర్ధంతితో సామాజిక న్యాయ వారోత్సవాలు ప్రారంభం




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు తలపెట్టిన సామాజిక న్యాయ వారోత్సవాలు బిటి రణదివే వర్ధంతి సందర్భంగా ప్రారంభమయ్యాయి. సంగారెడ్డిలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేష్ అధ్యక్షతన సామాజిక సమస్యలు-కార్మికవర్గ కర్తవ్యం అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ సంఘటిత పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్మికవర్గంలో ఐక్యతను సాధిస్తేనే అన్ని రకాల వివక్ష, అణచివేత, దోపిడీని అంతం చేయగలమని అన్నారు. బిటి రణదివే స్ఫూర్తితో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో బిటి రణదివే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ రణదివే కులం, వర్గం, ఆస్తి సంబంధాల పుస్తకాన్ని రాస్తూ కులవ్యవస్థ అసమానతలపై ప్రత్యక్ష దాడిని ప్రారంభించారని గుర్తు చేశారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు మొదలైన వాటితోపాటు కుల వ్యతిరేక పోరాటాలకు మద్దతునివ్వాలంటూ ఆయన వాదించే వారని చెప్పారు. సిద్దిపేట, గజ్వేల్, చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతం, పటాన్‌చెరు, సాండ్విక్ పరిశ్రమ, మహీంద్ర పరిశ్రమ, టీఐడీసీ పరిశ్రమ, పార్లే ఆగ్రో, యూబీ, కిర్‌బీ, తోషిబా, సిబిఎల్ పరిశ్రమలు, మేడ్చల్, జనగామ, ఖమ్మం, నల్లగొండ, మంచిర్యాలలో రణదివే వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈనెల 11న జ్యోతిబాఫూలే, 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతులను కూడా నిర్వహించాలని, ఈనెల 13న రాష్ట్రవ్యాప్తంగా 10కె రన్, వాక్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు.

సలేశ్వరం జాతరలో విషాదం

- దర్శనానికి వచ్చిన వారిలో ఇద్దరి మృతి
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు..



నవ తెలంగాణ - అచ్చంపేట రూరల్

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నల్లమల అడవుల్లో కొనసాగుతున్న సలేశ్వరం జాతరలో విషాద ఘటన జరిగింది. రెండ్రోజుల నుంచి జరుగుతున్న ఈ జాతరకు రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు. గంటల తరబడి లింగమయ్య దర్శనం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు తగినట్టు ఏర్పాట్లు లేకపోవడంతో ఊపిరాడక.. సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండో రోజు రద్దీ మరింత పెరిగింది. ఈ క్రమంలో వనపర్తి జిల్లా ప్రాంతానికి చెందిన చంద్రయ్యతో పాటు మరొకరు ఊపిరి ఆడక మృతిచెందాడు. మృతదేహాన్ని అతి కష్టం మీద కాడి పట్టుకుని పోలీసులు, అడవిశాఖ అధికారులు గురువారం ఉదయం 10 గంటల వరకు రాంపూర్‌పెంట వద్దకు చేర్చారు. అక్కడ నుంచి 108 అంబులెన్స్ ద్వారా అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మరొకరు కూడా తీవ్ర అస్వస్థతకు గురైనట్టు తెలిసింది.

అందరినీ ఒకటి చేసిన స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు

- మానవత్వాన్ని మరుస్తున్న యువత..
- చారిత్రక ఓరుగల్లు నగరానికి రావడం సంతోషంగా ఉంది : నిట్ వరంగల్ స్ప్రింగ్ స్ప్రీ వేడుకను ప్రారంభించిన పవన్ కళ్యాణ్

నవతెలంగాణ-కాజీపేట

నిట్ వరంగల్‌లో జరిగిన స్ప్రింగ్ స్ప్రీ -2023 వేడుకలు కులమతాలకతీతంగా విద్యార్థులందరినీ ఒక్కటి చేశాయని, చారిత్రక ఓరుగల్లు నగరానికి రావడం సంతోషంగా ఉందని జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ సినీ నటులు పవన్ కళ్యాణ్ అన్నారు. వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యాలయం (నిట్)లో ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్న స్ప్రింగ్ స్ప్రీ-2023 వేడుకలకు దేశంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పవన్ కళ్యాణ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏకశిలా నగరం, వేయిస్తంభాల గుడి, గొలుసు కట్టు చెరువులు, రాణి రుద్రమదేవి పాలించిన ఓరుగల్లు నగరానికి రావడం సంతోషంగా ఉందన్నారు. బమ్మెర పోతన, దాశరథి, కాళోజీలను గుర్తు చేశారు. విద్యార్థులు ఎప్పుడూ నేర్చుకోవడం ఆపొద్దని, నేర్చుకోవడంతో నూతన ఆలోచనలు వస్తాయని, వాటికోసం ఎప్పుడూ నిత్య విద్యార్థిగానే ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఇటీవల నిట్ వరంగల్ విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ సాధించడం అభినందనీయమన్నారు. చేసే పనిలో మొదట ఫెయిలైనా తిరిగి ప్రయత్నిస్తే భవిష్యత్తులో విజయం సాధిస్తారని తెలిపారు. కలలుకని సాకారం చేసుకుని దేశ సేవ చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని యువతకు పిలుపునిచ్చారు. తాను రాజకీయాల్లోకి రాకముందు



అనేక సేవా కార్యక్రమాలు చేశానని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు చేయూతను అందించడమే లక్ష్యంగా ముందుకు రావడం జరిగిందన్నారు. ప్రస్తుతం యువత ప్రజలు మానవత్వాన్ని మరుస్తున్నారని మానవత్వ విలువలు కోల్పోవద్దన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని లక్ష్యాన్ని ఎంచుకొని వాటి సాధన దిశగా ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణ రావు మాట్లాడుతూ.. స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ ఏడాది 50 పైగా ఈవెంట్లు ఈ వేడుకల్లో జరుగుతాయని తెలిపారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడానికి 1978 నుంచి ఈ వేడుకలు ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. నిట్ వరంగల్‌లో 6,892 మంది విద్యార్థులు చదువుతున్నట్టు. ప్రతి విద్యార్థి వేడుకలో భాగస్వాములు అవుతున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీన్, స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరోలాల్, స్టూడెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.1971కు తగ్గిన మొక్కజొన్న ధర

- నర్సంపేట గ్రేయిన్ మార్కెట్ గేట్ మూసి రైతుల ఆందోళన



నవతెలంగాణ-నర్సంపేట

నర్సంపేట వ్యవసాయ గ్రేయిన్ మార్కెట్‌లో మొక్కజొన్నపై వ్యాపారులు ఒకే సారి క్వింటాపై రూ.1971 ధరకు తగ్గించి పాటపాడి కొనుగోలు చేస్తుండటంపై రైతులు ఆగ్రహించారు. గురువారం రైతులు మార్కెట్ ప్రధాన ద్వారం గేటు వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన మొక్కజొన్నలపై ట్రేడర్లు మద్దతు ధర రూ.1965పై వేలం పాట పాడారన్నారు. తిమ్మంపేట, లక్నెపెల్లి, రామవరం తదితర గ్రామాలకు చెందిన రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిన్నటి దాకా రూ.2023 పలికిన ధర ఏకంగా రూ.58లు తగ్గించి కొనుగోలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. వడగండ్ల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, కొద్దోగొప్పో చేతికందిన దిగుబడిని మార్కెట్‌కు తీసుకువస్తే వ్యాపారులు.. మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. కాగా మద్దతు ధర రూ.1965 ఉండగా గురువారం అత్యధికంగా రూ.1971 ధర, గరిష్టంగా రూ.1980 పలికిందని మార్కెట్ అధికారులు తెలిపారు.

బిజినెస్

బ్యాంకింగ్ వ్యవస్థ మరింత గందరగోళం

- రఘురాం రాజన్ వెల్లడి



వాషింగ్టన్ : బ్యాంకింగ్ వ్యవస్థలో మరింత గందరగోళం నెలకొనే అవకాశాలున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. ఇటీవల సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సూస్సె దివాళా నేపథ్యంలో రాజన్ తాజాగా హెచ్చరించారు. 2009 నాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని ఆయన ముందుగానే అంచ నా వేశారు. తాజాగా గ్లాస్గోలో రాజన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నేను మంచే జరగాలని కోరుకుంటున్నా. కానీ.. కొన్ని అనుకోని సవాళ్లు ఎదురు కావొచ్చు. సులభ నగదు, దీర్ఘకాలం అధిక లభ్యత వల్ల కొన్ని పరిణామాలు కఠినంగా మారొచ్చు. క్రెడిట్ సుస్సెలోని సమస్యలు ఆర్థిక వ్యవస్థలో అంతర్లీన సమస్యలను సూచిస్తున్నాయి." అని పేర్కొ న్నారు. ప్రస్తుతం చికాగో యూనివర్శిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న రాజన్ 2013 నుండి 2016 వరకు ఆర్‌బిఐ గవర్నర్‌గా పని చేశారు.

బిఎఐ అధ్యక్షునిగా ఎస్ నరసింహారెడ్డి



హైదరాబాద్: బిల్డర్స్ అసోసియే షన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) అధ్యక్షుని గా స్వప్న ప్రాజెక్ట్స్ సిఎండి ఎస్ నర సింహారెడ్డి నియమితులయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన బాధ్యత లను స్వీకరించినట్లు బిఎఐ ఓ ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ లోని స్వప్న ప్రాజెక్ట్స్ ప్రయివేటు లిమిటెడ్ దేశ వ్యాప్తంగా మేజర్, మైనర్ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఉండటంతో పాటుగా 95 మిలియన్ డాలర్ల పనులను నిర్వహిస్తోంది. నరసింహారెడ్డి ఈ బాధ్యతలను ఆర్ రాధాకృష్ణన్ నుంచి స్వీకరించారు.

ద్వితీయ శ్రేణీ నగరాలకు విస్తరిస్తాం

- మెలోరా సిఇఒ సరోజా యెర్రమిల్లి

హైదరాబాద్ : తేలికపాటి పసిడి ఆభరణాలను విక్రయించే మెలోరా తమ స్టోర్లను ద్వితీయ శ్రేణీ నగరాలకు విస్తరిస్తామని వెల్లడిం చింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నూతన స్టోర్‌ను గురువారం ఆ సంస్థ ఫౌండర్, సిఇఒ సరోజా యెర్రమిల్లి లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సరోజా మీడియాతో మాట్లాడుతూ.. ఇది తెలంగాణలో తమకు తొలి అవుట్‌లెట్ అని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 24 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఉన్నాయన్నారు. వచ్చే ఐదేండ్లలో ఫ్రాంచైజీ పద్ధతిలో 500 స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాల్లో స్టోర్లను అందుబాటులోకి తేనున్నామన్నారు. హైదరాబాద్‌లో ఐదు స్టోర్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.700 కోట్ల టర్నోవర్ సాధించామ న్నారు. గడిచిన నాలుగేండ్లలో సగటున 170 శాతం వృద్ధిని నమోదు చేశామన్నారు. బెంగళూర్‌లో తమకు తయారీ కేంద్రం ఉందన్నారు.

ఎపిజిబితో బజాజ్ అలయన్జ్ జట్టు

హైదరాబాద్ : ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ అయిన ఆంధ్రప్రదేశ్ ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఎపిజిబి)తో ప్రయివేటు రంగంలోని బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ప్రకటిం చింది. ఈ ఒప్పందంలో భాగంగా బజాజ్ అలయన్జ్ తన బీమా ఉత్పత్తులను ఎపిజిబి ఖాతాదారులకు అందించనుంది. బీమా పథ కాలు, ఆరోగ్యం, గృహ, మోటారు, ట్రావెల్, లాంగ్ టర్మ్ డ్వెల్లింగ్ ఇన్సూరెన్స్, పర్సనల్ యాక్సిడెంట్ కవర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి బ్యాంకు యొక్క ఖాతాదారులను ఆర్థిక పరంగా సంరక్షించనున్నట్లు పేర్కొంది.

ఖర్చులకు 63 శాతం మంది వెనుకడుగు

న్యూఢిల్లీ : జీవన వ్యయాలు పెరిగిపోవడంతో ప్రజలు ఖర్చులకు బెంబేలెత్తుతున్నారు. తమ వ్యక్తిగత ఫైనాన్స్ పరిస్థితులపై 74 శాతం మంది భారతీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పిడబ్ల్యుసి గ్లోబల్ కన్స్యూమర్ ఇన్‌సైట్ పల్స్ సర్వేలో వెల్లడయ్యింది. ఇది అంతర్జాతీయ సగటు 50 శాతం కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. నిత్యవస రేతర వ్యయాలను తగ్గించుకుంటున్నామని 63 శాతం భారతీయులు పేర్కొన్నారు. దేశంలోని 25 ప్రాంతాల్లోని 9,180 మంది అభిప్రాయా లను సేకరించి.. ఈ రిపోర్టును రూపొందించినట్లు పిడబ్ల్యుసి గ్లోబల్ పేర్కొంది. ఇందులో కీలక మెట్రో నగరాలతో పాటు హైదరాబాద్, విశాఖపట్నంకు చెందిన వారూ ఉన్నారు. దేశంలో పెరుగుతున్న ధరలు పెద్ద సమస్యగా నెలకొన్నాయని 50 శాతం మంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ కొనుగోళ్ల డాటా ప్రైవేసీపై 65 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు.

ఐకెఎఫ్ ఫైనాన్స్‌కు రూ.250 కోట్ల నిధులు

హైదరాబాద్ : దక్షిణాదికి చెందిన ఐకెఎఫ్ ఫైనాన్స్ రూ.250 కోట్ల నిధులు సమీకరించినట్లు ప్రకటించింది. అక్సియన్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫండ్ నేతృత్వంలో ఫండింగ్ రౌండ్‌లో ఈ మొత్తాన్ని సేకరించినట్లు తెలిపింది. నిధుల తోడ్పాటులో మార్పు హెచ్‌ఎన్‌ఐ, కుటుంబ కార్యాలయాలు మద్దతును అందించాయని పేర్కొంది. ఈ మూలధనం ఎంచుకున్న భౌగోళిక ప్రాంతాలలో మా పంపిణీ నెట్‌వర్క్ ను మరింత లోతుగా ఇంకా విస్తరించడం ద్వారా కంపెనీ వృద్ధి ఆశయా లకు మద్దతు ఇస్తుందని ఐకెఎఫ్ ఫైనాన్స్ ఎండి వసుమతి కోగంటి పేర్కొన్నారు.

రూ.50 కోట్లు సమీకరించిన డోజీ

బెంగళూర : దేశంలోనే తొలి కాంటాక్ట్‌లెస్ రిమోట్ పేషంట్ మానిటరింగ్ (ఆర్‌పిఎం), ఎఐ ఆధారిత ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ (ఇడబ్ల్యుఎస్) సంస్థ అయినా డోజీ తాజాగా రూ.50 కోట్ల నిధులు సమీకరించినట్లు తెలిపింది. తమ సిరీస్ ఎ2 ఫండింగ్‌లో పొందినట్లు పేర్కొంది. తమ ప్రస్తుత మదుపర్లు ప్రైమ్ వెంచర్ పార్టనర్స్, 3ఒన్4 క్యాపిటల్, యువర్‌నెస్ట్ విసి సహా కొత్తగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), జెఅండ్ఎ పార్టనర్స్ ఫ్యామిలీ ఆఫీస్, దినేష్ మోడీ వెంచర్స్ నిధులు అందించిన వాటిలో ఉన్నాయని తెలిపింది.

టాటా ప్లేలో తెలుగు క్లాసిక్స్ వేదిక

హైదరాబాద్ : డిటిహెచ్ సేవల సంస్థ టాటా ప్లేలో కొత్తగా తెలుగు క్లాసిక్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ తెలిపింది. దీంతో క్లాసిక్ 50ల నుంచి 90ల కాలం నాటి తెలుగు సినిమాలతో పాటు ప్రత్యేకంగా ఎంపిక చేసిన టివి షోలు అందించే ప్రత్యేక వేదిక అని తెలిపింది. 1950-1990 నాటి ప్రజాధారణ సినిమాలను ఇందులో అందిస్తున్నట్లు పేర్కొంది. రోజుకు కేవలం రూ.1.5తోనే తెలుగు క్లాసిక్స్‌ను వీక్షించవచ్చని పేర్కొంది.

డీఎస్సీ-98 అభ్యర్థుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లండి

- రమణాచారికి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎస్సీ-98 అర్హత సాధించిన అభ్యర్థులకు ఉద్యోగాల హామీ గురించి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్లాలని ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారికి డీఎస్సీ సాధన సమితి అధ్యక్షులు కె శ్రీనివాస్ నేతృత్వంలో గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏపీలో 4,534 మంది డీఎస్సీ-98 అర్హత పొందిన అభ్యర్థులకు ఎంటీఎస్ పద్ధతిలో ఉద్యోగాలిచ్చిందని గుర్తు చేశారు. మానవతా దృక్పథంతో తెలంగాణలోని డీఎస్సీ-98 అభ్యర్థులందరికీ ఉద్యోగాలిస్తామంటూ కేసీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీని అమలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

చెరుకు టన్నుకు రూ.5 వేలు చెల్లించాలి

మూసివేసిన షుగర్ మిల్లులను తెరవాలి

- బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి
- ప్రభుత్వ, సహకార షుగర్ మిల్లుల ప్రయివేటీకరణ ఆపాలి
- జంతర్ మంతర్ వద్ద ఏఐఎస్‌సీఎఫ్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన
- రంగరాజన్ కమిటీ రిపోర్టుకు వ్యతిరేకం : విజ్జూకృష్ణన్





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

చెరుకుకు టన్నుకు రూ.5 వేలు (క్వింటాల్‌కు రూ.500) ధర చెల్లించాలని అఖిల భారత చెరుకు రైతుల సమాఖ్య (ఏఐఎస్‌సీఎఫ్‌ఎఫ్) డిమాండ్ చేసింది. గురువారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఆరు డిమాండ్ల సాధన కోసం ఏఐఎస్‌సీఎఫ్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో చెరుకు పండించే పది రాష్ట్రాల నుంచి రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌సీఎఫ్‌ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. రవీంద్రన్, ఎన్‌కె శుక్లా మాట్లా డుతూ చెరుకుకు 9.5 శాతం రికవరీతో టన్నుకు రూ.5 వేలు చెల్లించాలనీ, సహకార, ప్రభుత్వ రంగ షుగర్ మిల్లుల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే మూసివేసిన సహకార, ప్రభుత్వ రంగ చక్కెర కర్మాగారాలను తెరవడానికి, వాటి నిర్వహణకు నేషనల్ కో ఆపరేటివ్ డెవల ప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి వడ్డీ లేని రుణాలివ్వాలని కోరారు. 40 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన సహకార, ప్రభు త్వ రంగ మిల్లులను పునరుద్ధరించి ఆధునీకరించాలన్నారు. దీని కోసం నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి నిధులు విడుదల చేయాలని కోరారు. 2025 నాటికి ఇథనాల్ ఉత్పత్తిని పెంచే ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందనీ, దేశవ్యాప్తంగా ఉన్న సహకార చక్కెర కర్మా గారాల్లో ఇథనాల్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1966 షుగర్ కంట్రోల్ ఆదేశాల ఆధా రంగా సర ఫరా చేసిన చెరుకుకు 14 రోజుల్లోగా సొమ్మును చెల్లించి, బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రంగరాజన్ కమిటీ రిపోర్టుకు వ్యతిరేకం : విజ్జూ కృష్ణన్

రంగరాజన్ కమిటీ రిపోర్టును తాము వ్యతిరేకిస్తు న్నామని, ఆ రిపోర్టు కేవలం కార్పొరేట్లకే లాభాలు చేకూర్చే విధంగా ఉన్నదని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ అన్నారు. చెరుకు రైతులకు రూ.23 వేల కోట్ల బకాయిలు న్నాయనీ, వాటిని రైతులకు ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. చెరుకు రైతుల సమస్యలు చెప్పుకుందామని కేంద్ర వ్యవ సాయ శాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరితే, బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం ఉన్నదనీ, తాను అపాయింట్ మెంట్ ఇవ్వలేనని కేంద్ర మంత్రి అనడం దారుణమన్నారు. కేంద్ర మంత్రులు రైతుల హితం కోరుకోవడం లేదనీ, కార్పొ రేట్ల లాభాలే లక్ష్యంగా పని చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ, ఏపీలో టయోటా వంటి బహుళ జాతి కంపెనీలను తీసుకొచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని, ఇతర దేశాల్లోంచి షుగర్‌ను దిగుమతి చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అందుకే షుగర్‌పై దిగుమతి సుంకం తగ్గిస్తున్నారని అన్నారు. అంతేకాక దేశంలోని షుగర్ మిల్లులను మూసివేసి, రైతులకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బల్వాన్ సింగ్ (హర్యానా), ప్రభురాజ్ ఎన్.రావు (బీహార్), ఎల్.మారన్ (తమిళనాడు), మారారిల్లా ఠాకూర్ (మధ్యప్రదేశ్), ఉమేశ్ దేశ్‌ముఖ్ (మహారాష్ట్ర), పుష్పేంద్ర త్యాగి (ఉత్తరప్రదేశ్), ఏఐకేఎస్ నేతలు హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్, బాదల్ సరోజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆరు షుగర్ ఫ్యాక్టరీలు మూత : బి.రాంబాబు

తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఆరు షుగర్ ఫ్యాక్టరీలు మూతబడ్డాయని, ప్రస్తుతం ఐదు మాత్రమే పని చేస్తున్నాయని చెరుకు రైతుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. రాంబాబు తెలిపారు. తెలంగాణలో 1.25 లక్షల ఎకరాల్లో చెరుకు పంట సాగు జరిగేదనీ, ఇప్పుడు కేవలం 45 వేల ఎకరాలకు పంట సాగు పడిపోయిందని పేర్కొన్నారు. ఈ షుగర్ ఫ్యాక్టరీల పరిధిలో సాగు విస్తీర్ణం కూడా రోజు రోజుకు తగ్గిపోతుందని అన్నారు. గతంలో 8.5 రికవరీ బేస్ మీద మద్దతు ధర నిర్ణయించే వారని, తెలంగాణలో 9 నుంచి 10.5 వరకు రికవరీ బేస్ వచ్చేదనీ, ఫలితంగా మద్దతు ధర కంటే అదనంగా టన్నుకు రూ.200 నుంచి రూ.300 వచ్చేందని తెలిపారు. కానీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం 9.5, 10.5కు రికవరీ బేస్ పెంచిందనీ, దానివల్ల రైతులకు గిట్టుబాటు ధర కూడా రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలు కుదించడం వల్ల రైతులపై అదనపు భారం పడుతోందని అన్నారు. చెరుకు రైతులకు క్రాప్ ఇన్సూరెన్సు లేదనీ, పెద్ద ఎత్తున నష్టపోతున్నారని పేర్కొన్నారు. చెరుకు కోత, రవాణా చార్జీలు విపరీతంగా పెరిగాయని అన్నారు. చెరుకు కోతకు టన్నుకు రూ.800 నుంచి రూ.1200 వరకు అవుతుందని, దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు టన్నుకు రూ.300 నుంచి రూ.400 అవుతున్నాయని తెలిపారు. ఫ్యాక్టరీలు టన్నుకు రూ.3 వేల నుంచి రూ.3,100 వరకు ఇస్తున్నాయని, అందులో సగం కోత, రవాణా ఛార్జీలకే అవుతుందని పేర్కొన్నారు. కనుక కోత, రవాణా ఛార్జీలు కూడా ఫ్యాక్టరీలే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెరకు రైతుల సంఘం రాష్ట్ర నేతలు జి. ఉమ, మాదినేని రమేష్ బాబు, రాయల వెంకటేశ్వరావు, తన్నేరు కృష్ణార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన కృషి వల్లే ఆరోగ్య తెలంగాణ : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ప్రజారోగ్య పరిరక్షణ, వైద్యారోగ్యరంగాభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పటిష్టమైన చర్యలతో తెలంగాణ రాష్ట్రం 'ఆరోగ్య తెలంగాణ' గా అవతరించిందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని సీఎం ఆకాంక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే కరువైన ఉమ్మడి పాలన నాటి గడ్డు పరిస్థితుల నుంచి నేడు తెలంగాణలో జిల్లాకో వైద్య విద్యా పారా మెడికల్, నర్సింగ్ కాలేజీలను స్థాపించుకునే దశకు చేరుకున్నామన్నారు. మెడికల్ కాలేజీల సీట్లు భారీగా పెంపు, ప్రభుత్వ దవాఖానాలు, మెడికల్, నర్సింగ్ కాలేజీల్లో అవసరాలకు అనుగుణంగా సిబ్బంది నియామకం చేపట్టడం ద్వారా వైద్యం సామాన్యుడికి చేరువయిందని తెలిపారు. హైదరాబాద్ సహా వరంగల్ లాంటి ముఖ్యపట్టణాల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పటళ్ల(టిమ్స్) నిర్మాణం తో ప్రభుత్వ వైద్యసేవల్లో కార్పొరేట్ వైద్యం అందబోతున్నదని వివరించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలోనూ అదనంగా పడకలు 2,500 పెంచామని వివరించారు. వరంగల్‌లోనూ అన్ని వైద్య సదుపాయాలు ఒకే చోట లభ్యమయ్యే విధంగా 'మెడికల్ హబ్' గా తీర్చిదిద్దుతున్నట్టు సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన అన్ని ఆరోగ్య సూచికల్లో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయి కంటే మెరుగ్గా ఉండడం స్వరాష్ట్రంగా తెలంగాణ సాధించిన ఘనతను చాటుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఆజాదీ కా అమత్ మహెూత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన హెల్త్ ఫిట్‌నెస్ క్యాంపెయిన్‌లో మూడు కేటగిరీల్లో అవార్డులు ప్రకటించగా, తెలంగాణ రాష్ట్రం మూడింటిలోనూ అవార్డులు సాధించిందని తెలిపారు. నీటి ఆయోగ్ విడుదల చేసిన నాలుగో ఆరోగ్య సూచీల్లో మూడో స్థానాన్ని సాధించిన విషయాన్ని సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విస్తృత ఏర్పాట్లు

- అధికారులను ఆదేశించిన సీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ఇదే అంశంపై ఆమె సీనియర్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లు ఘనంగా ఉండాలన్నారు. ప్రధాన వేదిక వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని రోడ్డు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, ఆవరణ వద్ద సుందరీకరణ, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. కార్యక్రమానికి లక్ష మందికి పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆ శాఖ అధికారులను కోరారు. అగ్నిమాపక శాఖ సంబంధిత ఏర్పాట్లు చూసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని, అత్యవసర వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. పార్కింగ్, ప్రాంగణం వద్ద ఇతర ఏర్పాట్లను, పటిష్టం చేయడానికి శుక్రవారం సంయుక్తంగా సందర్శించాలని, తగిన ఏర్పాట్లు చేయడానికి ఆర్అండ్‌బీ, పోలీస్, ఆరోగ్య సాంఘిక సంక్షేమ శాఖ, హైదరాబాద్ కలెక్టర్, ఇతర అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

బండి రిమాండ్‌పై స్టేకు హైకోర్టు నో

నవతెలంగాణ-హైదరాబాద్



పదో తరగతి పేపర్ లీక్ చేశారనే అభియోగాలను ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌ను హన్మకొండ కోర్టు రిమాండ్‌కు పంపుతూ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని బండి చేసిన వినతిని తోసిపుచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని కమలాపూర్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఎం. శివప్రసాద్, పోలీసులకు నోటీసులు జారీ చేసింది. హెూం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ ఇతర ప్రతివాదులు కూడా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈనెల పదోతేదీ సోమవారానికి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను అమలు చేయకుండా బండిని అరెస్టు చేశారు. 41ఎ నోటీసు ఇవ్వలేదు. నేరుగా అరెస్టు చేశారు. రాత్రి 12 గంటలకు అరెస్టు చేసి 300 కిలోమీటర్లు తిప్పారు. కరీంనగర్ పీఎస్‌లోని కేసులో అనేక చోట్లకు తిప్పారు.బొమ్మలరామారం స్టేషన్‌కు తీసుకువెళ్లారు. పాలకుర్తి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అక్కడి నుంచి హన్మకొండ కోర్టులో హాజరుపర్చారు. పీఎం మోడీ 8న వస్తున్న కారణంగానే బండిపై అక్రమ కేసు బనాయించి అరెస్టు చేశారు. లోక్‌సభ సమావేశాలు జరుగుతున్నందున వాటికి ఎంపీగా బండి హాజరుకావాలి. కాబట్టి రిమాండ్ రిపోర్టును రద్దు చేయాలి.. అని బండి తరపున సీనియర్ అడ్వొకేట్ ఎన్.రామచంద్రరావు వాదించారు. ఈ వాదనలను పోలీసుల తరపున వాదించిన అడ్వొకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ వ్యతిరేకించారు. బండి సెల్‌ఫోన్ నుంచి పదో తరగతి పేపర్ పలువురికి చేరింది. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతినేలా చేశారు. కుట్రకు పాల్పడ్డారు. నిందితులతో సంబంధాలు ఉన్నాయి. 'బండి సెల్‌ఫోన్ దొరికితే కీలక విషయాలు బయటకు వస్తాయి. సెల్‌ఫోన్ ఇవ్వలేదు. దర్యాప్తు ఇంకా జరగాలి. కాబట్టి రిమాండ్ రిపోర్టును రద్దు చేయాలన్న పిటిషన్‌ను డిస్మిస్ చేయండి'.. అని వాదించారు. వాదనల తర్వాత కోర్టు విచారణను 10కి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, బండి సంజయ్‌ని కోర్టులో హాజరుపరిచేలా ఉత్తర్వులు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ కార్తీక్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

వారంలోగా టెండర్లన్నీ పూర్తి కావాలి

- అన్ని పనులు గ్రౌండింగ్ కావాలి: మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వారం రోజుల్లోగా టెండర్లు పూర్తి కావాలి. అన్ని పనులను గ్రౌండింగ్ చేయాలి. కాంట్రాక్టర్లు రావడం లేదనే కారణాలు చెప్పొద్దు. అధికారుల్లో అలసత్వాన్ని సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవు అంటూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ గ్రామీణ రోడ్ల నిర్వహణ పనులపై సంబంధిత అధికారులతో హైదరాబాద్‌లో మంత్రి గురువారం సమీక్షించారు. రాష్ట్రంలో మొత్తం రూ.2,687 కోట్ల అంచనా వ్యయంతో 6,254 కి. మీ. మేర 3,010 బిటి రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో టెండర్లు పూర్తికాని, గ్రౌండ్ కాని పనులను రద్దు చేయాలని సూచించారు.

రద్దయిన పనులను వేరే నియోజకవర్గాలకు బదిలీ చేస్తామని హెచ్చరించారు. ఇందులో పలు పనులు ఇప్పటి వరకు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్నింటికి ఇంకా టెండర్లు పిలవాల్సి ఉందని తెలిపారు. వీటిని తొందరగా సెటిల్ చేయాలని కోరారు. వారం రోజుల్లోగా అన్ని పనులకు టెండర్లు పూర్తి కావాలనీ, అవన్ని గ్రౌండింగ్ అయి ఉండాలని సూచించారు.

ఆక్స్‌ఫామ్ ఇండియాపై సీబీఐ దర్యాప్తు

- కేంద్ర హోంశాఖ ప్రతిపాదన

న్యూఢిల్లీ : సమాజంలో వెనుకబడిన వర్గాల ఆహారం, ఆశ్రయం, విద్య వంటి అంశాలపై పనిచేసే అతిపెద్ద ఎన్‌జిఓల్లో ఒకటైన ఆక్స్‌ఫామ్ ఇండియా ఎఫ్‌సిఆర్‌ఎ నిబంధనలను ఉల్లంఘించిందన్న ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలంటూ కేంద్ర హోంశాఖ గురువారం సిఫార్సు చేసింది. విదేశీ నిధులను అందుకునేందుకు వీలు కల్పించే ఎఫ్‌సిఆర్‌ఎ రిజిస్ట్రేషన్‌ను 2021లో ఆక్స్‌ఫామ్ ఇండియా పునరుద్ధరించుకోలేదని పేర్కొంది. సామాజిక కార్యకలాపాలు చేపట్టేందుకు ఎఫ్‌సిఆర్‌ఎ కింద ఎన్‌జిఓ రిజిస్టర్ అయిందని, ఆ రిజిస్ట్రేషన్ 2021 డిసెంబరు 31వరకు చెల్లుబాటైందని గురువారం సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. విదేశీ విరాళాల (క్రమబద్దీకరణ) సవరణ చట్టం, 2020 అమల్లోకి వచ్చిన తర్వాత కూడా వివిధ ఇతర సంస్థలకు విదేశీ నిధులను బదిలీ చేయడాన్ని ఆక్స్‌ఫామ్ కొనసాగించిందని ఆయన చెప్పారు.

నేటి యువతకు నిఖత్ జరీన్ జీవితం స్ఫూర్తిదాయకం

- సీఎస్ శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేటి యువతకు నిఖత్ జరీన్ జీవితం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 50 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకొని రికార్డ్ సృష్టించిన నిఖత్ జరీన్‌ను గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ అభినందిం చారు. బీఆర్‌కే భవన్ లో సీఎస్‌ను నిఖత్ జరీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచ చాంపియన్ షిప్‌ను సాధించి భారత దేశంతో పాటు తెలంగాణా ఖ్యాతిని ప్రపంచ పటంలో నిలిపిన నిఖత్ జరీన్‌ను సీఎస్. శాంతి కుమారి అభినందించారు. ఈ కార్య క్రమంలో క్రీడలు, యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్.సి అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై పీడీ యాక్టు పెట్టాలి

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌పై పీడీ యాక్టు కేసు నమోదు చేయాలని బీఎస్‌పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. పదో తరగతి పేపర్ లీకేజీల వ్యవహారంలో బండి సంజయ్ పాత్రను వరంగల్ పోలీసులు బైటపెట్టారని తెలిపారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం,రాష్ట్రాన్ని అతలాకుతలం చేసి, అధికారంలోకి రావాలని చేసిన కుట్రను, పోలీసులు చేధించడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి కుట్ర జరగకుండా విచారణ చేపట్టి, అసలైన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి పేపర్ లీకైనట్లు నమ్మించేందుకు కుట్ర చేసిన బీజేపీ, రాష్ట్రంలో కాంతి వేగంతో అబద్దాలు,తప్పుడు సమాచారాన్ని సృష్టించి,ప్రచారం చేసిందన్నారు. రాష్ట్రంలో మత కల్లోలాలు సృష్టించే కుట్ర చేసిందని విమర్శించారు.

దక్షిణ మధ్య రైల్వే ఏజీఎంగా ధనంజయులు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ (ఏజీఎం)గా ఐఆర్‌టీఎస్ అధికారి ఆర్ ధనంజయులు గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఆయన దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ (పీసీఓఎం)గా విధులు నిర్వహించారు. మొట్టమొదటగా రైల్వేలో ఏరియా ఆఫీసర్/వాస్కోగా ఆయన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆపరేషన్స్, సేఫ్టీ, కమర్షియల్ డిపార్ట్‌మెంట్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడ విభాగాల్లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే సెక్రెటరీ జనరల్ మేనేజర్, విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా కూడా పనిచేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు స్పెషల్ డ్యూటీ ఆఫీసర్‌గా నామినేట్ అయ్యారు. కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కాంకర్) చీఫ్ జనరల్ మేనేజర్‌గా డిప్యూటేషన్‌పై పనిచేశారు. ధనంజయులు ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా ఉన్న సమయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే 131.854 మిలియన్ టన్నుల సరుకు రవాణాను చేసింది. ఇది జోన్ చరిత్రలో అత్యుత్తమ పనితీరు. దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.13039.25 కోట్ల సరుకు రవాణా ఆదాయంగా నమోదు చేసింది. ఇది జోన్ ప్రారంభమైనప్పటి నుండి ఏ ఆర్థిక సంవత్సరంతో పోల్చినా సరుకు రవాణాలో అత్యధిక ఆదాయాన్ని నమోదు చేసింది.

గురుకుల నోటిఫికేషన్‌పై అభ్యర్థుల హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకుల విద్యాలయాల సంస్థల్లో 9,231 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయడం పట్ల అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. 12 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీఆర్టీకి నోటిఫికేషన్ కూడా త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని గురుకుల పరీక్షలకు నాలుగు నుంచి ఐదు నెలల సమయం ఇవ్వాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న మూడు వేల గురుకుల పోస్టులకు కూడా త్వరగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.